అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 18-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 108 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



మొదటి దశలో హాట్ సీట్లు

బరిలో కీలక నాయకులు

- వీరిలో ఎనిమిది మంది కేంద్రమంత్రులు
- ఇద్దరు మాజీ సీఎంలు, మాజీ గవర్నర్
- 19 నుంచి లోక్‌సభ తొలి విడత ఎన్నికలు
- 21 రాష్ట్రాల్లోని 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- పలు స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ

ముగిసిన ప్రచారం

న్యూఢిల్లీ : లోక్‌సభ తొలిదశ ఎన్నికల్లో భాగంగా ఈనెల 19న 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ)లో 102 స్థానాలకు పోలింగ్ జరగనున్నది. తొలి దశ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వారిలో ఎనిమిది మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఒక మాజీ గవర్నర్ ఉన్నారు.

వీరిలో బీజేపీ అగ్రనాయకులు, కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నాగ్‌పూర్ స్థానం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించాలని చూస్తున్నారు. 2014లో ఆయన ఏడుసార్లు ఎంపీగా ఎన్నికైన విలాస్ ముత్తెంవార్‌ను 2.84 లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. 2019లో ప్రస్తుత మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలేను 2.16 లక్షల ఓట్లతో ఓడించి సీటును నిలబెట్టుకున్నాడు.

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అరుణాచల్ పశ్చిమ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన 2004 నుంచి మూడుసార్లు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. రిజిజు ప్రధాన ప్రత్యర్థి మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నబమ్ టుకీ కావటం ...6లో

నేటి నుంచి నామినేషన్లు

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ



- ఏర్పాట్లలో అధికారులు బిజీ బిజీ
- మే 13న రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్
- మరింతగా పెరగనున్న పొలిటికల్ హీట్

వివరాలు 2లో



కమల సంకల్పం న్యాయ హస్తం

చర్చనీయాంశమవుతున్న బీజేపీ, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలు

- పాత హామీలకే రంగులద్దిన కమలనాథులు
- కాంగ్రెస్ అమ్ములపొది నుంచి కొత్త అస్త్రాలు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరానికి సిద్ధపడుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే తమ మ్యానిఫెస్టోలను ప్రజల ముందు ఉంచాయి. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికకు 'న్యాయ్ పత్ర' అని పేరు పెట్టింది. బీజేపీ తన 'సంకల్ప్ పత్ర'ను విడుదల చేయడానికి పది రోజుల ముందే కాంగ్రెస్ తన ప్రణాళికను ఓటర్లకు చేర్చింది. ఈ రెండు ప్రణాళికలను పరిశీలిస్తే ప్రధాన రాజకీయ ప్రత్యర్థులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సార్వత్రిక ఎన్నికలను ఎలా చూస్తున్నాయో అర్థమవుతుంది. ఓటర్లపై ప్రభావం చూపేందుకు, సానుకూల ఫలితాలు రాబట్టేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

రాజకీయ పార్టీలు వరాల జల్లులు కురిపిస్తూ ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ తన అమ్ములపొది నుండి అనేక వరాల అస్త్రాలను బయటికి తీసింది. బీజేపీ మాత్రం గతంలో తాను ఇచ్చిన హామీలనే గుర్తు చేస్తూ వాటి అమలును కొనసాగిస్తామని చెప్పుకొచ్చింది.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రాష్ట్రాల ప్రణాళికలు

నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పలు విమర్శలు సంధించింది. బీజేపీ మాత్రం పాడిందే పాటరా పాచిపళ్ల దాసుడా అన్న చందంగా 2047 నాటికి భారత్‌ను సంపన్న దేశంగా తీర్చిదిద్దుతామని తెలిపింది. ఇక సంక్షేమానికి రెండు పార్టీలు కొత్త నిర్వచనాన్ని ఇచ్చాయి. పార్టీ పాలనలో ఉన్న రాష్ట్రాలలో అమలు చేస్తున్న కొన్ని సంక్షేమ పథకాలనే కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చేర్చింది. మహాలక్ష్మి



పథకం కింద ప్రతి పేద కుటుంబానికి లక్ష రూపాయలు అందజేస్తామని, లక్ష రూపాయల వార్షిక స్టయిఫండ్‌తో అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పిస్తామని, ప్రభుత్వ పరీక్షలు, నియామక టెస్టులకు దరఖాస్తు ఫీజును రద్దు చేస్తామని, విద్యా రుణాలను మాఫీ చేస్తామని, పాతిక లక్షల రూపాయల నగదు రహిత ఆరోగ్య బీమా కల్పిస్తామని...ఇలా హామీల వరద పారించింది. అన్నింటికంటే ముఖ్యంగా కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపింది.

పాత పథకాలతోనే ముందుకొచ్చిన బీజేపీ

దీనికి భిన్నంగా బీజేపీ ప్రస్తుత సంక్షేమ పథకాల పైనే ఆధారపడింది. భారీ హామీలేవీ ఇవ్వలేదు. అంటే దీనర్థం బీజేపీ మ్యానిఫెస్టోలో హామీలే లేవని కాదు. ఆదాయంతో నిమిత్తం లేకుండా 70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఐదు లక్షల రూపాయల వరకూ ఉచితంగా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. పైప్‌లైన్ల ద్వారా చౌకగా వంట గ్యాస్ సరఫరా చేస్తామని గ్యారంటీ ఇచ్చింది. ముద్ర రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని చెప్పింది. అయినప్పటికీ ప్రత్యర్థి కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ ఇచ్చిన హామీలు తక్కువేనని చెప్పాలి.

రాష్ట్రాల పైనే భారం

హామీల విషయంలో తేడాలు ఉన్నప్పటికీ రెండు పార్టీలు ప్రధానంగా సంక్షేమ రాజకీయాల పైనే ఆధారపడ్డాయి. అధికారంలోకి వస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలు వాస్తవానికి రాష్ట్రాల పైనే ఆర్థిక భారం మోపుతాయి. పథకం లేదా కార్యక్రమం కేంద్రానిదే అయినప్పటికీ రాష్ట్రాలు తమ వంతు వాటాగా కొంత మొత్తాన్ని అందజేయాల్సి ఉంటుంది. దీంతో అసలే వనరుల కొరతతో కునారిల్లుతున్న రాష్ట్రాల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారవుతోంది.

కులాలపై కాంగ్రెస్ దృష్టి

రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పాతిక హామీలు యువత, మహిళలు, కార్మికులు, రైతులను పార్టీ వైపు ఆకర్షించేందుకు ఉపకరించవచ్చు. సమానత్వం, ...13లో

ఆయన అవినీతికి ఛాంపియన్

మోడీపై మండిపడిన రాహుల్

- బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ స్కీమ్
- బీజేపీ స్కోరు 150 దాటదు
- అమేథీలో పోటీపై పార్టీదే నిర్ణయం

వివరాలు 13లో

పోరాటాల గడ్డపై ఎర్రజెండా ఎగరాలి

భువనగిరి కోట నుంచి పార్లమెంట్‌కు కమ్యూనిస్టు బిడ్డను పంపాలి

- 19న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ నామినేషన్
- భారీప్రదర్శన, బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు బీవీ రాఘవులు,తమ్మినేని : పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ -నకిరేకల్

పోరాటాల గడ్డ నుంచి ఎర్రజెండా ముద్దుబిడ్డ సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను పార్లమెంట్‌కు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద మోసగాడు అని, మూడోసారి గెలిస్తే ...13లో



దక్షిణాదిపై బీజేపీ వివక్ష

పదేండ్లుగా మోడీ దేశాన్ని మోసం చేశారు

- కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ : వయనాడ్ ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణాది రాష్ట్రాల పట్ల బీజేపీ వివక్ష చూపిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న కేరళలోని వయనాడ్ లోకసభ ఎన్నికల ప్రచార సభలో బుధవారం పాల్గొని ప్రసంగించారు. బుల్లెట్ రైలు, సబర్మతి తరహాలో రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ తదితర ప్రాజెక్ట్‌లకు ఎందుకు అనుమతించలేదని ...6లో

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రభుత్వం తరఫున సీఎస్ లాంఛనాలు

- నేడు పట్టాభిషేక మహోత్సవం





నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అభిజిత్ లగ్న మూహూర్త సమయాన సీతమ్మ మెడలో రామయ్య తాళి కట్టడంతో కల్యాణ క్రతువు పూర్తయింది. మిథులా స్టేడియంలోని మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం రామాలయంలో మూలవరులకు మొదట కల్యాణం జరిగింది. ఆపై ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మిథులా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కాగా.. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యలకు రుత్వికులు జీలకర్ర బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ గావించారు. తరువాత భక్తులు గోటితో ఒలిచిన తలంబ్రాలను సీతారాముల శిరస్సుపై పోశారు. తదనంతర కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. పట్టాభిషేక ...13లో

సీన్ రిపీట్..!

- ఇప్పుడు కూడా అందరికన్నా ముందే..
- ఈసారైనా వ్యూహం ఫలించేనా..?
- నేడు బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫాంల అందజేత
- ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షల చెక్కును ఇవ్వనున్న కేసీఆర్

3లో..

ముంచెత్తిన వరదలు


- యూఏఈ, ఒమన్‌లో కుండపోత..18 మంది మృతి
- భారత్..యూఏఈ విమానాలు రద్దు



వివరాలు 6లో

భారత జనాభా 144 కోట్లు

- 0-14 ఏండ్ల వయస్సు వారు 24 శాతం మంది
- ప్రసూతి మరణాలు 8 శాతం
- 'ఆ మహిళల' పట్ల ఎక్కువ లింగ వివక్ష
- ఆరోగ్య సంరక్షణలోనూ అసమానతలు : యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక



వివరాలు 6లో

కేసీఆర్.. నీ పార్టీని మూడు నెలల్లో

బొంద పెడతాం

కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బీఆర్ఎస్ పునాదులుండవు

- కవిత జైలుకుపోయినా బుద్ధి రాలేదా?
- ధైర్యం లేకనే అసెంబ్లీకి దూరం
- ఎంపీ ఎన్నికల్లో 14 సీట్లు మావే.. : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కేసీఆర్ నిన్ను.. నీ పార్టీని మూడు నెలల్లో రాజకీయంగా బొంద పెడతాం. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బీఆర్ఎస్‌కు పునాదులుండవు. కుమార్తె కవిత జైలుకుపోయినా మీకు ఇంకా బుద్ధి రాలేదా' అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయించి.. ఇంట్లో భార్యాభర్తలు మాట్లాడుకునేవి కూడా విని దేశంలో ఎక్కడా లేని దరిద్రమైన పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏడాదిలో ఎలా పడగొడతావు? దోపిడీ దొంగవై మా ఎమ్మెల్యేలను కొనాలనుకుంటున్నావా అని ప్రశ్నించారు. తాము తలుచుకుంటే మీ బంధువులు ముగ్గురు, నలుగురు తప్ప ...13లో



రాములమ్మ ఎక్కడ..!

మూగపోయిన విజయశాంతి ట్విట్టర్ .. మెదక్ సీటు ఇవ్వనందుకు అలిగారా?

- ఇమడలేక ఇంటికే పరిమితమయ్యారా?
- పార్టీలో చేర్చుకుని పదవి ఇవ్వకుండా అవమానిస్తున్నారా?
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకే ఒక్కసారి గాంధీభవన్‌కు...
- పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి వచ్చేనా?
- పని చేయని సీనియర్ల రాయబారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సినీనటి, కాంగ్రెస్ సీనియర్ నేత విజయశాంతి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో పొలిటికల్ ఫైర్ బ్రాండ్ జాడ ఎక్కడా లేకపోవడంతో రాములమ్మ ఏమైంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా సమస్యలు, ప్రత్యర్థుల విమర్శలకు పదునైన మాటలతో ఎప్పటికప్పుడు ట్విట్టర్ ద్వారా ధీటైన కౌంటర్లు ఇచ్చే రాములమ్మ ఎందుకిలా మారిపోయారనే చర్చ జరుగుతున్నది. ప్రస్తుతానికి విజయశాంతి ట్విట్టర్ పిట్ట కూడా మూగపోయింది. ఈ క్రమంలో విజయశాంతి ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? రాజకీయాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారు? అనే చర్చ ఆసక్తికరంగా మారింది.

నిరాశ పరిచిన మెదక్ సీటు

గతంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలోనే మెదక్ ఎంపీ సీటును విజయశాంతి ఆశించారు. ఈ విషయంలో పార్టీ హామీ ఇవ్వకపోయినా ఆమె మాత్రం ఆసీటుపై బలంగానే పట్టుపట్టారు. కానీ మారిన రాజకీయ సమీకరణాల్లో భాగంగా సీటును నీలం మధుకు కేటాయించింది. ఈ విషయంలో పార్టీ కనీసం తన అభిప్రాయాన్ని కూడా తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ కారణంగానే మనస్థాపానికి గురై ఆమె రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రాములమ్మ...ఆ తర్వాత ఏ కార్యక్రమంలోనూ పాల్గొనడం లేదు. ఇటీవల ...13లో

నేటి నుంచి నామినేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం నేటి నుంచి మొదలు కానుంది. గత నెలలో షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేయగానే ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. పార్లమెంట్‌తో పాటు పలు అసెంబ్లీలకు దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 19న మొదలైన ప్రక్రియ జూన్ 1న ముగియనుంది. నాలుగో దశలో భాగంగా రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనుంది. నామినేషన్లకు సంబంధించి రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం మినహా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఎంపీ అభ్యర్థులు కలెక్టర్ చాంబర్లో, ఎమ్మెల్యే అభ్యర్థులు ఆయా నియోజక వర్గాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారు. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు 144 సెక్షన్ విధించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారికేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఒక్కరి కదలికలను గమనించేందుకు ప్రతీ నామినేషన్‌ను వీడియో గ్రఫీ చేయనున్నారు.

పెరగనున్న పొలిటికల్ హీట్

గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుండటంతో రాష్ట్రంలో పొలిటికల్ హీట్ మరింత పెరిగే అవకాశం ఉంది. సూటిపోటి మాటలు ఘాటైన విమర్శల నేపథ్యంలో ఇప్పటికే ఉద్వేగ భరితమైన వాతావరణం నెలకొంది. నేతలు తమ పార్టీ మ్యానిఫెస్టోలను ఏ కరువు పెడుతూనే ఒకరిపై ఒకరు మాటల తూటాలను పేల్చుకుంటున్నారు. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి అభ్యర్థులు ఒకరిపైనొకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. కాగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మొత్తం 17 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ మాత్రం 15 స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల్లో నెలకొన్న పోటీ నేపథ్యంలో అక్కడ అభ్యర్థిత్వాలు ఓ కొలిక్కి రాలేదు. ఎప్పటిలాగే ఎంఐఎం హైదరాబాద్ స్థానం నుంచి ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ బరిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) భువనగిరి స్థానం నుంచి బరిలో నిలిచింది. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రచారం నిర్వహిస్తూ తనదైన శైలిలో దూసుకుపోతోంది. డబ్బు, అధికారం, కులం, తదితర అంశాలు ప్రాతిపదికగా హెూరాహెూరీగా సాగుతున్న ప్రస్తుత ఎన్నికల సంగ్రామంలో ఓటర్లు ఎవరిని కనికరిస్తారో జూన్ 4న తేలనుంది.

ఎన్నికల షెడ్యూల్

నేటి నుంచి (గురువారం) నామినేషన్ల స్వీకరణ
ఈ నెల 25 నామినేషన్లకు చివరి రోజు
ఈ నెల 26 నామినేషన్ల పరిశీలన
ఈ నెల 29 ఉపసంహరణ గడువు
మే 13 పోలింగ్
జూన్ 4న ఫలితాల ప్రకటన

ఎలాంటి అవాంతరాలు లేకుండా నామినేషన్ల స్వీకరణ : వికాస్ రాజ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎలాంటి అవాంతరాలు లేకుండా గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించాలని ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ రిటర్నింగ్ అధికారులను, ఎన్నికల విధుల్లో నియమించబడిన ఇతర అధికారులను కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేదా సమస్య లేకుండా బందోబస్తుతోపాటు అన్ని ఇతర ఏర్పాట్లు చేయడానికి, నామినేషన్ ప్రక్రియను విజయవంతం చేయడానికి వారు అనుసరించాల్సిన మరియు చేయకూడని పనులపై బుధవారం ఆర్వోలు, ఏఆర్వోలు, జిల్లా కలెక్టర్లను ఉద్దేశించి ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయనతో పాటు అదనపు సీఈవో ఎల్.లోకేష్ కుమార్, జాయింట్ సీఈవో సరాఫ్రాజ్ అహ్మద్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 18న ఉదయం 11 గంటల్లోపు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ ఏప్రిల్ 25 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల నుండి నామినేషన్లను ఆర్వో కార్యాలయాల్లో స్వీకరించాలన్నారు. "రాబోయే 30 రోజులు చాలా ముఖ్యమైనవని, అభ్యర్థి నుంచి నామినేషన్ స్వీకరించేటప్పుడు ఆర్వోలు తమ ఛాంబర్‌లోకి నిబంధనలకు అనుగుణంగా అనుమతించాలని, ఎక్కువ మందిని అనుమతించకూడదని ఆయన నొక్కి చెప్పారు.

తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా మీడియాకు అవసరమైన సమాచారాన్ని అధికారికంగా ఆర్వోలు, కలెక్టర్లు ఇవ్వాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లను తెరవడానికి లేదా మూసివేయడానికి తమకున్న అధికారాన్ని ఏ కింది స్థాయి అధికారికి అప్పగించకూడదని, స్ట్రాంగ్ రూమ్‌లను తెరవడం మరియు మూసివేయడం తప్పనిసరిగా అభ్యర్థుల సమక్షంలోనే చేయాలన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు

కేసీఆర్ వ్యాఖ్యలపై బండి సుధాకర్‌గౌడ్ ఫైర్



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాటు కూడా ఉండదేమో అని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు లాంటిదని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. పీకల్లోతు కుంభకోణాల్లో ఇరుక్కున్న ఆయన అసహనంతో సీఎం రేవంత్‌రెడ్డిపై పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేపదే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ మాట్లాడడం తమ పార్టీ ఎమ్మెల్యేలను అవమానించడమే అవుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే బేషరతుగా తమ పార్టీ ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు పూర్తి మెజార్టీ ఉందనీ, పదవులకు, డబ్బులకు, ప్రలోభాలకు ఆశపడే ఎమ్మెల్యేలు ఎవరూ తమ వద్ద లేరని తెలిపారు. పదేండ్లుగా అధికారంలో ఉన్న కేసీఆర్ ఏ ఒక్క రోజు కూడా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయలేదని విమర్శించారు. అలాంటప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్‌ను అవమానించిందంటూ ఆయన గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న దృష్ట్యా ప్రభుత్వ ఆధ్వర్యంలో మహా నాయకుల జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించలేకపోయిందని స్పష్టం చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, కొమురం భీమ్, అంబేద్కర్ వంటి మహనీయుల జయంతులు ఏప్రిల్‌లోనే ఉన్నాయని గుర్తు చేశారు. వాటిని కూడా ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రభుత్వం నిర్వహించలేకపోయిందని తెలిపారు. భద్రాచలంలో శ్రీ రాములవారి కళ్యాణ మహోత్సవానికి కూడా ఎన్నికల కోడ్ రావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం వెళ్లలేకపోయారని పేర్కొన్నారు. కేసీఆర్ వాస్తవాలను వక్రీకరించి తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం సరైందికాదని గుర్తు చేశారు

కాంగ్రెస్ తీరు వల్లే విద్యార్థుల ఆత్మహత్యలు : గెల్లు శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యా శాఖను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నా విద్యా శాఖను తన వద్దే పెట్టుకున్న సీఎం ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఆ శాఖపై సమీక్ష నిర్వహించలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ తీరుతో విద్యాశాఖలో సమస్యలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. గురుకుల పాఠశాలల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకం భోజనాలు పెడుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీచైతన్య, నారాయణ తదితర కార్పొరేట్ కాలేజీల్లో ఫీజులు భారీగా పెంచారని తెలిపారు. కోమటి రెడ్డి బ్రదర్స్ తమ ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్‌ను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు.

మా 'సోషల్ మీడియా' పై వేధింపులు

- పునరావృతం కాకుండా చూడండి
- డీజీపీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు బుధవారం హైదరాబాద్‌లో డీజీపీ రవి గుప్తాను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విధానాలను, పనితీరును ప్రశ్నించిన వారిపై అసహనంతో అక్రమ కేసులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో బీఆర్ఎస్‌కు చెందిన కార్యకర్త సల్వాజీ మాధవ రావు, ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెడుతున్నాడనే కారణంతో సొగాలి తిరుపతి అనే రౌడీ షీటర్ ద్వారా హత్యాయత్నం చేయించారని తెలిపారు. నిందితులపై చర్యలు తీసుకోకుండా బాధితుడిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. కింది స్థాయిలో కొంతమంది పోలీస్ అధికారులు ప్రభుత్వానికి వంత పాడుతూ తమ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని వివరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని వారు డీజీపీకి విజ్ఞప్తి చేశారు.



ముర్షిదాబాద్‌లో సలీంకే ప్రజల మద్దతు

- సీపీఐ(ఎం) నుంచి పోటీ
- బెంగాల్‌లో అత్యంత పోటీ గల నియోజకవర్గాల్లో ఇదొకటి
- కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ● టీఎంసీ, బీజేపీకి చెమటలు

ముర్షిదాబాద్ బెంగాల్‌లోని అత్యంత పోటీగల నియోజకవర్గాలలో ఒకటి. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు. సలీంకు కాంగ్రెస్ సైతం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. దీంతో టీఎంసీ, బీజేపీ పార్టీలకు చెమటలు పడుతున్నాయి.

బ్రిటిష్ పాలనకు ముందు ముర్షిదాబాద్ గ్రేటర్ బెంగాల్ రాజధాని. బ్రిటిష్ వారిని వణికించిన సిరాజ్ ఉద్ దౌలాతో సహా నవాబులే పాలకులు. అనేక స్మారక కట్టడాలతో కూడిన చారిత్రక భూమి మత సామరస్యానికి కూడా అనుకూలంగా ఉంటుంది. 65 శాతం ముస్లిం మైనారిటీ కమ్యూనిటీలతో ఈ ప్రాంతం మత సామరస్యానికి ప్రతిరూపం. మెజారిటీ రైతులే. బీడీ పరిశ్రమకు, హస్తకళలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతం చాలా కాలంగా కమ్యూనిస్టు ఉద్యమాలకు బలమైన పునాది. పలుమార్లు ఇక్కడ కమ్యూనిస్టులు గెలిచారు. తృణమూల్ పాలన అణచివేతలను తట్టుకుని, సీపీఐ(ఎం) బలమైన పునరాగమనం చేస్తోంది. సలీం అభ్యర్థిత్వం అందుకు పెద్ద మేల్కొలుపు.


దేశ మనుగడ కోసం వామపక్ష లౌకిక శక్తులను గెలిపించేందుకు ద్వేషపూరిత రాజకీయాలకు ప్రతిరూపమైన బీజేపీని, తణమూల్‌ను ఓడించాల్సిన అవసరాన్ని సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ సలీం వివరించారు. మహిళలు, యువకులు కూడా పెద్ద ఎత్తున ఎన్నికల సభలకు తరలిరావడం ఉత్కంఠ రేపుతోంది. 2014 వరకు నిరంతరంగా సీపీఐ(ఎం) గెలిచిన ఈ నియోజకవర్గాన్ని 2019లో తృణమూల్ గెలుచుకుంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ తృణ మూల్‌దే పైచేయి. అయితే, 2023లో పంచాయతీ ఎన్నికల్లో విస్తృత హింసను ఎదుర్కొన్న లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్ బలమైన పునరాగమనం చేశాయి.



ముర్షిదాబాద్‌లోని రాణి నగర్ సారవంతమైనది. వరి, జనపనారతో నిండిన పొలాలు. పొలాల్లో ఎక్కడ చూసినా నాగలి దున్నే, ఎరువు చల్లే రైతులతో అరటి, మునగ పంటలు కనిపిస్తాయి. ఇది రాజకీయంగా కూడా చురుకైన ప్రాంతం. గ్రామాల్లో ఇళ్ల గోడలపై రాజకీయ పార్టీల చిహ్నాలు ఉన్నాయి. సీపీఐ(ఎం) ఎన్నికల గుర్తు సుత్తి, కొడవలి నక్షత్రం ఎక్కువగా గోడలపై కనబడుతుంది. ముర్షిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గ లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి ముహమ్మద్ సలీమ్ పర్యటనతో రాణినగర్ మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. సలీం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు మక్తపాడు గ్రామానికి చేరుకోగా.. మహిళలు, చిన్నారులు సహా వందలాది మంది ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కొన్ని మాటల్లో వారికి కృతజ్ఞతలు తెలిపిన సలీం సమీపంలోని రెండు మూడు ఇండ్లకు వెళ్లి వద్ద తల్లులను కలుసుకుని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముందుకు సాగిన కాన్వాయ్‌లో ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రిక్ ఆటోలు బారులు తీరాయి. గ్రామీణ రహదారులపై పూల వర్షం కురిపిస్తూ చేతులు ఊపుతూ శుభాకాంక్షలు తెలిపారు. నిర్దేశిత రిసెప్షన్ సెంటర్లతో పాటు, రోడ్లపై బైక్‌పై సలీం గ్రామస్తులను పలకరించారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా మెరిసిన రాష్ట్ర మాజీ మంత్రి సలీం అందరికీ సుపరిచితమే. డీవైఎఫ్ఐ నాయకుడిగా ఉన్నప్పటి నుంచి సలీం చేసిన పోరాటాలను ఈ ప్రాంతం కూడా చూసింది. పల్లెల నుంచి పట్టణాలకు చేరుకునే సరికి ఈ యాత్ర పెద్ద ఊరేగింపుగా మారింది. సంగీత బృందాలతో పాటు, కార్యకర్తలు సైకిళ్లపై, కాలినడకన ప్రయాణించారు. దారి పొడవునా స్వాగతాలను అందుకోవాల్సినందున ప్రజలు అనుకున్న దానికంటే ఆలస్యంగా వచ్చినప్పటికీ ఆయన వేచి ఉన్నారు. చిన్న చిన్న ప్రసంగాలలో సలీం టీఎంసీ, బీజేపీని ఎండగడుతున్నప్పుడు ఏకధాటిగా చప్పట్లు మార్మోగాయి. బెంగాల్ నుంచి ఎర్రజెండాను పంపించాలని పిలుపునిచ్చిన వారు అవినీతిలో కూరుకుపోయారని ఆయన ఎత్తిచూపారని పేర్కొన్నారు.

2014లో చిన్న రైతులు, కూలీలు ఎక్కువగా ఉండే ముర్షిదాబాద్‌లో సీపీఐ(ఎం) చెందిన బదరు దోసాఖాన్ విజయం సాధించారు. గత సారి టీఎంసీ అభ్యర్థి అబూ తాహిర్ ఖాన్ గెలిచారు. ఈసారి కూడా తాహిర్ ఖాన్ టీఎంసీ అభ్యర్థి. బీజేపీ అభ్యర్థి గౌరీ శంకర్ ఘోష్. అయితే సీపీఐ(ఎం), టీఎంసీ మధ్యే ప్రధాన పోటీ ఉంది. ముర్షిదాబాద్ 15 లక్షల మంది ఓటర్లతో అత్యధిక జనాభా కలిగిన నియోజకవర్గం. జాతీయోద్యమంలో మరువలేని పాత్ర పోషించిన ముర్షిదాబాద్ లౌకికవాదాన్ని, పోరాట పటిమను కాపాడుకునేందుకు సిద్ధమవుతోంది.

రసవత్తరంగా బెంగాల్ రాజకీయం



దీదీ, మోడీ ప్రభుత్వాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

- పుంజుకుంటున్న వామపక్షాలు ● బలోపేతమైన ఇండియా ఫోరం

– జె.జగదీష్, నవతెలంగాణ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు ఈ సారి రసవత్తరంగా మారనున్నాయి. మోదీ నియంతృత్వ పోకడలకు, మమతా బెనర్జీ అహంకార ధోరణులకు వ్యతిరేకంగా ఇండియా ఫోరం పోరాటం కానుంది. కుంభకోణాలు, అరాచక విధానాలు, ప్రభుత్వ వ్యతిరేకతతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టీఎంసీ, బీజేపీ, కమ్యూనిస్ట్– కాంగ్రెస్ ఫోరం మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. మమతా బెనర్జీ, బీజేపీకి ఈసారి పార్లమెంటు ఎన్నికలు నల్లేరుపై నడక కాదు. 2019లో 22 నియోజకవర్గాల్లో నెగ్గిన తృణమూల్ కాంగ్రెస్, 18 స్థానాల్లో గెలిచిన బీజేపీకి ఈసారి సగం స్థానాలైనా నెగ్గుతాయన్నది అనుమానమే. వరుస స్కామ్‌లు, స్కామ్‌లలో చిక్కినవారిని రక్షించే వైఖరి, నార్త్ 24 పరగణాల జిల్లా సందేశ్ ఖలీలో భూకబ్జాలు, మహిళలపై లైంగికదాడులకు పాల్పడ్డ షాజహాన్ షేక్ ను రక్షించేందుకు చేసిన యత్నాలు, ప్రజల్లో టీఎంసీ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత తెచ్చిపెట్టాయి. అలాగే ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతు సమస్యలు, సీఏఏ వంటి వాటివల్ల మోడీ సర్కార్ తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుంది. బెంగాల్‌లో బీజేపీ కుల, మత విభజనకు పాల్పడుతోంది. అక్కడ ప్రజాస్వామ్య వాతావరణాన్ని ధ్వంసం చేస్తూ ప్రజలు ఐక్యంగా ఉండకుండా విభజనను సృష్టించింది.

ఏ పార్టీ, ఎన్ని సీట్లలో పోటీ?

పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ, బీజేపీ ఒంటరిగానే బరిలోకి దిగాయి. అప్పటి వరకు ఇండియా ఫోరంతో కలిసి నడిచిన మమతా బెనర్జీ, చివరి నిమిషంలో ఒంటరిగా పోటీకి సిద్ధమైంది. బీజేపీ కూడా ఒంటరి పోరుకే సిద్ధపడింది. ఇండియా ఫోరంలో భాగంగా సీపీఐ(ఎం), కాంగ్రెస్, సీపీఐ, ఆర్‌ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు పోటీ చేస్తున్నాయి. టీఎంసీ, బీజేపీలు 42 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇండియా ఫోరం పార్టీల్లో సీపీఐ(ఎం) 23, కాంగ్రెస్ 12, ఆర్‌ఎస్పీ 3, సీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్‌లు చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ పేరుతో ముస్లింలు ప్రత్యేకగా 42 సీట్లకు పోటీ పడుతున్నారు. దీంతో పలు చోట్ల త్రిముఖ పోటీలు, చతుర్ముఖ పోటీలు జరిగే అవకాశం ఉంది. 2019లో మొత్తం 42 లోక్‌సభ స్థానాల్లో 22 టీఎంసీ, 18 బీజేపీ, 2 కాంగ్రెస్ గెలిచాయి.

రాష్ట్ర రాజధాని కలకత్తాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సీపీఐ(ఎం) తరపున ఈసారి ఎక్కువ మంది యువకులు పోటీ చేస్తున్నారు. విద్యార్థి, యువజన నాయకులు, న్యాయవాది, ఉపాధ్యాయ రంగాల నేతలు సీపీఐ(ఎం) తరపున బరిలో ఉన్నారు. సీపీఐ(ఎం) పోటీ చేసే 23 స్థానాల్లో 20 మంది అభ్యర్థులు 45 ఏండ్ల లోపు వారే. వామపక్షాల అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల బాండ్లు, రాష్ట్రంలోని టీఎంసీ ప్రభుత్వ అవినీతి, మతోన్మాదం వంటి అంశాలతోపాటూ స్థానికంగా సంచలనం కలిగించిన సందేశ్‌ఖలి అంశాలపై ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. సీపీఐ(ఎం) నేత సుజన్ చక్రవర్తి డమ్‌డమ్ నుండి పోటీ చేస్తున్నారు. ఈ ప్రాంత కార్మికుల దుస్థితి గురించి బాగా అర్థం చేసుకున్న చక్రవర్తి ఈసారి తన గెలుపునకు అవకాశాలు బాగుంటాయని ఆశిస్తున్నారు. జాదవ్‌పూర్ నుండి వామపక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన సృజన్ భట్టాచార్య, ముర్షిదాబాద్ నుంచి మహ్మద్ సలీంలు కూడా స్థానిక సమస్యలతోపాటూ సందేశ్‌ఖలిపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. సీపీఐ(ఎం) తరపున మీనక్షి ముఖర్జీ, శత్రూప్ ఘోష్, అభాస్ రాయ్ చౌదరి, ఎండి సలీంలు ప్రచారం చేస్తున్నారు.

పుంజుకున్న సీపీఐ(ఎం), వామపక్షాలు

పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం), వామపక్షాలు పుంజుకున్నాయి. రాష్ట్ర ఆందోళనలు, క్షేత్రస్థాయి పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టిన సీపీఐ(ఎం) అందుకను గుణంగా కార్యాచరణలోకి వెళ్లింది. గ్రామ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్ర స్థాయి నేతలు క్షేత్ర స్థాయికి వెళ్లి ఆందోళనల్లో పాల్గొనేవారు. ఇటీవల కాలం రాష్ట్ర రాజకీయాల్లో యువజన సంఘం కీలక పాత్ర పోషించింది. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 50 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను కలుపుతూ మూడు వేల కిలోమీటర్ల మేర "ఇన్సాఫ్" యాత్ర జరిగింది. ఈ యాత్రలో 12 లక్షల మంది ప్రజలు భాగస్వామ్య మయ్యారు. అనంతరం కలకత్తాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జస్టిస్ ర్యాలీ నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా బెంగాల్‌లో సీపీఐ(ఎం), వామపక్షాల పాత్రపై మీడియాలో చర్చనీయాంశమైంది.



సామాజిక సమీకరణలు

పశ్చిమ బెంగాల్‌లో అన్ని సామాజిక వర్గాలు బలంగా ఉన్నాయి. అక్కడ మైనార్టీలు కూడా బలమైన ప్రజా సమూహంగా ఉన్నారు. అయితే బీజేపీ మతోన్మాద చర్యలతో రాజకీయ పబ్బం గడుపుకోవడానికి తీవ్రమైన కుట్ర పన్నుతోంది. మైనార్టీలకు వ్యతిరేకంగా మెజార్టీలను ఉసుగొల్పుతుంది. సీపీఐ(ఎం) నేతృత్వంలో 34 ఏండ్ల సుదీర్ఘ వామపక్ష ప్రభుత్వం హయాంలో మత హింసకు చోటు లేదు. మమతా బెనర్జీ వచ్చిన తరువాత, రాష్ట్రంలో బీజేపీకి అవకాశం కల్పించింది. దీంతో బీజేపీ మెజారిటీ మత రాజకీయాలకు పాల్పడితే, మమతా బెనర్జీ మైనార్టీ మత రాజకీయాలకు పాల్పడుతోంది. ఫలితంగా హింస, తగాదాలు, దాడులు పరస్పరం పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో మత సామరస్యం మంటగలుస్తోంది. ఈ రెండు పార్టీల మత రాజకీయాలను వ్యతిరేకంగా సీపీఐ(ఎం), వామపక్షాలు పోరాడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఒబిసి 17 –20 శాతం, ఒసి 15–18 శాతం, ఎస్సీలు 23.51 శాతం, ఎస్టీలు 5.8 శాతం, ముస్లింలు 30 శాతం సామాజిక వర్గాల ప్రజలు ఉన్నారు. ఎస్సీల్లో మూడు ప్రధాన ఉప కులాలు రాజబన్షి 18.4 శాతం, నామసుద్ర 17.4 శాతం, బగ్ది 14.9 శాతం ఉన్నారు. ఎస్సీల్లో 90 శాతం బంగ్లాదేశ్ మూలాలు ఉన్నవారే. అందుకే బీజేపీ సీఏఏ తెచ్చి లాభపడింది. పెద్ద నగరాల్లో ఆధిపత్యం చెలాయించే బ్రాహ్మణ, వైద్య, కృష్ణ అగ్రకులాలు 15 నుండి 18 శాతం ఉన్నారు. వీరిలో మతం పేరుతో బీజేపీ చొరబడింది.

మొత్తం ఓట్లు- 7,58,37,778
మహిళలు - 3,73,04,960
పురుషులు - 3,85,32,818
మొత్తం లోక్‌సభ స్థానాలు- 42

ప్రధాన సమస్యలు

పశ్చిమ బెంగాల్‌లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన అంశాలు పౌరసత్వం సవరణ చట్టం, జూట్ మిల్లు కార్మికులు, జూట్ సాగు రైతుల సమస్యలు, ధరల పెరుగుదల, ఇతర సమస్యలు ఉన్నాయి. లక్షలాది మందికి ఉపాధి కల్పించిన జూట్ మిల్లులు, జూట్ సాగు రైతులు ప్రస్తుతం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పెరిగిపోతున్న శాంతి భద్రతల సమస్య పట్ల సామాన్య జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మమతా బెనర్జీ పరిస్థితిని అదుపు చేయలేయడం లేదని కాంగ్రెస్, వామపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఏడు దశల్లో పోలింగ్

లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని 42 సీట్లకు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకూ ఏడు దశల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే భగబంగోలా, బారా నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు మే7న, జూన్ 1న ఉప ఎన్నికలు జరుగుతాయి. ఎంపీ ఎన్నికలు తొలిదశలో ఏప్రిల్ 19న కూచ్ బెహర్, అలీపు ర్దువార్స్, జల్పాయిగురి స్థానాలకు జరుగుతాయి. ఏప్రిల్ 26న డార్జిలింగ్, రాయ్ గంజ్, బాలూర్ ఘాట్, స్థానాలకు, మే 7న మూడో దశలో మాల్డా ఉత్తర్, మాల్డా దక్షిణ్, జంగిపూర్, ముర్షిదాబాద్ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. నాలుగో దశలో మే 13న బహరాంపూర్. కృష్ణానగర్, రాణాఘాట్, బర్ధమాన్ పుర్బా, బుర్ద్వాన్–దుర్గాపూర్, అసన్సోల్, బోల్పూర్, బీర్భూమ్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఐదో దశలో మే 20న బంగావ్, బరాక్పూర్, హౌరా, ఉలుబేరియా, శ్రీరాంపూర్, హుగ్లీ, ఆరాంబాగ్ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. మే 26న ఆరో దశలో తుమ్లుక్ , కాంతి, ఘటాల్, ఝుర్ గామ్, మేదినీ పూర్, పురూలియా, బంకూరా, బిష్ణుపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతాయి. జూన్ 1న చివరి దశలో డమ్ డమ్, బరాసత్, బసిర్హాట్, జయనగర్, మధురాపూర్, డైమండ్ హార్బర్, జాదవ్ పూర్, కోల్కతా దక్షిణ్, కల్‌కత్తా ఉత్తర నియోజకవర్గాలకు పోలింగ్‌తో ఎన్నికలు పూర్తి అవుతాయి.

సీన్ రిపీట్!

- ఇప్పుడు కూడా అందరికన్నా ముందే.. ● ఈ సారైనా వ్యూహం ఫలించేనా..?
- నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫాంల అందజేత
- ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షల చెక్కును ఇవ్వనున్న కేసీఆర్ ● బస్సు యాత్రకు ప్రణాళిక
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ అభ్యర్థులకు దిశా నిర్దేశం చేయనున్న గులాబీ బాస్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దాదాపు మూణ్నెల్ల ముందే అభ్యర్థులను ప్రకటించి, అన్ని పార్టీల కంటే ముందే బీఫాంలను అందజేసిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్... ఈసారి కూడా అదే వ్యూహాన్ని అనుసరించబోతున్నారు. తద్వారా పార్టీ తరపున పోటీ చేయబోయే ఎంపీ అభ్యర్థుల్లో ఆయన జోష్‌ను నింపనున్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకంటే ఒకడుగు ముందుకేసి అందరికంటే ముందుగానే బీఫాంలను అందజేయనుండటం గమనార్హం. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాబోతున్న తరుణంలో సైతం అధికార కాంగ్రెస్ అభ్యర్థుల విషయంలో డైలమాలో ఉంది. ఇంకా మూడు స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. రాష్ట్రంలోని 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ... ఒకట్రెండు స్థానాల్లో వారిని మార్చేందుకు నానా తంటాలూ పడుతోంది. ఈ రెండు పార్టీల పరిస్థితి ఈ విధంగా ఉంటే... కేసీఆర్ మాత్రం గురువారం తన పార్టీ అభ్యర్థులకు ఏకంగా బీఫాంలనే అందజేయనుండటం గమనార్హం. వాటితోపాటు ఎన్నికల ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.95 లక్షల చెక్కును పార్టీ తరపున ఆయన ఇవ్వనున్నారు. ఇదే సమయంలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేందుకు వీలుగా తన రాష్ట్రవ్యాప్త పర్యటనల నిమిత్తం బస్సు యాత్రకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను, సంబంధిత ప్రణాళికను ఆయన విడుదల చేయనున్నారు.

గురువారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, లోక్‌సభ అభ్యర్థులతో భేటీ కానున్న ఆయన... ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను, ప్రచారం చేయాల్సి తీరును వివరించనున్నారు. అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు ఎలా విడమరిచి చెప్పాలనే విషయమై ఆయన వారికి దిశా నిర్దేశం చేయనున్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల టిక్కెట్లు ఇచ్చిన తర్వాత కూడా పలువురు నేతలు బీఆర్‌ఎస్‌కు హ్యాండిచ్చిన సంగతి విదితమే. వీరిలో కడియం శ్రీహరి, గడ్డం రంజిత్ రెడ్డి, కే.కేశవరావు తదితర సీనియర్లు కూడా ఉన్నారు. వీరితోపాటు ఖైరతాబాద్, భద్రాచలం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు కూడా పార్టీని వీడారు. హైదరాబాద్ నగరంలో కీలక నాయకుడైన మాజీ మంత్రి మల్లారెడ్డి లాంటి వారు సైతం సైలెంటయిపోయారు. ఈ నేపథ్యంలో కారు పార్టీలో నైరాశ్యం నెలకొంది. దీన్ని పోగొట్టి, క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపేందుకు కేసీఆర్ పలు వ్యూహాలు రచించారు. అందులో భాగంగానే నిన్నటి వరకూ ఎండిన పంట పొలాల పరిశీలన పేరుతో జిల్లాల్లో పర్యటించిన ఆయన... ఇప్పుడు అన్ని పార్టీల కొంటే ముందుగా బీఫాంలను అందజేయటం ద్వారా నాయకులు, కార్యకర్తల్లో జోష్‌ను నింపేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వని ఆయన వ్యూహం... మరి లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి రిజల్ట్‌ను ఇవ్వబోతుందో చూడాలి.



చట్టవిరుద్ధంగా వైట్ పెట్రోలియం జెల్లీ తయారీ

- జ్వరానికి మందులంటూ తప్పుడు ప్రచారం
- డీసీఏ దాడుల్లో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. కల్తీ మందులు లేని రాష్ట్రమే తమ లక్ష్యమంటూ కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న దాడుల్లో ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట చట్టవిరుద్ధ కార్యకలాపాలు వెలుగు చూస్తున్నాయి. కుత్బుల్లాపూర్ పేట్ బషీర్‌బాద్ లోని ఒక మెడికల్ షాప్‌పై దాడి చేయగా ప్యూర్‌లైన్ పేరుతో వైట్ పెట్రోలియం జెల్లీని అమ్ముతున్నట్టు బయటపడింది. దీంతో లేబర్ లేకుండా దీన్ని తయారు చేస్తున్న హైదరాబాద్ శివరాంపల్లిలోని జూబిలెంట్ కాస్మోస్యూటికల్స్‌పై దాడి చేసి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. జ్వరం తగ్గిస్తుందంటూ తప్పుడు ప్రచారంతో అమ్ముతున్న అల్టాకోస్ట్ సస్పెన్షన్ మందును రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, అత్తాపూర్ మెడికల్ షాపులో కనుగొన్నారు. దీన్ని హిమాచల్ ప్రదేశ్ సిర్మోర్ కాలా అంబ్‌లో కండౌర్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేస్తుండగా, బెంగుళూరుకు చెందిన అట్లావిస్టా హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటెడ్ మార్కెటింగ్ చేస్తున్నది. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి తెలిపారు.



ఊరు బాగుంటేనే దేశం బాగుంటుంది

- సీతారాముల కల్యాణోత్సవంలో కేటీఆర్

నవతెలంగాణ – కూకట్‌పల్లి

దేవాలయం బాగుంటే ఊరు బాగుంటుందని, ఊరు బాగుంటేనే దేశం బాగుంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని ప్రముఖ, ప్రాచీన రామాలయంలో బుధవారం జరిగిన సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో కేటీఆర్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 439 ఏండ్ల చరిత్ర గల ఈ రామాలయాన్ని ఇంత అత్యద్భుతంగా గ్రామస్తుల సహకారంతో పున:నిర్మించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును అభినందిస్తున్నట్టు తెలిపారు. దేవాలయాలను కాపాడుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంభీపూర్ రాజు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

గాజాలో ఊచకోతకు అదానీ డ్రోన్లు

- ఇజ్రాయిల్ కంపెనీతో అదానీ జాయింట్ వెంచర్ ● అయిదేండ్లుగా హెర్మ్స్900 డ్రోన్లు సరఫరా
- వ్యూహాత్మక, రక్షణ పరిశ్రమలోకి ఇజ్రాయిలీ కంపెనీ ప్రవేశం ● రక్షణ రంగంలో ఎఫ్‌డిఐ నిబంధనల సడలింపు ఇందుకోసమేనా?

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తన అనుంగు మిత్రుడైన అదానీ కోసం దేశ ప్రతిష్టను పణంగా పెట్టింది. గాజాలో వేలాది మంది పాలస్తీనీయుల ఊచకోతకు ఉపయోగిస్తున్న డ్రోన్లలో చాలా వరకు అదానీ కంపెనీ సప్లై చేస్తున్నవేనని ది వైర్, అదానీ వాచ్‌తో సహా పలు మీడియా సంస్థలు ఆధారాలతో సహా వెల్లడించాయి. దేశ ప్రతిష్టతో బాటు జాతీయ భద్రతతో ముడిపడి ఉన్న కీలకమైన ఈ వార్తా కథనాలపై కేంద్ర రక్షణ శాఖ కానీ, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కానీ, విదేశాంగ శాఖ కానీ ఇంతవరకు స్పందించలేదు. ఇజ్రాయిల్‌కు జర్మనీ ఆయుధాలు సరఫరా చేస్తున్నందుకు గాజాలో రక్తపాతంతో ఆ దేశానికి సంబంధముందని, కాబట్టి జర్మనీని నికరాగ్వా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు లాగింది. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు అందజేస్తున్న అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలపుతున్నారు. ఇజ్రాయిల్ గత ఆరున్నర మాసాల్లో 34 వేల మంది పాలస్తీనీయులను ఊచకోత కోసింది. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే. ఇజ్రాయిల్ దాష్టీకాలపై అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమైన తరువాత కూడా అదానీ డ్రోన్ల సరఫరా ఆగలేదు. బొగ్గు మైనింగ్ కాంట్రాక్టులకు సంబంధించి అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఇజ్రాయిలీ ఆయుధ తయారీ సంస్థ ఎల్‌బిట్ సిస్టమ్స్‌తో కలసి 2018లో హైదరాబాద్ సమీపంలో అదానీ ఎయిరో స్పేస్ పార్కులో 15 మిలియన్ డాలర్లతో జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేశాయి. రెండేళ్ల తరువాత అంటే 2020 ఫిబ్రవరి6న అదానీ డిఫెన్స్ ఎయిరో స్పేస్, ఎల్‌బిట్ సిస్టమ్స్‌తో కలసి ప్రైవేట్ మానవ రహిత యుద్ధ విమానాల (యుఎవి) తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. ఇక్కడ తయారైన హెర్మ్స్ 900 డ్రోన్లు (వీటిని దృష్టి–10 అని కూడా పిలుస్తారు), యుఎవిలను అదానీ కంపెనీ ఇజ్రాయిల్‌కు సప్లై చేస్తోంది. ఇప్పటివరకు 20కి పైగా యుఎవిలను, డ్రోన్లను అందించింది. ఇజ్రాయిల్‌కు అదాని డ్రోన్ల సప్లయి గురించి హిందుస్థాన్ టైమ్స్ పత్రిక జనవరిలో ఒక ప్రత్యేక వార్తా కథనాన్ని ప్రచురించింది. అదానీ గ్రూపు దీనిపై స్పందిస్తూ ఇజ్రాయిల్‌కు డ్రోన్లు, యుఎవిలు సప్లయి చేసిన మాట నిజమే. అయితే ఇవి యుద్ధేతర అవసరాల కోసం పంపినవేనని వివరణ ఇచ్చింది.

గత ఫిబ్రవరిలో దివైర్‌తో సహా దేశ విదేశాల్లోని వివిధ మీడియా సంస్థలు వరుసగా కొన్ని కథనాలను ప్రచురించాయి. తాజాగా ది వైర్ రాసిన కథనంలో భారత్ ఐరాస తీర్మానాల విషయంలో వేసిన కుప్పిగంతులకు, అదానీ డ్రోన్లకు ఉన్న లింక్‌ను గురించి బయటపెట్టింది. గాజాలోకాల్పుల విరమణ పాటించాలని కోరుతూ 2023 డిసెంబరులో ఐరాస జనరల్ అసెంబ్లీలో తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన భారత్, ఈ నెల5న ఐరాస మానవహక్కుల సంస్థ (యుఎన్‌హెచ్‌ఆర్‌సి)లో అదే విధమైన తీర్మానం ఓటింగ్‌కు వచ్చినప్పుడు గైర్హాజరైంది. భారత్ వైఖరిలో ఈ మార్పుకు అమెరికా ఒత్తిడితో బాటు, అదానీ డ్రోన్ల సప్లయి కూడా ఒక ముఖ్య కారణమని ఆ కథనం వెల్లడించింది. ఆ తీర్మానం కాల్పుల విరమణ పాటించాలని కోరడంతో బాటు ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాపై నిషేధం విధించాలని కూడా మిగతా 2లో డిమాండ్ చేస్తున్నది. హిందుస్తాన్ టైమ్స్ ఈ ఏడాది జనవరిలోనే ఇందుకు సంబంధించిన ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది. అదానీ, ఇజ్రాయిల్ కంపెనీల జాయింట్ వెంచర్, రక్షణ పరికరాల తయారీలో విదేశీ పెట్టుబడులకు సంబంధించి ఎలాంటి ఆటంకం లేకుండా చూడడం కోసం మోడీ ప్రభుత్వం అంతకు ముందే ఒక కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఆ విధానం ప్రకారం ఆటోమెటిక్ రూట్‌లో 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ)ని అనుమతిస్తున్నది. కేస్ బై కేస్ ప్రాతిపదికపై వంద శాతం క్లైమేట్ రంగాన్ని ప్రధానంగా విదేశీ ఉత్పత్తిదారులకు, వ్యూహాత్మక భాగస్వాములుగా అనుమతిస్తున్నట్లు పేర్కొంది. ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్ల ఎగుమతికి కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వశాఖ అధీనంలోని డైరక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) లైసెన్సు ఇచ్చింది. డ్రోన్లు, యుఎవిలే కాదు, టవర్ అసాల్ట్ రైఫిల్, అసాల్ట్ రైఫిల్ ఎక్స్95, గెలీల్ స్నిప్పర్ రైఫిల్, నెగెవ్ లైట్ మెషిన్ గన్స్, యుజి సబ్‌మెషినరీ గన్స్ వంటివి ఇజ్రాయిలీ కంపెనీతో కలసి అదాని ఏరో స్పేస్ ఉత్పత్తి చేస్తోంది. ఈ డ్రోన్లను, మానవ రహిత యుద్ధ విమానాలను, ఆయుధాలను భారత సాయుధ బలగాల్లో ప్రవేశపెట్టేందుకు కూడా అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ రంగంలోని డిఆర్‌డిఓ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వంటి ప్రఖ్యాత సంస్థలను నిర్వీర్యం చేసి అదాని ఏరోస్పేస్‌కు ఆర్డర్లు ఇవ్వడం దేశ భద్రతకు మంచిది కాదని రక్షణ రంగ నిపుణులు పలువురు హెచ్చరిస్తున్నారు.



- 2018లో అదాని ఎంటర్‌ప్రైజెస్, ఇజ్రాయిలీ ఆయుధ తయారీ సంస్థ ఎల్‌బిట్‌తో కలసి
- హైదరాబాద్‌లోని అదానీ ఎయిరో స్పేస్ పార్కులో జాయింట్ వెంచర్ యూనిట్ ఏర్పాటు
- 2020 ఫిబ్రవరి6 అదానీ డిఫెన్స్ ఎయిరో స్పేస్, ఎల్‌బిట్ కలసి ప్రైవేట్ యుఎవి యూనిట్ కాంప్లెక్స్ నెలకొల్పాయి
- హెర్మ్స్900 డ్రోన్ల నిఘాకు, వైమానిక దాడులకు ఉపయోగించవచ్చు.
- 32వేల అడుగుల ఎత్తులో పయనిస్తూ భూమి మీద, సముద్రం మీద లక్ష్యాలను సులువుగా పసిగట్టే సామర్థ్యం కలిగి ఉన్నాయి.
- 2014లో గాజాపై 50 రోజుల పాటు సాగించిన దాడుల్లో హెర్మ్స్ డ్రోన్లను మొదటిసారి ఉపయోగించింది.

సంపాదకీయం

విజయీభవ



యూపీఎస్సీ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థుల ప్రతిభ నింగికెగిసింది. ఏకంగా రెండో ర్యాంక్ సాధించడం ద్వారా మరోసారి తెలుగుజాతి కీర్తి పతాకానికెక్కింది. సుమారు అరవై మంది తెలుగు తేజాలు విజయబావుటాను ఎగురవేశారు. వారికి అభినందనలు. శుభాకాంక్షలు. వీరంతా ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ తదితర అఖిల భారత సర్వీసు(ఏఐఎస్)ల్లో సేవలందించబోతున్నారు. ప్రజాసేవ చేయడానికే సివిల్స్‌ను ఎంపిక చేసుకున్నామని చెప్పడం మంచి పరిణామం. వెనుకబడిన ప్రాంతంగా పరిగణించే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు అత్యుత్తమ ప్రతిభ కనపర్చడం సంతోషం కలిగిస్తున్నది. ఊతమిస్తే ఎంతవరకైనా ఎదుగుతామని చెప్పకనే చెప్పారు అభ్యర్థులంతా. ఆయా సామాజిక తరగతులకు చెందిన వీరు, భవిష్యత్ తరాలకు సేవలందించే అధికారిక ప్రతినిధులు. ఏఐఎస్ అధికారుల శక్తి, సామర్థ్యాలు, నైపుణ్యం సమాజానికి ఉపయోగపడాలి.

> సరళీకృత ఆర్థిక విధా నాల అమలు నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలతో ఒప్పందాల్లో భాగంగా ఇస్తున్న పరిపాలన, సైనిక శిక్షణతో ఏఐఎస్‌లను విధానపరంగానే విభిన్నంగా తయారు చేస్తున్నారు. పెట్టుబడిదారి విధానాలను మస్తిష్కంలో నింపి క్షేత్రస్థాయిలో పేదలకు వ్యతిరేకంగా పనిచేయిస్తుండటం గమనార్హం. ఏఐఎస్ అనేది కెరీర్ ఆప్షనేకాదు, జాతికి సేవలందించగలిగే గురుతర బాధ్యత. లక్షల్లో జీతాలు, సమాజంలో గౌరవం అందుకునే వీరంతా, పేదల పక్షపాతులుగా ఉండాలి.

ప్రతియేటా యూపీఎస్సీ కేవలం 180 మంది ఏఐఎస్‌లను మాత్రమే ఎంపిక చేస్తుంది. వీరంతా అత్యంత ప్రతిభావంతులై ఉంటారు. అధికారాలను చెలాయించడమే వీరి అధికారం కాదు, దాన్ని ప్రజలు, పేదలు, అణగారిన తరగతుల ప్రయోజనాల కోసం వాడటం ప్రధానం. కీలకం కూడా. ప్రజాసేవ చేయాలంటే సమాజంపై విస్తృత అవగాహన ఉండాలి. సమస్యలపై లోతైన అధ్యయనమూ తప్పనిసరి. చట్టాలు, విధానాలకు మానవతా విలువలను జోడించి మంచి పరిపాలనను అందించడమే కర్తవ్యంగా భావించాలి. దేశంలో సివిల్ సర్వీసులకు చాలా ప్రాముఖ్యత ఉంది. అభివృద్ధిలో ఏఐఎస్‌ల పాత్ర గొప్పదనే చెప్పాలి. అయితే పరిస్థితులు మారుతున్నాయి. ఐఏఎస్‌ల్లోనూ అది చోటుచేసుకుంటున్నది. ప్రజాసేవ మసకబారి స్వయంసేవకు పూనుకుంటున్నారు. పాలకులు, కార్పొరేట్ల సేవలో తరిస్తున్నారు. విధానాల రూపకల్పనలోనే తప్పులు దొర్లుతున్నాయి. తద్వారా దేశాభివృద్ధి కుంటు పడుతున్నది. దీంతో ప్రజల తిరుగుబాటును చవిచూడాల్సి వస్తున్నది. పబ్లిక్ సర్వీసు నుంచి ప్రయివేటు సర్వీసుకు మళ్లుతున్న దుస్థితి కనిపిస్తున్నది.


కార్పొరేట్ల బాగోగులు కాకుండా అట్టడుగు స్థాయి మట్టి మనుషుల మనుగడపై దృష్టిపెట్టాలి. శిక్షణ నుంచే ఆ అభిమతాన్ని నరనరాల్లోనూ ఇమడ్చుకోవాలి. కొందరు చేసే దిగజారుడు పనులతో సొంతం వ్యవస్థ తు(త)ప్పు(న)పడుతున్నది. మోకాళ్ల మీద కూర్చుని దండాలు పెడుతూ, తమ ప్రాథమిక బాధ్యతను నిర్లక్ష్యం చేస్తున్న వైనాలు ఎన్నో. దీంతో సమాజ ఉద్ధరణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగు ప్రశ్నార్థకమవుతున్నది. కర్తవ్యాల నిర్వహణలో విఫలమవుతున్న పరిస్థితి. పైపెచ్చు సరళీకృత ఆర్థిక విధానాల అమలు నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలతో ఒప్పందాల్లో భాగంగా ఇస్తున్న పరిపాలన, సైనిక శిక్షణతో ఏఐఎస్‌లను విధానపరంగానే విభిన్నంగా తయారు చేస్తున్నారు.

పెట్టుబడిదారి విధానాలను మస్తిష్కంలో నింపి క్షేత్రస్థాయిలో పేదలకు వ్యతిరేకంగా పనిచేయిస్తుండటం గమనార్హం. ఏఐఎస్ అనేది కెరీర్ ఆప్షనేకాదు, జాతికి సేవలందించగలిగే గురుతర బాధ్యత. లక్షల్లో జీతాలు, సమాజంలో గౌరవం అందుకునే వీరంతా, పేదల పక్షపాతులుగా ఉండాలి. నిరుద్యోగులకు దారి చూపించాలి. బాధితులకు బాసటగా నిలవాలి. కాగా పదేండ్ల కిందటి ఉన్నతాధికారులు, ఇప్పటి వారికి తేడా స్పష్టంగా కనిపిస్తున్నది. సరైన విధానాలను రూపొందించి అమలు చేయడం ద్వారా పాలకులచేత కాకుండా ప్రజలచేత శభాష్ అనిపించుకోవాలి.

ఆ కోవకు చెందిన ఐఏఎస్ అధికారే ఎస్.ఆర్ శంకరన్. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం రూపకర్త. వెట్టిచాకిరి నిర్మూలన, అటవీ హక్కుల చట్టం, ఎస్సీ కార్పొరేషన్‌కు ఊపిరులూదిన ఐఏఎస్. 1984లో సాంఘీక సంక్షేమ గురుకులాల వ్యవస్థ ఏర్పాటులో, 2004లో ప్రభుత్వంతో మాట్లాడి మావోయిస్టులను చర్చలకు ఆహ్వానింపజేయడంలో ఆయనదే కీలకపాత్ర. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పనిచేసినప్పుడు ఆయన్ను అప్పటి ప్రభుత్వాలు బదిలీ చేయగా, అందుకు వ్యతిరేకంగా ప్రజలే ఆందోళన చేసిన పరిపాలనాదక్షుడు. ఆయన్ను ఐఏఎస్ గాంధీ అని పిలిచేవారు.

శంకరన్ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసినా, సున్నితంగా తిరస్కరించిన గొప్పవ్యక్తి. నేటి ఐఏఎస్‌లు ఎస్ఆర్ శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆ బాటలో నడవాలి. పేదల కోసం ఎంతటి త్యాగాలకైనా వెనుతిరగని వ్యక్తిత్వాన్ని ఒంటపట్టించు కోవాలి. అప్పుడే తమ లక్ష్యమైన ప్రజాసేవ చేయాలనే సంకల్పం నెరవేరుతుంది. విజయీభవ.

రైతుల రక్షణకు మద్దతు ధరల చట్టమే మార్గం



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరల అమలుకు పార్లమెంటులో చట్టం చేయాలని జూన్ 5, 2020 నుంచి రైతులు, రైతు సంఘాలు ఢిల్లీలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. లక్షల మందిని సమీకరించి నెలల తరబడి పోరాటం చేశారు. 11 మాసాల పోరాటం తర్వాత నవంబర్, 2021న ప్రధాని మోడీ మద్దతు ధరలకు పార్లమెంటులో చట్టం తెస్తానని సంయుక్త కిసాన్ మోర్చ నాయకులకు లిఖిత పూర్వక హామీనిచ్చారు. అయినా నేటికీ అమలు జరుపలేదు. 2024 ఫిబ్రవరి నుంచి పోరాటం కొనసాగుతున్నది. ఫిబ్రవరి 16న భారత్ గ్రామీణ బంద్ విజయవంతంగా అమలు చేశారు. అయినా మోడీ ప్రభుత్వం పార్లమెంటులో సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు ప్రవేశపెట్టిన మద్దతు ధరల బిల్లును చట్టంగా రూపొందించడానికి అంగీకరించడం లేదు. మార్చి, 14న దేశవ్యాపితంగా నిరసన ప్రదర్శనలలో లక్షల మంది రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధరల చట్టం తెస్తే బడ్జెట్ పై భారం పడుతుందని, కావున నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయని, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతుం దని ప్రధాని మోడీ అతని అనుచరగణ మంత్రివర్గం ప్రచారం చేస్తుంది. కొంత మంది కుహనా ఆర్థికవేత్తలు ఈ చట్టం అమలు చేయడానికి నిధులు కేటాయించాలని కోరుతున్నారు. ఇవేవీ వాస్తవాలు కావు. ఆర్థిక విధానాలు తెలిసిన వారెవరైనా పై వాదనలను తిరస్కరిస్తారు. తమ పంటలకు గిట్టుబాటు ధరలు లేక, పెట్టిన పెట్టుబడులు రాక రుణగ్రస్తులై నేటికి 13 రాష్ట్రాల్లో యేటా 13వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారు. ఆత్మహత్యల నివారణకు మద్దతు ధరలను గ్యారెంటీ చేస్తూ పార్లమెంటులో చట్టం చేయడం ఒకటే మార్గం.

మద్దతు ధరలు ఎలా వచ్చాయి?


1964లో ప్రారంభంలో మొదలైన హరిత విప్లవ కాలం నుంచి 1982 వరకు వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు లభించాయి. ప్రభుత్వం రాయితీల ద్వారా సంకరజాతి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు గ్రామీణస్థాయి వరకు సరఫరా చేయడమేకాక, మార్కెట్లలో పోటీవల్ల కనీస గిట్టుబాటు ధరలు లభించాయి. 1984లో దేశం వ్యవసాయ ఉత్పత్తులలో స్వయం పోషకత్వమేకాక ఎగుమతులు చేసే దశకు చేరుకున్నాము. యేటా రెండు కోట్ల టన్నుల బియ్యం, గోదుమలు, పంచదారతో పాటు మిరప, పసుపు, పత్తి ఎగుమతులు చేశాము. ఆ పరిస్థితులలో దేశీయ కార్పొరేట్ సంస్థలు, మధ్యదళారీలు ప్రభుత్వాలతో కుమ్మక్కై మార్కెటల్లలో ధరలను 40శాతానికి పైగా తగ్గించారు. దేశవ్యాపితంగా జరిగిన రైతాంగ ఆందోళనల ఫలితంగా అంతకు ముందున్న మద్దతు ధరల చట్టాన్ని పునరుద్ధరించి ఆహార పంటలకు ఉత్పత్తివ్యయం ఆధారంగా ధరలు నిర్ణయించడానికి " ధరల నిర్ణాయక కమిషన్ " (సిఎసిపి)ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆ కమిషన్ రాష్ట్రాల నుంచి వ్యవసాయ పెట్టుబడులను, ఉత్పత్తి సమాచారాన్ని సేకరించి మద్దతు ధరలకు కేంద్ర ప్రభుత్వానికి రికమండేషన్ చేసింది. ఆ కమిషన్ రికమండేషన్ ప్రకారం కాకుండా కొంత మొత్తం పెంచి పంటలకు ధరలను నిర్ణయించింది. తర్వాత క్రమంగా 23 పంటలకు ధరలు నిర్ణయించారు. కానీ, ఆ ధరలు శాస్త్రీయంగా లేకపోవడంతో దేశవ్యాపితంగా పెద్దఎత్తున ఆందోళనలు సాగాయి. హరిత విప్లవ పితామహులు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మద్దతు ధరలకు ఒక సూత్రీకరణ చేశారు. దానిప్రకారం ఉత్పత్తి వ్యయంపై 50శాతం కలిపి ధరలు నిర్ణయించాలని సలహా ఇచ్చారు.

2014లో అధికారానికి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మొదట మద్దతు ధరలను అమలు జరుపలేమని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసింది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి, మద్దతు ధరలను నిర్ణయిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఉత్పత్తి వ్యయంపై 50శాతం ధరలు నిర్ణయిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దానికి 50శాతం కలుపుతున్నారు. పారిశ్రామిక సరుకులకు ధరలు నిర్ణయించే విధానాన్ని వ్యవసాయ ఉత్పత్తులకు వర్తింపజేయలేదు. ఉత్పత్తి వ్యయంలో ఉపకరణాల ధరలు (విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యాంత్రీకరణ పెట్టుబడులు) కుటుంబ శ్రమను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు. భూమిపై పెట్టిన పెట్టుబడి అనగా బోర్లు, కరెంటు పంపులు, పైపులైన్లు తదితర నిర్మాణాలకు తెచ్చిన అప్పుపై వడ్డీ, ఆ నిర్మాణాల అరుగుదల ఉత్పత్తి ఖర్చుల్లోకి తీసుకోవడం లేదు. అందువల్ల కేంద్రం నిర్ణయించే కనీస మద్దతు ధర తక్కువగా నిర్ణయించడం జరిగింది. సిఎసిపి ఉత్పత్తి ధరలను నిర్ణయించడానికి ఎ2, బి2, సి2 సూత్రాలను రూపొందించింది. కానీ, ఆ విధానాలతో ఉత్పత్తి వ్యయాన్ని నిర్ణయించనుంది. మద్దతు ధరల చట్టం తెస్తే అనివార్యంగా ఈ సూత్రా లను అమలు చేయాల్సి ఉంటుంది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో మద్దతు ధరలు కూడా పెరుగుతాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల, ఇతర అనర్థ కారణాల వల్ల నష్టపోయిన రైతులు శాస్త్రీయంగా రూపొందించే మద్దతు ధరల వల్ల కొంతలో కొంతైనా మేలు జరుగుతుంది.

> 2014లో అధికారానికి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మొదట మద్దతు ధరలను అమలు జరుపలేమని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసింది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి, మద్దతు ధరలను నిర్ణయిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఉత్పత్తి వ్యయంపై 50శాతం ధరలు నిర్ణయిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దానికి 50శాతం కలుపుతున్నారు. పారిశ్రామిక సరుకులకు ధరలు నిర్ణయించే విధానాన్ని వ్యవసాయ ఉత్పత్తులకు వర్తింపజేయలేదు. ఉత్పత్తి వ్యయంలో ఉపకరణాల ధరలు (విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యాంత్రీకరణ పెట్టుబడులు) కుటుంబ శ్రమను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు.

శాస్త్రీయ మద్దతు ధరల వల్ల నష్టమెవరికి?

కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయిస్తే ప్రభుత్వంపై భారం పడుతుందంటున్నారు. ఇది వాస్తవం కాదు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ పరిశ్రమలకు ముడిసరుకులుగా ఉపయోగపడుతున్నాయి. వాటిని మధ్య దళారీలు తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి వినియోగదారులకు అమ్మకాలు చేస్తున్నారు. " వినియోగదారుడు చెల్లించే మొత్తంలో ఉత్పత్తిదారుని వాటా 40-50శాతం మించడం లేదు. మధ్య దళారీలు అత్యధిక లాభాలు సంపాదిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ద్వారా లాభాలను గమనించిన కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, అదాని, రిలయెన్స్, ఐటిసి, బేయర్, ఎల్ అండ్ టి లాంటి కంపెనీలు తమ పారిశ్రామిక పెట్టుబడులను తరలించి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, ప్రాసెసింగ్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. పెట్టుబడులపై 80-100శాతం లాభాలు సంపాదిస్తున్నారు. ఈ ధరల విధానం వల్ల ఉత్పత్తిదారునికి న్యాయమైన ధర రాకపోవడం వల్ల వినియోగదారునిపై అత్యధిక భారం పడుతున్నది. మొక్కజొన్నతో 10 రకాలు, వరి ధాన్యంతో 5 రకాలు, గోదుమలతో 6 రకాలు, సోయాతో 10 రకాల ఉప ఉత్పత్తులు తయారౌతున్నాయి. పసుపు, మిరపతో కూడా అనేకరకాల ఉప ఉత్పత్తులు తయారౌతున్నాయి.



రైతుల నుండి కొలుగోలు చేసిన ముడిసరుకులపై 20శాతం పెట్టుబడి పెట్టడం, లేదా పెట్టుబడి పెట్టకుండానే ఉప ఉత్పత్తులు వస్తున్నాయి. ఉదా: ధాన్యం, 1.5 కిలోలకు ఒక కిలో బియ్యం వస్తాయి. మిల్లు ఆడించినందుకు తౌడు, నూక, పరం తీసుకొని ఉచితంగానే కిలో బియ్యం ఇస్తారు. లేదా నామమాత్రంగా కొంత బియ్యం తయారు చేసినందుకు రేటు నిర్ణయిస్తారు. అలాగే, ముడిపప్పు క్వింటాల్‌కు 80 కిలోల పప్పు ఇస్తారు. సోయా మొదలు ఆయిల్ ఫామ్ వరకు నూనె గింజలు అన్నింటిలో 80-100 శాతం కార్పొరేట్లకు లాభాలుంటాయి.

1956లో నిత్యావసర సరుకుల చట్టాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. వ్యవసాయ ఉత్పత్తుల నుండి వచ్చే ఆహార ధాన్యాలను ప్రాసెస్ చేసిన తర్వాత ఏ రేటుకు అమ్మాలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. 2020లో కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల చట్టాన్ని రద్దు చేసింది. రైతుల పోరాట ఫలితంగా తిరిగి చట్టాన్ని పునరుద్ధరించింది. దీని ప్రకారం వ్యవసాయ ఉత్పత్తుల నుంచి వచ్చే ఉప ఉత్పత్తుల ధరలను ప్రభుత్వం నిర్ణయించాలి. కానీ, కార్పొరేట్ సంస్థలు తమ లాభాల కొరకు వినియోగదారులపై అత్యధిక భారాలు మోపే విధంగా ధరలు నిర్ణయిస్తున్నారు. దానికితోడు అందుకు ఉపయోగపడే ముడి వ్యవసాయ ఉత్పత్తులను అతితక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. చాలా సందర్భాలలో కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధలను అమలు జరుపకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నట్లు ఆర్థిక వేత్తలే వ్యాఖ్యానాలు చేశారు. దేశంలో యేటా రూ.18 లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సాగుతున్నది. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరలు లభించకపోవడం వల్ల ఇప్పటికే రైతులు రూ.4 లక్షల కోట్లకు నష్టపోతున్నట్లు మోడీ ఆప్త మిత్రుడు, ఆర్థికవేత్త అశోక్ గులాఠి ప్రకటించడం గమనించాలి. అందువల్ల కనీస మద్దతు ధరల చట్టం అవసరాన్ని ఈ పరిణామం విధితం చేస్తున్నది. అభివృద్ధి చెందిన దేశాలలో కార్పొరేట్ల పై 35శాతం పన్ను విధించగా, మనదేశంలో 20-23 శాతం మాత్రమే పన్ను విధించి మరోవైపున వారికి లాభాలు కట్టబెడుతున్నారు. దీనికితోడు బ్యాంకులలో తీసుకున్న రుణాలను రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసి మరో ఆదాయాన్ని కూడా కల్పించారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచడం ద్వారా మరిన్ని లాభాలు సంపాదిస్తున్నారు.

> ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ పరిశ్రమలకు ముడిసరుకులుగా ఉపయోగపడుతున్నాయి. వాటిని మధ్య దళారీలు తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి వినియోగదారులకు అమ్మకాలు చేస్తున్నారు. " వినియోగదారుడు చెల్లించే మొత్తంలో ఉత్పత్తిదారుని వాటా 40-50శాతం మించడం లేదు. మధ్య దళారీలు అత్యధిక లాభాలు సంపాదిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ద్వారా లాభాలను గమనించిన కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, అదాని, రిలయెన్స్, ఐటిసి, బేయర్, ఎల్ అండ్ టి లాంటి కంపెనీలు తమ పారిశ్రామిక పెట్టుబడులను తరలించి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, ప్రాసెసింగ్‌లో పెట్టుబడులు పెడుతున్నారు.

మద్దతు ధరల చట్టం వల్ల భారమెవరికి?


పైన వివరించిన ప్రకారం ఉత్పత్తిదారునికి తక్కువ ధరకు ఇచ్చి, వినియోగదారునికి ఎక్కువ ధరకు అమ్ముకునే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధం చేయడం ద్వారా ప్రస్తుతం వినియోగదారుల ధరలు పెంచకుండానే ఉత్పత్తిదారునికి అదనపు ఆదాయాన్ని చెల్లించవచ్చు. ఉదా: ధాన్యం ధర కేజీ రూ.20కి మార్కెట్‌లో అమ్మకాలు సాగుతున్నాయి. 1.5 కి.లు ధాన్యం అనగా రూ.30 చెల్లించాలి. కిలో బియ్యం వస్తాయి. కానీ, కిలో బియ్యం మార్కెట్‌లో రూ.60-65లకు అమ్ముతున్నారు. అలాగే పత్తి 3 కిలోలు జిన్నింగు చేస్తే కిలో దూది వస్తుంది. 2 కిలోలు గింజలు వస్తాయి. 3 కిలోల పత్తికి రూ.210లు పెట్టి కొనాలి. 2 కిలోల గింజలకు రూ.60లు ఆదాయం వస్తుంది. రూ.210ల నుండి రూ.60లు తగ్గిస్తే కిలో దూదికి రూ.150లు ధర ఉంటుంది. కిలో దూదితో 8 మీటర్ల బట్ట వస్తుందని సదరన్ టెక్స్‌టైల్ మిల్లులు అంచనా వేశాయి. మీటర్ ధర రూ.60లు నిర్ణయించినా రూ.480లు ఆదాయం వస్తుంది. రూ.150ల దూది ధరకు తోడు బట్టగా ప్రాసెస్ చేయడానికి మరో రూ.100లు వ్యయం చేసినా రూ.250ల పెట్టుబడికి రూ.480లు ఆదాయం వస్తుంది. అందువల్ల ప్రాసెస్ చేసిన తర్వాత అమ్ముకునే లాభ శాతాన్ని కేంద్రం ధరల నిర్ణయం ద్వారా తగ్గించాలి. ఆ తగ్గించిన దానిని ముడిసరుకులు ఉత్పత్తి చేసే రైతులకు జమ చేయాలి. అనగా, ధాన్యం ధర కిలో రూ.30లు అయినప్పుడు బియ్యం ధర కిలో రూ.45లు అవుతుంది. అయినా, మధ్యదళారీకి రూ.15 లాభం ఉంటుంది. ఈ సూత్రాలను పరిశీలించినప్పుడు కార్పొరేట్ల లాభాల మార్జిన్‌ను తగ్గించడం ద్వారా ఉత్పత్తిదారునికి గిట్టుబాటు ధర కల్పించవచ్చు. ఇందుకు చట్టం అవసరం.

ఆ చట్టం చేస్తే తమ లాభాలకు ఎక్కడ ఆటంకం వస్తుందోనని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల లాభాలను దృష్టిలో పెట్టుకొని చట్టం చేయకుండా కుంటిసాకులు చెప్తున్నది. దీనికితోడు ఎగుమతి-దిగుమతులలో కూడా కార్పొరేట్లకు లాభాలు కట్టబెడుతున్నది. మిగులు ఉత్పత్తులు జరిగినప్పటికీ దిగుమతులు చేసుకొని రైతులను నష్టపరుస్తున్నారు. అమెరికా మొదలు, పాకిస్తాన్ వరకు తమ రైతుల మేలును కాంక్షించి చట్టాల ద్వారా వారికి రక్షణ కల్పిస్తున్నారు. అందుకే ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా మన దేశంలోనే రైతుల ఆత్మహత్యలు కొనసాగుతు న్నాయి. ఇంతకన్న దృష్టాంతం ఏము న్నది? కార్పొరేట్ల లాభాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా రైతులకు అదనపు ధరలు లభించే విధంగా పార్లమెంటులో చట్టం చేయాలి. ఉత్పత్తి ధరను శాస్త్రీయంగా ఎలా నిర్ణయించాలో ఆ చట్టంలో రూపొందించాలి. ఆ చట్టాన్ని అమలు చేయడానికి తగిన యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాలి. అప్పుడే రైతుల ఆత్మహత్యలు నివారించబడుతాయి. కానీ, ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల రక్షణకు మద్దతు ధరల చట్టం తెస్తుందన్న విశ్వాసాన్ని కోల్పోయారు. రైతులు మాత్రం దృఢ దీక్షతో చట్టం చేసేవరకు పోరాటం విరమించడానికి సుముఖంగా లేరని సంయుక్త కిసాన్ మోర్చ ప్రకటించింది. పార్లమెంటులో సంయుక్త కిసాన్ మోర్చ ప్రవేశపెట్టిన ముసాయిదా చట్టాన్ని ఆమోదించటమొక్కటే బీజేపీ ముందున్న మార్గం. ■

9) As per the provisions of Regulation 40(1) of the SEBI (LODR) Regulations, 2015 and SEBI's press release dated December 03, 2018, bearing reference no. PR 49/2018, requests for transfer of securities shall not be processed unless the securities are held in dematerialised form with a depository with effect from April 01, 2019. However, in accordance with the circular issued by SEBI bearing reference number SEBI/HO/CFD/ CMD1/CIR/P/2020/144 dated July 31, 2020, shareholders holding securities in physical form are allowed to tender shares in an open offer. Such tendering shall be as per the provisions of the SEBI (SAST) Regulations, 2011. Accordingly, Public Shareholders holding Equity Shares in physical form as well are eligible to tender their Equity Shares in this Open Offer as per the provisions of the SEBI (SAST) Regulations, 2011.

10) **Equity Shares should not be submitted/tendered to the Manager to the Open Offer, the Acquirer or the Target Company.**

IX. THE DETAILED PROCEDURE FOR TENDERING THE SHARES IN THE OFFER WILL BE AVAILABLE IN THE LETTER OF OFFER, WHICH SHALL BE AVAILABLE ON THE WEBSITE OF SEBI (WWW.SEBI.GOV.IN).

X. OTHER INFORMATION:

1) For the purpose of disclosures in this DPS relating to the Target Company, the Acquirer has relied upon the publicly available information and information provided by the Target Company and has not independently verified the accuracy of details of the Target Company. Subject to the aforesaid, the Acquirer accepts the responsibility for the information contained in the DPS and also for the obligations of the Acquirer laid down in the SEBI (SAST) Regulations, 2011.

2) Pursuant to Regulation 12 of the SEBI (SAST) Regulations, 2011, the Acquirer has appointed Mark Corporate Advisors Private Limited as Manager to the Open Offer.

3) The Acquirer has appointed Venture Capital and Corporate Investments Private Limited, as Registrar to the Offer having Registered Office at Aurum, Plot No. 57, 5th Floor, Jayabheri Enclave, Phase-II, Gachibowli, Hyderabad-500 032, Telangana, Contact No.: +91 40 2381 8475/3516 4940, Email ID: pvsrinivas@vccipl.com, Investor Grievance Email ID: investor.relations@vccipl.com; Contact Person: Mr. P V Srinivas Rao, SEBI Reg. No.: INR000001203.

4) In this DPS, any discrepancy in any table between the total and sums of the amount listed is due to rounding off and/or regrouping.

5) This DPS and the PA will also be available on the website of SEBI i.e., www.sebi.gov.in.

Issued by Manager to the Offer:

MARK

MARK CORPORATE ADVISORS PRIVATE LIMITED
CIN: U67190MH2008PTC181996
404/1, The Summit Business Bay, Sant Janabai Road (Service Lane),
Off Western Express Highway, Vile Parle (East), Mumbai-400 057.
Contact Person: Mr. Manish Gaur
Tel. No.: +91 22 2612 3207/08
Email ID: openoffer@markcorporateadvisors.com
Investor Grievance Email ID: investorgrievance@markcorporateadvisors.com
SEBI Registration No.: INM000012128

For and on behalf of the Acquirer:
Sd/-

M V S Prasad Reddy
("Acquirer")

Date : April 18, 2024
Place: Tirupati

భారత జనాభా 144 కోట్లు

న్యూఢిల్లీ : భారత్ ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా తయారైంది. తాజాగా ఆ జనాభా 144 కోట్లకు చేరినట్టు అంచనా. ఇందులో 0-14 ఏండ్ల మధ్య వయస్సున్నవారు 24 శాతంగా ఉన్నారు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్స్ (యూఎన్ఎఫ్‌పీఏ) స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్-2024 నివేదిక "ఇంటర్‌వోవెన్ లైవ్స్, థ్రెడ్స్ ఆఫ్ హోప్: ఎండింగ్ ఇనాక్విలిటీస్ ఇన్ సెక్సువల్ అండ్ రి అండ్ ప్రొడక్టివ్ హెల్త్ అండ్ రైట్స్" వెల్లడించింది. ఇది భారతదేశ జనాభా 77 ఏండ్లలో రెట్టింపవుతుందని అంచనా వేసింది. 144.17 కోట్ల మంది జనాభాతో ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రస్థానంలో ఉండగా, చైనా 142.5 కోట్లతో రెండో స్థానంలో ఉన్నదని నివేదిక పేర్కొన్నది. 2011లో భారత ప్రభుత్వం నిర్వహించిన చివరి జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది.ఇక భారత్‌లో 17 శాతం మంది 10-19 ఏండ్లలోపు వారు ఉన్నారని యూఎన్ నివేదిక వివరించింది. 10-24 సంవత్సరాల వయస్సు గల వారు 26 శాతం, 15-64 సంవత్సరాల వయస్సు గలవారు 68 శాతంగా ఉన్నారని అంచనా వేసింది. అలాగే 7 శాతం మంది 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గలవారుగా నివేదిక వివరించింది. ఆయుర్దాయం పురుషులది 71 సంవత్సరాలుగా, స్త్రీలు 74 ఏండ్లుగా అంచనా వేసింది.ప్రపంచవ్యాప్తంగా లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంలో 30 ఏండ్ల పురోగతి ఎక్కువగా అత్యంత అట్టడుగు వర్గాలను విస్మరించిందని నివేదిక కనుగొన్నది. భారత్‌లో 2006-2023 మధ్య బాల్య వివాహాల శాతం 23గా ఉన్నదని పేర్కొన్నది. అలాగే, దేశంలో ప్రసూతి మరణాలు ప్రపంచవ్యాప్తంగా 8 శాతంగా ఉన్నాయని వివరించింది.ఈ మరణాల విషయంలో భారత్ అసమానతలను చూస్తూనే ఉన్నదని నివేదిక పేర్కొన్నది. అత్యధిక ప్రసూతి మరణాలు అరుణాచల్‌ప్రదేశ్‌లోని తిరాప్ జిల్లాల్లోని స్థానిక తెగల్లో నమోదవు తున్నవి. ఇక్కడ 100,000 జననాలకు 1,671 ప్రసూతి మరణాలు నమోదవుతున్నాయని నివేదిక అంచనా వేసింది. ఇక అంగవైకల్యం లేని వారితో పోలిస్తే.. ఆ సమస్యను కలిగి ఉన్న మహిళలు 10 రెట్లు ఎక్కువగా లింగ ఆధారిత హింసను అనుభవిస్తున్నారని వివరించింది. ఇక ఆరోగ్య సంరక్షణను పొందటంలో మెరుగుదల అనేది ప్రధానంగా సంపన్న మహిళలకు, ఇప్పటికే ఆరోగ్య సంరక్షణకు మెరుగైన అవకాశాన్ని కలిగి ఉన్న జాతి సమూహాలకు చెందిన వారికి ప్రయోజనం చేకూర్చాయని సమాచారం. "వైకల్యమున్న మహిళలు, బాలికలు, వలసదారులు, శరణార్థులు, జాతి మైనారిటీలు, ఎల్జీబీటీఐఏ ప్లస్ ప్రజలు, హెచ్ఐవీ బాధితులు, వెనుకబడిన కులాల ప్రజలు అందరూ ఎక్కువ లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. ఇందులో వారికి ఆరోగ్య సంరక్షణలోనూ అసమానతలు ఎదురవుతున్నాయి" అని నివేదిక పేర్కొన్నది.వాతావరణ మార్పు, మానవతా సంక్షోభాలు, సామూహిక వలసలు వంటి బలమైన శక్తులతో వారి దుర్బలత్వం మరింత పెరుగుతున్నదనీ, ఇవి తరచుగా సమాజంలోని అంచులలో ఉన్న మహిళలపై అసమాన ప్రభావాన్ని చూపుతాయని నివేదిక హెచ్చరించింది. భారత్‌లో పని ప్రదేశాలు, విద్యలో కుల ఆధారిత వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు చట్టపరమైన రక్షణ కోసం దళిత కార్యకర్తలు వాదిస్తున్నారని వివరించింది. నివేదిక ప్రకారం.. లక్షలాది మంది మహిళలు, బాలికలు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజుకు.. ప్రసవించే మహిళలు 800 మంది మరణిస్తున్నారు. నాలుగో వంతు మంది మహిళలు తమ భాగస్వామితో లైంగిక చర్యకు నో చెప్పలేరు. దాదాపు 10 మంది మహిళల్లో ఒకరు గర్భనిరోధకం గురించి తమ స్వంత నిర్ణయాలు తీసుకోలేరు. డేటా ఉన్న 40 శాతం దేశాల్లో మహిళల శారీరక స్వయం ప్రతిపత్తి తగ్గిపోతుండటం గమనార్హం.

మొదటి దశలో హాట్ సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. దీంతో అక్కడ పోటీ తీవ్రంగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బనాద సోనోవాల్ అసోంలోని దిబ్రూగఢ్ నుంచి బరిలో ఉన్నారు. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలికి టిక్కెట్ ఇవ్వకపోవటంతో రాజ్యసభ సభ్యుడైన సోనోవాల్‌ను దిబ్రూగఢ్ నుంచి బీజేపీ పోటీకి దింపింది.

యూపీలోని ముజఫర్‌నగర్ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి చెందిన హరీంద్ర మాలిక్, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి దారా సింగ్ ప్రజాపతి, బీజేపీ నుంచి కేంద్ర మంత్రి సంజీవ్ బలియన్ బరిలో ఉన్నారు. ఇక్కడ త్రిముఖ పోరు ఉంటుందని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో కేంద్ర మంత్రికి విజయం కష్టమేనని అంటున్నారు. ఇక మోడీ క్యాబినెట్‌లో రెండు పర్యాయాలు పార్లమెంటేరియన్‌గా, జూనియర్ మంత్రిగా పనిచేసిన జితేంద్ర సింగ్ ఉదంపూర్‌లో హ్యాట్రిక్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యుడు భూపేంద్ర యాదవ్.. రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా మత్స్య ప్రాంతానికి చెందిన సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లలిత్ యాదవ్‌తో పోటీలో ఉన్నారు. ఇక్కడ యాదవ్ సామాజికవర్గం కీలక పాత్రను పోషించనున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. రాజస్థాన్‌లోని బికనీర్ లోక్‌సభ స్థానం నుంచి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్.. కాంగ్రెస్ మాజీ మంత్రి గోవింద్ రామ్ మేఘ్వాల్‌తో పోటీ పడనున్నారు.

తమిళనాడులోని నీలగిరి లోక్‌సభ నియోజకవర్గం ప్రస్తుత డీఎంకే ఎంపీ, మాజీ టెలికాం మంత్రి ఎ. రాజాపై బీజేపీ నుంచి కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ పోటీ చేయనున్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మురుగన్ ఇక్కడి నుంచి పోటీ చేయడం ఇదే తొలిసారి కావటం గమనార్హం.

శివగంగ ఎంపీ కార్తీ చిదంబరం తన తండ్రి ఏడుసార్లు గెలుపొందిన స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి టి. దేవనాథన్ యాదవ్, ఏఐఏడీఎంకే నుంచి జేవియర్ దాస్‌లు బరిలో ఉన్నారు.తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై ఆ రాష్ట్రంలోని కోయంబత్తూర్ నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే, అక్కడి నుంచి డీఎంకే నాయకుడు గణపతి పి. రాజ్‌కుమార్, ఏఐఏడీఎంకేకు చెందిన సింగై రామచంద్రన్‌తో అన్నామలై పోటీ పడనున్నారు.

ఇక క్రియాశీల రాజకీయాల్లోకి రావటానికి ఇటీవల తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) పదవికి రాజీనామా చేసిన తమిళిసై సౌందరరాజన్.. బీజేపీ నుంచి చెన్నై సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుమార్తె, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ సోదరి అయిన కనిమొళిపై 2019 ఎన్నికల్లో తూత్తుకుడి నుంచి పోటీ చేసిన సౌందరరాజన్.. భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాగా, కనిమొళి.. తూత్తుకుడి స్థానం నుంచి తిరిగి విజయం సాధించాలని చూస్తున్నారు. ఇక ఆమెపై ఎన్డీయే మిత్రపక్షమైన తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్) ఎస్.డి.ఆర్ విజయశీలన్‌ను, ఏఐఏడీఎంకే ఆర్. శివసామి వేలుమణిని పోటీకి దింపాయి.

కాంగ్రెస్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ కుమారుడు నకుల్ నాథ్.. చింద్వారా నుంచి మళ్లీ ఎన్నిక కావటానికి ప్రణాళికలు రచిస్తున్నారు. 1980 నుంచి తొమ్మిది సార్లు ఈ సీటును గెలుచుకున్న కమల్ నాథ్.. ఈ సారి కూడా తన కుమారుడిని గెలిపించేందుకు కృషి చేస్తున్నారు. 2019 ఎన్నికలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 29 స్థానాలకు గాను 28 స్థానాలను బీజేపీ కైవసం చేసుకున్నది. అయితే చింద్వారా నుంచి నకుల్ మాత్రం 37,536 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిని ఓడించాడు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు చెందిన ఏకైక ఎంపీగా ఉన్నారు.

త్రిపురలో ఉన్న రెండు లోక్‌సభ నియోజకవర్గాలలో.. పశ్చిమ త్రిపుర స్థానానికి మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. ఆయనపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశిష్ కుమార్ సాహా పోటీ చేయనున్నారు. ఇక్కడ పోటీ చాలా గట్టిగా ఉండనున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.అసోంలోని కలియాబోర్ ఎంపీగా 2014 నుంచి రెండుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన, లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ కుమారుడు గౌరవ్ గొగోయ్.. ఈ సారి పొరుగున ఉన్న జోర్హాట్‌లో పోటీ చేయనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి చెందిన టోపోన్ కుమార్ గొగోయ్ ఇక్కడి నుంచి విజయం సాధించారు. మణిపూర్ న్యాయ, విద్యా శాఖ మంత్రి బసంత కుమార్ సింగ్ ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆయనపై జేఎన్‌యూ ప్రొఫెసర్, కాంగ్రెస్ అభ్యర్థి బిమల్ అకోయిజామ్ పోటీ చేయనున్నారు. మెయిటీ కమ్యూనిటీకి చెందిన బసంత్ కుమార్ సింగ్.. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసిన తౌనోజం చావోబా సింగ్ కుమారుడు.ఉత్తర రాజస్థాన్‌లోని బీజేపీకి పట్టు ఉన్న స్థానం చురు నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా దేవేంద్ర ఝఝరియా(రెండుసార్లు పారాలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ జావెలిన్ త్రోయర్), కాంగ్రెస్ నుంచి రాహుల్ కస్వాన్‌లు బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్య బలమైన పోటీ ఉండనున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. కాగా, పార్టీ టికెట్ నిరాకరించటంతో రాహుల్ కస్వాన్ మార్చిలో రెండుసార్లు బీజేపీని వీడారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి బరిలో నిలుస్తున్నారు.కాగా, 18వ లోక్‌సభకు ఎన్నికయ్యే 543 స్థానాలకు గానూ మొత్తం ఏడు దశల్లో పోలింగ్ జరగనున్నది. 19 నుంచి మొదటి దశ ప్రారంభం కానున్నది. జూన్ 4న ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

టార్గెట్ డీఎస్సీ...

ఉపాధ్యాయ కొలువు వైపు అభ్యర్థుల చూపు

- టెట్‌కు ఆదరణ అంతంతే...
- ఇప్పటి వరకు 2.51 లక్షల దరఖాస్తులు
- గతేడాది కంటే తగ్గిన అప్లికేషన్లు
- ఫీజు పెంచడమే కారణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అభ్యర్థుల లక్ష్యం జిల్లా సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ)పైనే ఉన్నది. ఉపాధ్యాయ కొలువు సాధించడంపైనే వారు దృష్టి కేంద్రీకరించారు. ఆవైపుగానే వారు మొగ్గుచూపుతున్నారు. 2017, అక్టోబర్ 21న 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ ముగిసింది. ఆ తర్వాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసింది. 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ ఏడో తేదీన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి 28న రద్దు చేసింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఆదేనెల 29న విడుదల చేసింది. జూన్ 20 వరకు దరఖాస్తుల సమర్పణకు గడువున్నది. రాష్ట్రంలో మెగా డీఎస్సీ రాతపరీక్షలు జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయి.

టెట్‌పై డీఎస్సీ ప్రభావం

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను మార్చి 14న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. టెట్ దరఖాస్తుల సమర్పణకు ఈనెల 20 వరకు గడువున్నది. ఇప్పటి వరకు దరఖాస్తులపై ఆ ప్రభావం పడింది. టెట్ పేపర్-1కు 90,789 మంది, పేపర్-2కు 1,60,857 మంది కలిపి 2,51,646 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతం కంటే దరఖాస్తులు భారీగా తగ్గడం గమనార్హం. టెట్ దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌లో రాతపరీక్షల వల్ల దరఖాస్తు ఫీజు పెంచాల్సి వచ్చిందని అధికారులు చెప్తున్నారు. ఆఫ్‌లైన్‌లో టెట్ నిర్వహించినపుడు దరఖాస్తు ఫీజు రెండు పేపర్లకు కలిపి రూ.400 ఉన్నది. ఇప్పుడు ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి కట్టాలని నిర్ణయించారు. ఫీజు తగ్గించాలంటూ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాలు కూడా ఫీజు తగ్గించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అయినా ఎలాంటి మార్పు లేదు. టెట్ దరఖాస్తులు తగ్గడానికి ఫీజు పెరగడం కూడా ఓ కారణంగా ఉన్నది. టెట్ కాలపరిమితి జీవితకాలం ఉండడంతో ఎక్కువ మంది మార్కులు సంపాదించిన వారు దరఖాస్తు చేసేందుకు మొగ్గు చూపలేదు. మరోవైపు జులైలోనే డీఎస్సీ రాతపరీక్షలున్నాయి. ఎక్కువ మంది ఉపాధ్యాయులు డీఎస్సీ రాసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు.

అందుకే టెట్ దరఖాస్తులు తగ్గాయి. గతేడాది సెప్టెంబర్ 15న నిర్వహించిన టెట్ పేపర్-1కు 2,69,557 మంది, పేపర్-2కు 2,08,498 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతేడాది కంటే పేపర్-1కు 1,78,768 పేపర్-2కు 47,641 దరఖాస్తులు తగ్గడం గమనార్హం. ఇంకోవైపు సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు బీఎడ్ అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అవకాశం లేదు. టెట్ దరఖాస్తులు తగ్గడానికి ఇదీ ఓ కారణంగా ఉన్నది.

ఉపాధ్యాయుల్లో ఇంకా గందరగోళమే...

ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో టెట్‌పై ఇంకా గందరగోళం కొనసాగుతూనే ఉన్నది. పలు అంశాల్లో వివరణ ఇవ్వాలంటూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ)ని పాఠశాల విద్యాశాఖ కోరింది. కానీ ఇంత వరకు వివరణ రాలేదు. దీంతో ఉపాధ్యాయులు టెట్ రాయాలా? వద్దా? అంటూ ఆందోళన చెందుతున్నారు. అయితే ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో 1.04 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

టెట్ దరఖాస్తుల వివరాలు

సంవత్సరం	దరఖాస్తులు	
	పేపర్-1	పేపర్-2
2024, మే 20 నుంచి జూన్ 3 వరకు	90,789	1,60,857
2023, సెప్టెంబర్ 15న	2,69,557	2,08,498
2022, జూన్ 12న	3,51,476	2,77,893
2017, జులై 23న	1,11,647	2,56,265
2016, మే 22న	1,01,213	2,74,339

మావోయిస్టులకు టెక్నాలజీ దెబ్బ

- ఐదేండ్లలో అతి భారీ ఎన్‌కౌంటర్ ఇదే
- మృతి చెందిన 29 మంది మావోయిస్టుల్లో సగానికి పైగా మహిళలే..
- 27 లక్షల రివార్డు గల శంకర్రావు మృతి
- ముగ్గురు భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు : బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ కళ్యాణ్ ఐలెసెల్లి



నవతెలంగాణ-చర్ల

టెక్నాలజీ మావోయిస్టుల కొంప ముంచిందని పలువురు విశ్లేషిస్తున్నారు. టెక్నాలజీని ద్వారా మొబైల్ ఫోన్ ట్యాపింగ్, సిగ్నల్ క్యాచింగ్‌తోపాటు కొరియర్ వ్యవస్థను పోలీసులు ఉపయోగించుకొని మావోయిస్టుల స్థావరాలను గుర్తించి మట్టుపెట్టారని అంటున్నారు. ఇదే విషయం మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌ను సూచిస్తుంది. కమాండర్ స్థాయి, ఏరియా కమిటీ కార్యదర్శి మావోయిస్టులకు నాలుగైదంచుల భద్రత ఉన్నప్పటికీ పోలీసులు చాకచక్యంగా మావోయిస్టుల స్థావరంపైకి వెళ్లి ఎన్‌కౌంటర్ చేశారు. దీంతో గడిచిన 15 ఏండ్లలో ఎన్నడూ ఇలాంటి నష్టం మావోయిస్టులకు కలగలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో.. మావోయిస్టు అగ్రనేత, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి, రూ.27 లక్షల రివార్డు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వడ్ల రామాపురం గ్రామానికి చెందిన సుగులూరి చిన్నాన్న అలియాస్ శంకర్రావు ఉన్నట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. అంతేకాకుండా దండకారణ్య స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాందర్ అలియాస్ మజీదేవ్ కూడా మరణించినట్టు పోలీసు వర్గాలు తెలుపుతున్నాయి. మృతుల్లో మసీదేవ్ భార్య లలిత కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాకులు దూరని కారడవిలో కాల్పులు మొదలై రాత్రి వరకు హెూరాహెూరీగా జరిగాయి. ఈ కాల్పుల్లో ఇప్పటికి 29 మంది మృతి చెందగా, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు జరుగుతున్నాయని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ కళ్యాణ్ ఐలెసెల్లి తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలున్నట్టు తెలిసింది. పలువురు జవాన్లు కూడా గాయపడ్డారు. మావోయిస్టులు పక్కా స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 19 నుండి ప్రారంభమయ్యే పార్లమెంట్ ఎన్నికల్లో విధ్వంసం సృష్టించాలని ప్రణాళికలు వేస్తున్నారని తెలిసింది. వాటిని తిప్పికొట్టేందుకే పోలీసు బలగాలు పక్కా ప్రణాళికతో అడవులను జల్లెడ పడుతున్నాయి. ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సుమారు 70 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాగా దండ కారణ్యంలో ప్రతి ఆదివాసీ గ్రామంలో భద్రతాబలగాలు పోలీస్ క్యాంపులు పెట్టాలనే యోచనలో ఉన్నాయని తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ అడవుల్లో ఎర్రటి రక్తపు టేర్లు పారుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఆ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అడ్వకేట్లు మోహినుద్దీన్, ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. దీనికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభమై 22న ముగుస్తుంది. 24న నామినేషన్లను పరిశీలిస్తారు. వాటిని ఉపసంహరించుకునేందుకు 25 వరకు గడువుంటుంది. 29న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్లను కౌంటింగ్ చేస్తారు. ఆ వెంటనే గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రోహిత్ చౌదరి : కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప్పల శ్రీనివాస గుప్త




నవతెలంగాణ-నాగోల్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి అన్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉప్పల ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉప్పల శ్రీనివాస గుప్త బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు ఆయన నాగోల్ డివిజన్‌లోని తన నివాసం నుంచి అభిమానులతో కలిసి ర్యాలీగా గాంధీభవన్‌కు చేరుకున్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్రెడ్డి రామిరెడ్డి, తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి కుమార్ రావుల ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. శ్రీనివాస గుప్తకు రోహిత్ చౌదరి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోహిత్ చౌదరి మాట్లాడుతూ.. ఉప్పల శ్రీనివాస గుప్తకు కాంగ్రెస్ మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు పరిచిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాల్లో విజయకేతనం ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని, కేంద్రంలో ఈ దఫా ఇందిరమ్మ పాలన రానున్నదని చెప్పారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పథకాల అమలు వల్లే కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ స్థాయిలో ఆర్యవైశ్యులను ఏకం చేసి, వారికి మేలు చేసేలా సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి విన్నవిస్తామని తెలిపారు. తెలంగాణ యూత్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు కట్టా రవికుమార్, ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పబ్బా చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, నరేష్ గుప్తా, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సాంబు పాండు గుప్తా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్, 33 జిల్లాల వైశ్య నాయకులు, ఉప్పల యువసేన నాయకులు, బీసీ, మైనార్టీ నాయకులు మహ్మద్, బాషా, ఆసీఫ్ సహా దాదాపు మూడు వందల మందికి పైగా కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు రామ్‌మోహన్ గౌడ్, కాంగ్రెస్ నాగోల్ డివిజన్ అధ్యక్షులు మంజులా రెడ్డి పాల్గొన్నారు.

ఓవైపు ఉక్కపోత..మరోవైపు వడదెబ్బ..

- 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
- మరో రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం
- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ
- ఎండకు తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- పలు జిల్లాల్లో కురిసిన వర్షం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భానుడు భగభగ మండిపోతున్నాడు. మాడ పగలగొట్టేస్తున్నాడు. ఎండ దెబ్బకు ఓ పక్క వడగాల్పులు..మరోపక్క తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంట్లో ఫ్యాన్లు తిరుగుతున్నా...కూలర్ల మోత మోగుతున్నా వేడిగాల్పే వస్తున్నది. ఎన్ని నీళ్ల తాగినా గొంతు తడారట్లేదు. గాలిలో తేమ శాతం వేగంగా పడిపోతుండటంతో డీహైడ్రేషన్‌కు గురై నీరసపడిపోతున్నారు. రాష్ట్రంలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఇదే అత్యధికం కావడం గమనార్హం. వచ్చే మూడు రోజులు కూడా ఎండలు దంచికొట్టే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పుడు నమోదవుతున్న దానికంటే రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. వడగాల్పులు వీచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వడగాల్పులు వీచే జాబితాలో కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, నిర్మల్, కరీంనగర్ జిల్లాలున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 42 డిగ్రీలు నమోదయ్యే అవకాశముంది. అయితే, ఆయా జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. బుధవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 29 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బనలో అత్యధికంగా 4.03 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారంలో 2.65 సెంటీమీటర్ల వర్షం పడింది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

నిడమనూరు(నల్లగొండ)	44.8 డిగ్రీలు
నల్లగొండ	44.7 డిగ్రీలు
నాంపల్లి(నల్లగొండ)	44.7 డిగ్రీలు
అయ్యగారిపల్లి(మహబూబాబాద్)	44.7 డిగ్రీలు
మునగాల(సూర్యాపేట)	44.7 డిగ్రీలు
గార్ల (మహబూబాబాద్)	44.7 డిగ్రీలు
అశ్వరావుపేట(భద్రాద్రి కొత్తగూడెం)	44.7 డిగ్రీలు
తిమ్మాపూర్(నల్లగొండ)	44.6 డిగ్రీలు
మరిపెడ(మహబూబాబాద్)	44.5 డిగ్రీలు
వెంకటాపురం(ములుగు)	44.5 డిగ్రీలు

విజన్ ఐఏఎస్ అకాడమీలో ఇద్దరికి ర్యాంకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఫలితాల్లో విజన్ ఐఏఎస్ అకాడమీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ర్యాంకులను సాధించారు. బుధవారం హైదరాబాద్‌లో యూపీఎస్సీ సన్నద్ధపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ ఐఏఎస్ అకాడమీ దక్షిణ భారతదేశ విభాగం హెడ్ కృష్ణసింగ్ మాట్లాడుతూ సివిల్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు ములగాని ఉదయ కృష్ణారెడ్డి 780 ర్యాంకు, కేసరపు మీనా 899 ర్యాంకులను సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజన్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్లు అజయ్‌కుమార్ సింగ్, అనూప్ సింగ్, అధ్యాపకుడు షమీమ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వరదలు

యుఏఈ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఎన్నడూలేనంతగా భారీ వరదలు ముంచెత్తాయి. ఒమన్‌లో కురిసిన ఎడతెరిపిలేని వానలకు 18 మంది మృతి చెందారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రోడ్లు, వీధులన్నీ జల దిగ్బంధమయ్యాయి. భారీ వరదలకు దుబాయ్‌లోని రోడ్లపై వాహనాలు వరదలో చిక్కుకుపోయాయి. ఓవైపు వరదలు, మరోవైపు తీవ్రగాలుల కారణంగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు విమానాలను రద్దు చేశారు. యూఏఈలో పాఠశాలలన్నింటినీ మూసివేశారు. చాలా మంది ఉద్యోగులు, కార్మికులు ఇండ్ల వద్దే ఉండిపోయారు. వీధులు, రోడ్లపై ఉన్న వరద నీటిని ట్యాంకర్ల సహాయంతో తొలగిస్తున్నారు. మరోవైపు యూఏఈ పొరుగునున్న ఒమన్‌లో కూడా మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లు, వీధులన్నీ నీటితో నిండిపోయాయి. ఈ భారీ వర్షాలకు పలువురు నీటిలో కొట్టుకుపోయారు. మరికొందరి ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని ఒమన్ అత్యవసర నిర్వహణ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా దేశాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి.

జువైనల్ హోం నుంచి చిన్నారులు జంప్..

- పారిపోయిన ఎనిమిది మంది



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జువైనల్ హోం నుంచి ఎనిమిది మంది పిల్లలు తప్పించుకున్న ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధి కైసర్‌నగర్‌లో జరిగింది. వివరాల్లోకెళ్తే.. మంగళవారం రాత్రి జువైనల్ హోం తరగతి గది కిటికీ గ్రిల్స్‌ను తొలగించి ఓ బాలుడు పారిపోయాడు. అనంతరం అలాగే మరో ఏడుగురు పారిపోయారు. బుధవారం ఉదయం హోం నిర్వాహకులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల సీసీటీవీ కెమెరాల ఆధారంగా పిల్లలు ఎటు వైపు వెళ్లారో తెలుసుకునే పనిలో ఉన్నారు. పారిపోయిన చిన్నారులు సయ్యద్ మైరాజ్ ఏ మెహ్రాజ్, షేక్ రెహాన్, సయ్యద్ ఆజం, సయ్యద్ సోహైల్, షేక్ అబ్దుల్ హక్ఏ ఇమ్రాన్, మొహమ్మద్ రెహాన్, మొహమ్మద్ హకీమ్, మొహమ్మద్ మహబూబ్ అని పోలీసులు తెలిపారు.

దక్షిణాదిపై బీజేపీ వివక్ష



(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. అభివృద్ధి, ప్రాజెక్టులే కాకుండా రాజకీయ పదవుల విషయంలో కూడా ఆయన దక్షిణాది పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. పదేండ్లుగా ప్రధాని మోడీ దేశ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పేపర్ ఎన్నికలు నిర్వహించడానికి బీజేపీ ఎందుకు భయపడుతోందని నిలదీశారు. ఎన్నికలకు ముందు తాను చెప్పినట్టే తెలంగాణలో కేసీఆర్‌ను గద్దెదింపామనీ, లోక్‌సభ ఎన్నికల్లో మరోసారీ అసెంబ్లీ ఫలితాలే పునరావృతమవుతాయని గుర్తు చేశారు. బీజేపీ ఎన్నికల బాండ్ల పేరుతో విచ్చలవిడి అక్రమాలకు పాల్పడుతూ అవినీతిని చట్టబద్ధం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీయేనని ధీమా వ్యక్తం చేశారు .

ఘనంగా సీతారాముల కల్యాణం



నవతెలంగాణ-అంబర్‌పేట్

సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బాగ్ అంబర్‌పేట్‌లోని పోచమ్మబస్తీలో సీతారాముల కల్యాణాన్ని బస్తీవాసులు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావతి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ పద్మావతి డీపీ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పంజాల మహేందర్ గౌడ్, పండాల సంపత్ గౌడ్, దడిగె జగన్, కపిల్ దేవ్, పంజాల అరవింద్ గౌడ్, సురేందర్ గౌడ్, మోర క్రాంతి ముదిరాజ్, గోపాల్ గౌడ్, దినేష్ యాదవ్, విశాల్, నర్సింగ్, నాగులు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ - హయత్ నగర్

అమాయక పేద ప్రజల నుండి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయాలు చేస్తున్న ఓ వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం విజయపురి కాలనీకి చెందిన జమాల్, యాకత్‌పురాకు చెందిన ఇమ్రాన్‌తో కలిసి చేస్తున్న బియ్యం వ్యాపారంలో భాగస్వామ్యం అయ్యాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు జమాల్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి 10 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇమ్రాన్ పరారీ లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పారుతున్న మురుగు



నవతెలంగాణ - మలక్ పేట్

మూసారాంబాగ్ నుండి మలక్‌పేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో మురుగు పారుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో మురుగు పూడిక తీయక పోవటంతో మురుగు స్తంభించి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రధాన రహదారి కావటంతో ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. కానీ మురుగు వలన వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చేవెళ్లలో రంజిత్‌రెడ్డి విజయం ఖాయం

• ఎల్మేటీ అమరేందర్ రెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.జీ.రంజిత్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని టీపీసీసీ కార్యదర్శి, కాంటెస్టెంట్ ఎమ్మెల్యే ఎల్మేటీ అమరేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం అధ్యక్షులు అహ్మద్ బాం అధ్యక్షతన బూత్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఇంచార్జి నిజాముద్దీన్, దేప భాస్కర్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. చేవెళ్లలో డా.జీ.రంజిత్ రెడ్డిని గెలిపించడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలసి కట్టుగా పనిచేసి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ



నియోజకవర్గం ఇంచార్జి, మాజీ శాసన సభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మల్లాపూర్‌లోని వై ఏ ఆర్ కన్వెన్షన్ హాల్లో జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, జల్ పల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ జాంగిర్ భాయ్, నాయకులు ఇక్బాల్ బిన్ ఖలీఫ్, జాకీర్ భాయ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మధుయాష్కీకి పలువురి నేతల పరామర్శ




నవతెలంగాణ - హయత్ నగర్

మాతృవియోగం పొందిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌ను పలువురు రాజకీయ ప్రముఖులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా హయత్ నగర్‌లో మధుయాష్కీ గౌడ్ మాతృమూర్తి అనసూయ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. తర్వాత మధుయాష్కీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, రాష్ట్ర మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పరమేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి సురభి ద్వివేది, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిడి శివ చరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పాత నేరస్తుడు అరెస్ట్





నవతెలంగాణ - హయత్ నగర్

నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించిన పాత నేరస్తుడిని వనస్థలిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురంలోని సచివాలయ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మంగిశెట్టి భాగ్యలక్ష్మి అనే మహిళ తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఈ నెల 14న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయాడు. వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు వనస్థలిపురంలోని ఎన్ జీ ఓస్ కాలనీ వద్ద ఓ బంగారం దుకాణంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు సాహెబ్ నగర్‌లోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన గోనుగండ్ల రాజేష్‌గా గుర్తించారు. వెంటనే అతని వద్ద నుండి 3.5తులాల బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కల్యాణం.. కమనీయం..



నవతెలంగాణ- మలక్‌పేట్

అర్చకుల వేద మంత్రాల మధ్య సీతా రాముల కల్యాణ మహోత్సవం వైభంగా జరిగింది.

నవతెలంగాణ- చైతన్యపురి

సీతారాముల కల్యాణాన్ని అష్టలక్ష్మీ దేవాలయంలో ప్రధాన అర్చకులు మరిగంటి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరీ శెట్టి చెందరశేఖర్ గుప్తా, గంప జగన్, అంజయ్య, శ్రవణ్ కుమార్, సుధాకర్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ఆలయాలల్లో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన సీతా రామ కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, శ్యామ్ చరణ్ రెడ్డి, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లో శ్రీరామ నవమి వేడుకలను ఎన్టీఆర్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించారు. ఈ సీత రాముల కళ్యాణంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, మధుర రెడ్డి దంపతులు పాల్గొన్నారు.



నవతెలంగాణ -నాగోల్

కొత్తపేట, నాగోల్, మన్సూరాబాద్, హయత్ నగర్, వనస్థలి పురం, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ల పరిధి లోని పలు కాలనీలలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం లో వంల ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.





నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లిలోని శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా సీతారామ కళ్యాణాన్ని భక్తుల మధ్య ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ లక్ష్మీ మెగా టౌన్ షిప్ లోని ఆలయంలో సీతారాముల కళ్యాణాన్ని ఉమ్మడి ప్రతాప్ రెడ్డి - యశోద ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొగ్గు శ్రీను, కార్యదర్శి మెండే కొండల్ యాదవ్, ట్రెజరర్ శివ శంకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దేప సందీప్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు జీఆర్ కరుణాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్‌నగర్

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన సీతా రాముల కల్యాణానికి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి దంపతులు వస్త్రాలు సమర్పించారు. ఈ కల్యాణంలో ఆలయ కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాస శర్మ, ధర్మకర్తలు మేక సురేందర్ రెడ్డి, నారగోని శ్రీనివాస్ యాదవ్, చాతిరి మధుసూదన్ సాగర్, గూడూరు మధుసూదన్ రెడ్డి, చీర తిరుమలేష్, చేగోని సురేష్ గౌడ్, గోరిరెడ్డి అంజి రెడ్డి, బిల్లకంటి కిరణ్ కుమార్, బీసుకుంట్ల సతీష్ గౌడ్, ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, బబ్బూరి ఆనంద్ కుమార్ గౌడ్, సాంబరాజు శైలజ తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మజీద్‌పూర్ గ్రామంలో జరిగిన సీతారాముల కల్యాణానికి తాజా, మాజీ సర్పంచ్ పోచంపల్లి స్వాతి సుధాకర్ రెడ్డి దంపతులు పుస్తె మెట్టెలు, పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పలువురు నాయకులు.





నవతెలంగాణ - సంతోష్ నగర్

ఆలయ చైర్మన్ సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో విజయ దుర్గాదేవి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏబీవీ బుచ్చిరెడ్డి, యాదగిరి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రామ్ రెడ్డి, జైంట్ సెక్రెటరీ రత్నమాచారి, ఆర్గనైజేషన్ సెక్రెటరీ బద్రి రావు, సుందర్, కుమార్, అనిల్ రెడ్డి, జంగారెడ్డి, శంకర్, దామోదర్ రెడ్డి, విజయలక్ష్మి, స్వర్ణలత, కృష్ణవేణి, లక్ష్మి, సంతోష్, వేణుగోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్‌లోని పలు కాలనీలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్‌లు, నాయకులు కేశిరెడ్డి పద్మా రెడ్డి, సిద్దల ఐలయ్య, రావుల శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్ రావు, శ్రీకాంత్ చౌదరి, నరసింహ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- చైతన్యపురి

శ్రీరామ నవమి సందర్భంగా చైతన్యపురి డివిజన్‌లో జరిగిన సీతా రామ కళ్యాణ మహోత్సవంలో కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా, బీజేపీ నాయకులు రుద్రారపు శంకర్, గంగ బోయిన వినోద్ యాదవ్, వెంకట రమణ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజపూర్ గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం, ఆపిల్ అవెన్యూ కాలనీలో తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి, మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్సమ్ బుచ్చయ్య గౌడ్, కౌన్సిలర్‌లు బొక్క రవీందర్ రెడ్డి, బొక్క శ్రీలత గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- బడంగ్ పేట్

సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలో పునర్నిర్మాణంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి మన ఊరు - మన గ్రంథాలయం (విలేజ్ లైబ్రరీ) ఫౌండర్, ఆదర్శ ఫౌండేషన్ చైర్‌పర్సన్ జి. అనితారెడ్డిల పిల్లలు దంత వైద్య విద్యార్థిని జి.హరిత, అద్విత్ కలిసి తమ కిడ్డి బ్యాంక్ నుండి రూ.21వేలను గుడి చైర్మన్ మర్రి నర్సింహారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి హనుమంతరెడ్డి, మాజీ కౌన్సిలర్ కుమార్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, లింగారెడ్డి, శంకర్, గజ్జల బాలరాజు, ఆనందరెడ్డి, కృష్ణా గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్‌లో రంగనాయకుల స్వామి ఆలయంలో నిర్వహించిన సీతా రాముల కల్యాణ మహోత్సవంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ శ్రీకృష్ణ దేవాయంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు డి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షురాలు కళ్యాణ లక్ష్మి, కమిటీ సభ్యులు రవి, కృష్ణ మూర్తి, బాల్ రాజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ శ్రీ వేంకటేశ్వర దేవాలయం, బాలాపూర్‌లోని దేవతాల గుట్ట శ్రీ స్వయంభూ ఆంజనేయ స్వామి దేవాలయం, బడంగ్‌పేట్ లోని మల్లికార్జున కాలనీలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజవర్గం విజయ రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతా రాముల కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, శంకర్, మహేందర్, బాల రెడ్డి, శ్రీశైలం యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర, బాలకృష్ణ, అరవింద్, సుభాష్, కల్యాణ్ యాదవ్, సైదులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని రాధిక క్రాస్ రోడ్డు, ఈసీఎల్ క్రాస్ రోడ్డు దగ్గర సొలీస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని తెలిపారు. నిత్యం పరిసర ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ చలివేంద్రాన్ని వెంకయ్య, తులశమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారులు వీరాంజనేయులు, బ్రదర్స్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు సైకిళ్లు అందజేసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఉంటున్న వికలాంగులు రాము, కృష్ణ, నరసింహలకు మున్సిపల్ మహిళా ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేత రాజు, యువ నాయకుడు కావడి రాజేష్ ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిళ్లను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్, మాజీ వార్డు సభ్యులు సంతోష్ గౌడ్, రాములు, దిలీప్, మహిళ నాయకురాలు నర్మద పరుశురాం, శ్రీనివాస్, మొదటి వార్డు మహిళా అధ్యక్షురాలు షాలోమి, ఉపాధ్యక్షులు సుశీల, శ్రావణి, యూత్ నాయకులు నాగరాజ్, రవి, కార్యకర్తలు ఉన్నారు.

చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



నవతెలంగాణ-కాప్రా

మే డే సందర్భంగా చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చర్లపల్లి చిన్మయాస్ చైర్మెన్ జె.రోసిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో గండూరి ఫుడ్స్ టీం 8 వికెట్లు కోల్పోయి 12 ఓవర్లలో 112 పరుగులు చేసింది. 113 పరుగుల టార్గెట్‌తో బరిలో దిగిన కేవీఆర్ టీం 7 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసింది. గండూరి ఫుడ్స్ టీం 13 పరుగుల తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నది. మేడే క్రీడలు విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ స్పోర్ట్స్ మేనేజింగ్ కమిటీ విప్లవ అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి శ్రీనివాసరావు, కొండల్‌రెడ్డి, రాజు, వికాస్, పవన్, గణేష్, వెంకటేష్, ఆర్గనైజింగ్ కమిటీ పాల్గొన్నారు.

సన్ సీడ్ ఆస్పత్రిలో ఉచితంగా ఓపీ సేవలు



- ఆస్పత్రి సీఈవో డాక్టర్ అన్వేష్

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ సన్ సీడ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆస్పత్రి సీఈవో డాక్టర్ అన్వేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి నెలకొల్పి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 30వ తేదీ వరకు ప్రతిరోజు జనరల్ ఫిజీషియన్ ఔట్ పేషెంట్స్‌కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గర్భిణీలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, పీడియాట్రిక్స్ (చిన్నపిల్లల) ఔట్ పేషెంట్స్‌కు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎలాంటి ఫీజులు లేకుండా ఉచిత కన్సల్టెన్సీ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆస్పత్రి డయాగ్నొస్టిక్ సెంటర్‌లలో 20శాతం రాయితీ ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనుముల నరసింహారెడ్డి, నరసింహారావు, డాక్టర్ అన్వేష్, డాక్టర్ భానుచందర్, డాక్టర్ స్వాతి, డాక్టర్ పావనీలు పాల్గొని 300 మంది పేషెంట్లకు బీపీ, షుగర్, థైరాయిడ్, గైనకాలజీ, డెంటల్, డెర్మటాలజీ సమస్యలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సన్‌సీడ్ ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు మృతి



- సీఐటీయూ నేతల సంతాపం

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం ఎదులబాద్ గ్రామపంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న పంచాయతీ కార్మికుడు జవాజి సత్తయ్య (55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మరణించాడు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎస్. సబితలు ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సత్తయ్య గ్రామ ప్రజలకు ఎన్నో సేవలు అందించారని చెప్పారు. ఆయన మరణం ప్రజలకు తీరనిలోటన్నారు. ఎదులాబాద్‌లో 30 ఏండ్లుగా చాలీచాలని వేతనంతో గ్రామానికి సేవలు అందించారని చెప్పారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లేష్, భిక్షపతి, సుధాకర్, వేణు, శివ, అల్లం శ్రీను, సత్తమ్మ లక్ష్మమ్మ కౌసల్య చంద్రమ్మ, సుజాత, కమలమ్మ, శ్రావణి, జ్యోతి, జంగమ్మ, రాధా, భవానీ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చక్రపురంలో శ్రీరామనవమి పానకం పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

శ్రీరామనవమి సందర్భంగా కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చక్రిపురం క్రాస్ రోడ్డులో బుధవారం పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాప్రా సర్కిల్ అధ్యక్షులు కే.యాదగిరి ముదిరాజ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ ముదిరాజ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిట్టల నాగరాజు ముదిరాజ్, గడ్డల పాండు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఐదేండ్లుగా శ్రీరామనవమి రోజున ఈ పానకం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ముదిరాజుల మధ్య ఐక్యత లేకపోవడంతో ఆస్తిత్వాన్ని కోల్పోవస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఏర్పడ్డాక ముదిరాజుల్లో ఐక్యతను పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే దసరాకు అలై.. బలై.. కార్యక్రమం, శ్రీరామనవమికి పానకం పంపిణీ, ప్రతీ ఏడాది నూతన క్యాలెండర్ ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ఐక్యతతో ఉంటే మరింత అభివృద్ధి చెందడానికి వీలుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సంఘం సభ్యులు శంకర్, విజయ్, ప్రశాంత్, శ్రీకాంత్, కనకయ్య, రాజు, గణేష్, నాగేష్, భరత్, ప్రేమ్, సంతోష్, శేఖర్, రాజు, ఆంజనేయులు, శ్రీనివాస్, రమేష్, రవి, మల్లేష్, బాలేష్, హరిబాబు, అరవింద్, ఈశ్వర్, రాము, సతీష్, రమేష్, మల్కాజిగిరి మండల అధ్యక్షులు సాంబరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్లు


- 25వ తేదీ వరకు స్వీకరణ
- మొదటి రోజు ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు
- హాజరుకానున్న కేంద్ర మంత్రులు హరిదీప్‌సింగ్ పూరి, కిషన్‌రెడ్డి
- 19, 22 తేదీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్స్ వేసే ఛాన్స్..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి రెడీ అవుతున్నారు. నేటి నుంచి 'మల్కాజిగిరి' పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు సైతం నామినేషన్లు వేసే అవకాశం కనిపిస్తోంది. కాగా నేడు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలకు సమయం ఉంటుంది. సెలవు దినం ఆదివారం మినహా మిగతా అన్ని పని దినాల్లో నామినేషన్లను స్వీకరిస్తారు.

రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరణ

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌కు ఎన్నికల అధికారిగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ వ్యవహరిస్తున్నారు. రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఇక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థితో కలిపి మొత్తం ఐదు మందిని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు. ఒక్క అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమపై ఏమైనా కేసులు ఉంటే వాటి వివరాలను తప్పని సరిగా పత్రికలు, ఛానెళ్ల ద్వారా వెల్లడించాల్సి ఉంటుంది.



నేడు ఈటల రాజేందర్ నామినేషన్

నామినేషన్ల దాఖలు మొదటి రోజు గురువారం ఉదయం 11 గంటలకు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు హరిదీప్‌సింగ్ పూరి, కిషన్‌రెడ్డి హాజరు కానున్నారు. శామీర్‌పేటలోని ఈటల రాజేందర్ నివాసం వద్ద ఉదయం 8 గంటలకు జరిగే సభకు ఇద్దరు కేంద్ర మంత్రులు హాజరు కానున్నారు. అనంతరం ర్యాలీతో మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టరేట్ వద్దకు చేరుకుంటారు. బిట్స్ బిలానీ చౌరస్తా లేదా కలెక్టరేట్ గేట్ వద్ద అభ్యర్థి వెంట వచ్చిన వారిని ఆపేసి, అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు.

19 లేదా 22 తేదీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నామినేషన్లు..!

మొదటి రోజు ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం లేనట్టుగా సమాచారం. ఈ నెల 19న ఏకాదశి, 22 చతుర్థశి ఉంటంతో, ఈ రోజుల్లో నామినేషన్లు వేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ ఎనిమిది రోజుల్లో స్వతంత్ర అభ్యర్థులతోపాటు మరికొన్ని పార్టీల నుంచి కూడా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉంది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 25వ తేదీ సాయంత్రం 3 గంటలతో ముగియనుంది.

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

- అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసిన సునీతామహేందర్ రెడ్డి, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ - జవహర్‌నగర్

శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం జవహర్ నగర్‌లోని వివిధ ఆలయాల్లో ఉదయం 11:59 నిమిషాలకు అభిజిత్ లగ్నం ముహూర్తంలో వైభవంగా నిర్వహించారు.

అంబేద్కర్ నగర్‌లో..



జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మేయర్ శాంతి కోటేశ్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కార్పొరేటర్లు ప్రత్యేక పూజలు చేశారు.

బాలాజీనగర్‌లో..



బాలాజీ నగర్‌లోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తాలు ముఖ్యతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలను తెలిపారు. ఇదిలా ఉంటే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లకు సహకరించిన వారికి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



అంబేద్కర్‌నగర్‌లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నంగునూరు అశోక్ కుమార్, యువజన సంఘం అధ్యక్షులు కందిబండ సతీష్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడో డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్, కేఎస్ఆర్ కాలనీవాసులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగుల కాలనీలో..



శ్రీరామనవమి సందర్భంగా వికలాంగుల కాలనీలో డివిజన్ అధ్యక్షుడు బూడిద వెంకటేశ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శామీర్‌పేటలో..



శ్రీరామ నవమి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి , తోటకూర వజ్రేష్ యాదవ్, శామీర్‌పేట్ మండల ఎన్నికల ఇన్‌చార్జి నక్క ప్రభాకర్ శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శామీర్‌పేట్ మండల మాజీ జెడ్పీటీసీ బాలేష్, తూంకుంట మున్సిపల్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోతాయిపల్లి మాజీ ఉప సర్పంచ్ రాజు, మున్సిపల్ ఉపాధ్యక్షులు మురళీగౌడ్, రాము, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, కిసాన్ సెల్ అధ్యక్షులు ధర్మారెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త భారతమ్మ, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేశాంత్, ప్రధాన కార్యదర్శి రమేష్, సాయి మనీష్, బాబు, భిక్షపతి, గౌతమ్ గౌడ్, మహేందర్, ప్రదీప్, రవీందర్ గౌడ్, దుర్గయ్య, సాయిలు, పాండు, సాయి, సాయికృష్ణ, వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, కిషోర్, రోహిత్ రెడ్డి,యస్ యస్ యు ఐ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి,భరత్ గౌడ్,సాయి, ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లిలో..



మూడుచింతలపల్లి మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. కాగా లక్ష్మాపూర్ గ్రామ పరిధిలోని రాములగుట్టలో రాములగుట్ట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి రాములోరి కల్యాణాన్ని వీక్షించి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హారిక మురళీగౌడ్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు జాము రవి, మాజీ ఉపసర్పంచ్ వైద్యనాథ్, సత్యనారాయణ, గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా, మర్యాల వీరేశం, క్యాతం మధుకృష్ణ, చినలచ్చు శ్రీనివాస్, క్యాతం రవి, గౌటే గోపాల్, శావుకారి, లగిశెట్టి అరుణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..



మేడ్చల్ మండల వ్యాప్తంగా బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. మండల పరిధిలోని పూడూరు గ్రామంలో నిర్వహించిన సీతారామ చంద్రుల కల్యాణ మహోత్సవంలో బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఎంపీటీసీ నీరుడు రఘు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఆర్.మల్లారెడ్డి, నక్క మల్లికార్జున్, సింగరేణి పోచయ్య, కృష్ణ, గోపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నిర్వహించిన సీతారామ చంద్రుల కల్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, లక్కిరెడ్డి శ్రీలత శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బేరి ఈశ్వర్, నరేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఘట్కేసర్‌లో..



ఉమ్మడి ఘట్కేసర్ మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు కనుల పండుగగా జరిగాయి. బుధవారం ఘట్కేసర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాలు జరిగాయి. ఆలయాలను పచ్చటి తోరణాలు, పందిళ్లను వేసి కల్యాణ వేదికలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఘట్కేసర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద, శివారెడ్డిగూడ దండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయస్వామి-మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో, కొండాపూర్‌లోని అక్కన్నమాదన్న ఆలయం, చౌదరిగూడ వెంకటాద్రిటౌన్ షిప్ శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయంలో, చౌదరిగూడలోని శ్రీసీతారామాంజనేయస్వామి, ఎదులాబాద్‌లోని రామాలయం దేవాలయ ఆవరణల్లో శ్రీ సీతారాములు కల్యాణం జరిగింది. చౌదరిగూడ వెంకటాద్రి టౌన్ షిప్‌లో కోదండ రామచంద్రస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ శాశ్వత ధర్మకర్త దంపతులు బైరు రమాదేవి రాములు గౌడ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొనగా ఆయనను రాములు గౌడ్ దంపతులు సన్మానించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో..



శ్రీ రామ నవమి సందర్భంగా అల్వాల్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సీతా రామచంద్ర స్వామి కల్యాణమహోత్సవం పూర్తి సాంప్రదాయ వైభవంగా జరిగింది. ఈ దివ్య ఘట్టం కల్యాణానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

కాప్రాలో..



శ్రీ రామనవమి సందర్భంగా ఓల్డ్ మల్లాపూర్‌లోని సీతా రామాంజనేయ స్వామి ఆలయం, అశోక్ నగర్ శ్రీరామాలయంలో, గోకుల్ నగర్ అయ్యప్పస్వామి ఆలయంలో, శ్రీ నందీశ్వరాలయంలో, నెహ్రూనగర్, కేఎల్‌రెడ్డి నగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం, మల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ అలయాలల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి హాజరైయ్యారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..



శ్రీరామనవమి సందర్భంగా కాప్రా డివిజన్‌లోని చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరయ్యారు.

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీలో..



మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ ఫోర్త్ డివిజన్‌లోని సీతారామ కల్యాణ మహోత్సవానికి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు. పోచమ్మ గుడి, వెంకటేశ్వర ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీజేపీ అధికార ప్రతినిధి మునిగంటి రాం ప్రదీప్, బ్రహ్మాచారి ,లింగం, దేవేందర్, ఉమారాణి, రాజేశ్వర్ రావు, రవీందర్, సూరజ్, మురళీ చారి పాల్గొన్నారు.

నాచారం డివిజన్‌లో..



శ్రీరామనవమి సందర్భంగా నాచారం డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో, వీఎస్టీ కాలనీ పార్కులో నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పట్టు వస్త్రాలను సమర్పించిన బొంతు శ్రీదేవి



శ్రీరామ నవమి సందర్భంగా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణం సందర్భంగా రాముల వారికి పట్టు వస్త్రాలు, సీతమ్మకు చీర, గాజులు, ముత్యాల తలంబ్రాలు, ఓడి బియ్యం, పూలదండలు సమర్పించారు. కుషాయిగూడలోని శ్రీవెంకటేశ్వర స్వామి టెంపుల్, కన్యకా పరమేశ్వరి టెంపుల్, వాసవీ శివనగర్, నెహ్రూ నగర్ కాలనీ తుల్జా భవానీ టెంపుల్, గాంధీ నగర్ కాలనీ, చక్రిపురం కాలనీ, భగవాన్ కాలనీ, రెడ్డి కాలనీ కాలనీల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి బొంతు శ్రీదేవియాదవ్ హాజరై పూజలు చేశారు.

శ్రీ సాయి బాలాజీ ఎన్‌క్లేవ్‌లో శ్రీరామ నవమి వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

మల్లంపేటలోని శ్రీ సాయి బాలాజీ ఎన్‌క్లేవ్ రోడ్ నెం 01 లో సీతారాముల కళ్యాణం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను సాయి బాలాజీ అసోసియేషన్ స్వచ్ఛదంగా గత 3సం။రాల నుంచి నిర్వహిస్తున్నారు. భక్తులు, కాలనీవాసులందర కలిసి కమిటిని అభినందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి బాలాజీ అసోసియేషన్ మెంబర్స్ చిరంజీవి, అరుణ్ కుమార్, బస్వరాజు, సుబ్రహ్మణ్యం, రవీంద్ర రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, మహేష్, ప్రసాద్, కాలనీవాసులు భక్తులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప 33వ డివిజన్‌కు చెందిన రజనీ అనే మూగ వికలాంగురాలుకి గత నాలుగు సంవత్సరాలుగా తన అనారోగ్య స్థితిని అధికారులకు, నాయకులకు తెలియజేశారు. అయిన సదరన్ సర్టిఫికెట్ రాలేదని, సీనియర్ కాంగ్రెస్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి రజని అనారోగ్య స్థితిని తెలుసుకొని సహకార అందించడంతో సదరన్ ధ్రువ పత్రము జారీ చేశారు. ఈ మేరకు బుధవారం కొలను శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా కుటుంబ సభ్యుల సమక్షంలో రజనికి అందజేశారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫణి, నరసింహ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శ్రీరామనవమి పర్వదినాన, శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు, కాంగ్రెస్ మహిళా నాయకు రాలు శిరీష సత్తూర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సత్యం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మధు, గాయత్రి తదితరులతో కలిసి, ఆల్విన్ కాలనీ డివిజన్లోని పలు రామాలయాల్ని దర్శించుకుని, శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదాలు వడ్డించి, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతో షాలతో ఉండాలని కోరారు.



ఆల్విన్ కాలని డివిజన్‌లలో శ్రీ రామనవమి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్...

నవతెలంగాణ-కూకట్‌పల్లి



వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ పట్టాభి సీతా రామ కళ్యాణంలో పాల్గొన్న రోజా దేవి రంగారావు..

నవతెలంగాణ-కూకట్‌పల్లి



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు... నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్ లో, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి,మ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో, నిర్వహించిన శ్రీ సీతారా ముల కళ్యాణ మహోత్సవానికి, ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు, కె.యం.ప్రతాప్ హాజరయ్యారు. ప్రత్యేక పూజాలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



శ్రీరామ నవమి వేడుకలలో పాల్గొన్న కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, తదితరులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మేయర్ వారి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ టెంపుల్ బస్ స్టాప్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ చైర్మెన్, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

నవతెలంగాణ-దుండిగల్



రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వద్దేపల్లి రాజేశ్వర్ రావు...

నవతెలంగాణ-కూకట్‌పల్లి



జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలో, కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో, గార్డెన్ బస్తీలో, 131 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్స వాలకు, వారి యొక్క ఆహ్వానం మేరకు, ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె. పి. విశాల్ గౌడ్ హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



శ్రీరామనవమి వేడుకలలో ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా బుధవారం గాజుల రామారంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో కేకేఎం ట్రస్ట్ చైర్మెన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



శ్రీరామ నవమి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి లో చంద్రగిరి నగర్, శ్రీనివాస్ నగర్, బి.హెచ్.ఈ.ఎల్ విస్తా కాలనీ, శ్రీని ఎంక్లేవ్, గాయత్రి నగర్, ఎచ్.ఎ.ఎల్. రాఘవేంద్ర కాలనీ, కుత్బుల్లాపూర్ గ్రామం, అయోధ్య నగర్, ప్రసూన నగర్, వాజపేయి నగర్, సంజీవయ్య నగర్, శ్రీరాం నగర్, గాజులరామారం, సంజయ్ గాంధీ నగర్ ల లోని పలు శ్రీరాముని ఆలయాలలో పాల్గొని, పలు కాలనీ సభ్యులు ఏర్పాటు చేసిన శ్రీ సీతరాముల కల్యాణ మహోత్సవాలలో పాల్గొని స్వామి వారిని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని బుధవా రం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ హనుమాన్ దేవాలయం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానం ద్, కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్,జై గౌడ్ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేశం గౌడ్ లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో నందన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ కార్యక్రమంలో నందన్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కార్తీక్ గౌడ్ మారయ్య హరిబాబు రమ్మి గౌడ్, సుదర్శన్ గౌడ్ హాజరయ్యారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



గాంధీనగర్‌లోని శ్రీ రామలింగేశ్వర ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని సీతా రాముల కళ్యాణం ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్,మాజీ ఎమ్మెల్యే కూనా శ్రీశైలం గౌడ్, స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో అలయ కమిటీ సభ్యులు సత్యనారాయణరావు, రంగా శ్రీనివాస్ గౌడ్, బిక్షపతి, నరసింహ, కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



శ్రీరామనవమి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ దేవాలయాలలో, బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడ, బాలానగర్ లోని దుర్గా దేవి ఆలయం, చెరబండరాజు కానీలలో ఆంజనేయ స్వామి దేవాలయాలలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, మల్కాజ్ గిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కుమార్తె మనీషా రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్

పైప్ లీకేజీతో వృధాగా పారుతున్న నీరు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

పైప్ లీకేజీతో వృధాగా రోడ్డు పై పారుతున్న మంచి నీరు... మంచి నీటి సరఫరా సమయంలో మంచి నీరు వృధా...అసలే వేసవి కాలం నీటి కొరతతో అల్లాడుతున్న జనం.. అయినా నీటి పొదుపు చేయలేక పోతున్న జలమండలి అధికారులు అని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా మంచి నీటి వృధా అయినా పట్టించుకోని అధికారులు, కూకట్‌పల్లి సర్కిల్ వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ ఎదురుగా, బాగ్ అమీర్, ప్రగతి కళాశాల సమీపంలో భూగర్భ మంచి నీటి పైప్ లైన్ లీక్ అవడంతో, గత నెల రోజులుగా మంచి నీరు రోడ్డుపై వృధాగా పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలుపుతున్నారు. మంచి నీటి సరఫరా సమయంలో నీటి లీకేజ్ వల్ల ప్రగతి కళాశాల నుంచి కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సర్వీస్ రోడ్డు ద్వారా రామాలయం కమాన్ వరకు వరదలా పారుతున్న మంచి నీరు.. స్థానిక లైన్ మెన్ చూసి చూడనట్టుగా వెళ్లడం తప్ప, మరమ్మత్తులు చేయించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి, లీకేజీ మరమ్మత్తులు చేయించి మంచి నీటి వృధాను ఆపాలని స్థానికులు కోరారు.

రైతు బజార్ ఖాళీ జాగాలో అసలేం జరుగుతోంది..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి మండలం, ఎల్లమ్మ బండ రైతుబజార్ సమీపంలో ఖాళీ జాగాలో అసలేం జరుగుతుంది.. భూమి విలువ రోజు రోజుకి పెరుగుతుండటంతో... మాదంటే మాదని ఘర్షణకు దిగుతున్న ఇరు వర్గాలు. ఖాళీ జాగా కనపడితే చాలు అక్కడ వివాదం మొదలవుతుంది. అలాంటిదే ఈ ఘటన.. ఎల్లమ్మ బండ రైతు బజార్‌ను అనుకుని ఉన్న ఖాళీ జాగా మాదే అంటూ కొందరు.. ఉదయం పూట బెస్మెట్ కడితే, మరికొందరు సాయంత్రానికి ఆ జాగా మాదే అంటూ తమ అనుచరులతో కలిసి కూల్చేయడం జరిగింది. ఇదంతా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన నాటకీయ తంతు.. ఇదిలా ఉండగా బుధవారం రోజున ఆ కాళీ స్థలం జేసీబీ సహాయంతో చదును చేసేందుకు పూనుకున్న వాళ్ళని ,స్థానిక బస్తీ వాసులు ఈ స్థలంలో లైబ్రరీ, మహిళా మండలి కొరకు ఈ స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలాన్ని మీరెందుకు చదును చేస్తున్నారని అడ్డుకుని వాగ్వాదానికి దిగడంతో జేసీబీని తెచ్చిన వారు తెచ్చినట్టుగా వెనక్కి పంపడం జరిగింది. ఇదే విషయం పై రెవెన్యూ అధికారిని సంప్రదించగా....అది 336 సర్వే నంబర్లోని భూమి అని, అక్కడ గతంలోనే లైబ్రరీ, మహిళా మండలి కార్యాలయాలకి కేటాయించడం జరిగిందని..అందులో ఎలాంటి ప్రయివేటు వ్యక్తులకు హక్కులు లేవని తెలిపారు.

సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సీతారాముల,హనుమాన్ దేవాలయాల ప్రాంగణంలో బుధవారం శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వెంకట్రాంరెడ్డి నగర్‌లో గల సీతారాముల వారి దేవాలయంలో కళ్యాణోత్సవం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కమనీయంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గాడిచర్ల కనకరాజు,ప్రధాన కార్యదర్శి వీరభద్రరావు, కోశాధికారి సావంత్ కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రం నారాయణ, ముఖ్య సలహాదారులు ఎన్.లక్ష్మణ్ గౌడ్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

గాజులరామారం డివిజన్‌లో..

ఉమాదేవినగర్‌లో గల శ్రీ శివ కేశవ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆలయ నిర్వహణ కమిటీ,యూత్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూరపాటి కరుణాకర్ రాజు, పి.సమ్మయ్య యాదవ్,కే కృష్ణమూర్తి గుప్తా, ఎం.అశోక్ చారి, పి.రాములు గౌడ్, కూరపాటి శ్రీరామరాజు, యూత్ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, శంకర్, క్రాంతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు.



జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో...

మగ్దుమ్ నగర్‌లోని శ్రీ శివ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీతా రాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ.అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొలుకుల జైహింద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు.



ఈటలను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని కేపిహెచ్‌బీ కాలనీ డివిజన్ బీజేపీ కన్వీనర్ గురు ప్రసాద్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ బీజేపీ కన్వీనర్‌గా గురు ప్రసాద్ నియమితులైన సందర్భంగా బుధవారం పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న సభ్యులందరిని కలుపుకోని పార్లమెంటు అభ్యర్థి ఈటెల రాజేందర్ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావాలని నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి అవుతున్నారని దీమా వ్యక్తం చేశారు. ప్రజలు పార్టీల అతీతంగా ఈటెల రాజేందర్ ను మల్కాజిగి రి ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావుకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కోకన్వీనర్ పద్మయ్య, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సూర్యప్రకాష్, పాపయ్య గౌడ్ కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర రావుకు కృతజ్ఞతలు తెలిపారు.


శ్రీరామనవమి పురస్కరించుకొని ఎస్.పి రోడ్డులోని శ్రీ వీర హనుమాన్ దేవాలయంలో రామ్ గోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవతెలంగాణ-బేగంపేట

దేవాలయ కల్యాణ కట్టల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రంలోని వివిధ దేవాలయాల కల్యాణ కట్టల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయా లని తెలంగాణ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం (కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం) నాయకులు కె. సతీష్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఉన్న ఆయా దేవాలయ పాలక మండలిలో నాయి బ్రాహ్మణులకు సభ్యులు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తలనీలాల టెండర్లలో నాయి బ్రాహ్మణులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. వేములవాడ, కొండగట్టు,యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణ కట్టల్లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులు ,మహిళల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. దేవాలయాల్లో ఉన్న కల్యాణ కట్టల్లో ఖాళీగా ఉన్న నాయి బ్రాహ్మణ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, కమిషనర్‌ను కోరారు. నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ కార్పొరే షన్‌గా మార్చి పాలకమండలి నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు'

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. బుధవారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో దళిత బహుజన పార్టీ తరపున రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయుటకు కరీంనగర్ ఎంపీ నియోజక వర్గం నుండి మాతంగి హనుమయ్య, నిజామాబాద్ ఎంపీ నియోజక వర్గం నుండి గోలి నరేష్ లను అభ్యర్థులుగా ప్రకటించి పార్టీ బీ ఫామ్ లను వడ్లమూరి కృష్ణ స్వరూప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ కుల పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు దళిత బహుజన రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ మనువాద దోపిడీ మాఫియా పార్టీలను ఓడించకపోతే దళిత జాతులకు ఇక భవిష్యత్తు ఉండదని, సామాజిక బానిసత్వం తప్పద న్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్.రాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'అధ్యాపకురాలు స్రవంతికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించిన టీఎస్ టీసీఈఏ'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కెపీఆర్ఐటీ కళాశాల, సీఎస్ఈ డిపార్టు మెంట్‌కు చెందిన అధ్యాపకురాలు స్రవంతికి టీఎస్ టీసీఈఏ అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో స్రవంతి భర్త శ్రీకాంత్‌కు బుధవారం అపెక్స్ ఆసుపత్రిలో అందజేశారు. ఈ సందర్భంగా తన తోటి అధ్యాపకురాలికి అందించిన ఆర్థిక సహాయానికిగానూ సంతోష్ కుమార్ కు భార్యాభర్తలు ఇద్దరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి'



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ యువ నాయకుడు ఆశిష్ కుమార్ యాదవ్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు.

ఇండియా కూటమి విజయం తథ్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నర్సింహా



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం తథ్యమని, యువత, విద్యార్థులను మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని, బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నర్సింహా పిలుపునిచ్చారు.బుధవారం హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్ లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహించిన సమావేశంలో 'ప్రస్తుత రాజకీయాలు' అనే అంశంపై ఈ.టి.నర్సింహా మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం బీజేపీ మతోన్మాద ఆటను తీవ్రతరం చేస్తోందని, మత విద్వేషాలు రెచ్చగొట్టి మూడవ సారి అధికారంలోకి వచ్చేందుకు పావులు కదుపుతోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని హిందువులకు అనుకూలంగా మార్చేస్తాం అంటూ మతాల మధ్య చిచ్చురేపే ప్రకటనలను బీజేపీ నాయకులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు.హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు రాజకీయాలను అంటకడు తోందన్నారు. మే నెలలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ దేశ విచ్ఛిన్నకర విధానాలను ఓటర్లపై రుద్ది మళ్ళీ అధికారాన్ని పొందాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మోడీ గత 10 ఏళ్ల కాలంలో దేశంలో ఎలాంటి మార్పులు రాలేదని, కేవలం మతోన్మాదం, కార్పొరేట్ శక్తుల అంశాల పైనే దృష్టి సారించారన్నారు. పౌర హక్కులను కాలరాస్తూ సీబీఐ, ఈడీలను రాజకీయాలను స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్న బీజేపీకి వ్యతిరేకంగా యువత పోరాడాలని, ఫెడరలిజం స్ఫూర్తిని దెబ్బ తిస్తున్న దళిత, మైనారిటీ, ఆదివాసీ, మహిళా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న మోడీ, షాలను ఓడించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్స్ సత్య ప్రసాద్, యుగంధర్, బిజ్జ శ్రీనివాసులు, పేరబోయిన మహేందర్, సమితి సభ్యులు స్వప్న, షేక్ మహమూద్, మొగిలి లక్ష్మణ్, ఎల్లంకి మహేష్, చిలకరాజు శ్రీను, మార్కపూరి సూర్య మానస్ కుమార్, నాయీమ్, చిరంజీవి, మజీద్, అనిల్, కళ్యాణ్, సుశాంత్, వెంకన్న, శోభన్, రమేష్, శేఖర్, రాధ, రవికుమార్, మస్క సుధీర్, రాజ్ కుమార్, ఆంజనేయులుతో పాటు 40 మంది జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నామినేషన్లకు వేళాయే

- నేటి నుంచి నామినేషన్లు
- ఈనెల 29 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- గ్రేటర్‌వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గ్రేటర్ హైదరాబాద్‌లో గురువారం ప్రారంభం కానుంది. ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను సంబంధిత అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. సెలవు రోజులు మినహా ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలుకు కావాల్సిన నామినేషన్ ఫారం-2ఏను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందొచ్చు. దాఖలైన నామినేషన్లను ఈ నెల 26న పరిశీలించనున్నారు. 29న ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఇదిలావుంటే రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు మూడు వాహనాలనే అనుమతించనున్నారు. ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా ఆయా కార్యాలయాల వద్ద పోలీసులు బారికేడ్లు, వంద మీటర్ల దూరాన్ని తెలిపేలా సూచికలు ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నలుగురు మద్దతుదారులను మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. వందమీటర్ల దూరం నుంచి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్వీకరిస్తారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్వీకరిస్తారు. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి రిటర్నింగ్ అధికారిగా బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) డి. మధుకర్ నాయక్ స్వీకరించున్నారు.

అభ్యర్థులకు ముఖ్యమైన సూచనలు

- ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు.
- అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమేలోనికి అనుమతించనున్నారు.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజక వర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషను ప్రతిపాదిస్తే సరిపోతుంది.
- రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషను ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందినవారైన పక్షంలో తప్పనిసరి వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- రిజిస్టర్డ్, గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్-3లో 'సి' కాలం ఎదురుగా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తుల్లో ఏవైనా మూడు గుర్తులను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేస్తూ వివరాలు పొందుపర్చాలి.
- అభ్యర్థులు గరిష్టంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయొచ్చు. సంబంధిత బ్యాంకు అకౌంట్ లావాదేవీల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుంది.
- గడిచిన పదేండ్లలో ఎవరైనా అభ్యర్థులు ప్రభుత్వ క్వార్టర్లలో ఉన్నట్టయితే, వాటర్, కరెంటు బిల్లులు వంటివి బకాయిలు లేవని నిరంభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) జతపర్చాలి.
- అభ్యర్థులు ఏవైనా క్రిమినల్ కేసులుంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3ఏలో వాటి వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాల్సి ఉంటుంది.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీల వంటివి ముంద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127 - ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు 48గంటల ముందు 'సువిధ' పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి.

బీజేపీ మ్యానిఫెస్టోలో ఎన్వీరాన్మెంట్‌కు చోటు కల్పించకపోవడం హాస్యాస్పదం

- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్ మెంట్ కౌన్సిల్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

చాటడంతా మ్యానిఫెస్టో ప్రకటించిన బీజేపీకి 'ఎన్విరాన్మెంట్ పరిరక్షణకు' చోటు కల్పించకపోవడం హాస్యాస్పదంగా ఉందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎద్దేవా చేసింది. నిత్యం స్వచ్ఛ భారత్ అంటూ మాటలు గుప్పించే బీజేపీ జాతీయ నాయకత్వం ఎన్నికల వేళ ఆ విషయాన్ని మర్చిపోవడం అత్యంత బాధాకరమని కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సీ.హెచ్.రంగయ్య, జాతీయ సలహాదారులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ నాయకత్వం గ్రీన్ కార్పొరేషన్ ఏర్పాటుకు మ్యానిఫెస్టోలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పార్టీ పలు పత్రికలు, మీడియాల్లో విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకటనల్లో పర్యావరణం పరిరక్షణ ఊసే లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. బీజేపీ మ్యానిఫెస్టోతో అనేక మంది పర్యావరణ వాదులు, పర్యావరణ అభిలాషులు తీవ్ర ఆవేదన చెందినట్లు వారు పేర్కొన్నారు. పర్యావరణం అంటే సమస్త మానవాళి మనుగడకు సంబంధించిన అంశమన్నారు. అలాంటి గొప్ప సమస్య పరిష్కారానికి పార్టీ విధానం వెల్లడించకుండా మ్యానిఫెస్టో రూపొందించడం చూస్తుంటే ఓట్ల ఉద్దేశ్యం తప్ప సామాజిక బాధ్యత కనిపించడం లేదని విమర్శించారు. గత పదేళ్ల నుంచి స్వచ్ఛత గురించి మాట్లాడుతున్న ఆ పార్టీకి పర్యావరణంపై ఏపాటి బాధ్యత ఉందో తేటతెల్లమైందని, ఈ రకమైన ఉదాసీనత తగదని హితవు పలికారు. ఇప్పటికైనా బీజేపీ తన మ్యానిఫెస్టోలో పర్యావరణానికి బడ్జెట్ లో పది శాతం నిధుల హామీతో 'గ్రీన్ కార్పొరేషన్' ఏర్పాటుకు సానుకూలతను ఇస్తూ మ్యానిఫెస్టో పునరుద్ధరించి ప్రచారంలో పెట్టాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థిని అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ మహబూబ్ కుమార్తె ప్రవీణ్ ఖతున్(15) విద్యార్థిని. ఈ నెల 16న స్కూల్ నుండి ఇంటికి వచ్చిన అమ్మాయి మధ్యాహ్నం 2 గంటలకు ఇంట్లో నుండి బయటకు వెళ్ళింది. సాయంత్రం ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబీకులు స్థానికంగా, స్నేహితుల, బంధుమిత్రులతో వాకాబు చేసిన ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితురాలి సోదరుడే కదా అని మాట్లాడితే వేధింపులకు గురిచేశాడు

- నిందితుడిని అరెస్టుచేసిన షీ బృందాలు
- ఆరు రోజుల జైలు, జరిమానా

నవతెలంగాణ-సిటీబ్యూరో

తన స్నేహితురాలి సోదరుడే కదా అని మాట్లాడితే వేధింపులకు గురిచేసిన నిందితుడిని షీ బృందాలు అరెస్టు చేశాయి. బుధవారం డీసీపీ డీ.కవిత తెలిపిన వివరాల మేరకు నగరానికి చెందిన ఓ అమ్మాయికి ఓ స్నేహితురాలుంది. స్నేహితురాలిని కలిసే సమయంలో ఆమె (స్నేహితురాలికి వరసకు సోదరుడు) సోదరు కూడా బాధితురాలిని కలిసేవాడు. ఇలా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల తర్వాత తాను ప్రేమిస్తున్నానని, పెండ్లీచేసుకుంటానని బాధితురాలిని నమ్మించాడు. మంచివాడిగా నటించిన నిందితుడు ఆమె వ్యక్తిగత సమాచారం, ఫోటోలను సేకరించాడు. ఇదిలావుండగా నిందితునికి అప్పటికే పెండ్లయిందని, ఇద్దరు పిల్లలున్నారని తెలుసుకున్న బాధితురాలు అతన్ని దూరం పెట్టింది. దాంతో ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. తాను చెప్పినట్టు వినకుంటే ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పెడ్తానని, బంధువులకు, స్నేహితులకు సైతం షేర్ చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. రోజురోజుకు వేధింపులు అధికం కావడంతో బాధితురాలు విషయాన్ని ఇంట్లో చెప్పింది. కుటుంబసభ్యులు షీ బృందాలను ఆశ్రయించడంతో అన్నికోణాల్లో విచారించిన షీ బృందాలు నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లికోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి న్యాయమూర్తి ఆరు రోజులపాటు జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధించారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం









నవతెలంగాణ-అంబర్‌పేట

ఎంసీహెచ్ కాలనీలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మెన్ రంగు వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, ఎర్రబోలు నరసింహారెడ్డి, అడ్వకేట్ మధుసూదన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రంగు సతీష్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చై నెంబర్ చౌరస్తాలో..

సిక్స్ నెంబర్ చౌరస్తాలో రామాలయం ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాగ్ అంబర్‌పేటలో..

బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని కృష్ణ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామ నవమి వేడుకల్లో పాలొన్న మైసమ్మ ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివకుమార్, మాధవి, విజయ్, శృతి, డా.రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమనగర్‌లో..

అంబర్‌పేట డివిజన్‌లోని ప్రేమనగర్ శ్రీ వీర అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ భారతి యూత్ అసోసియేషన్ వారి ఆహ్వాన మేరకు సీతారాముల కల్యాణ మహోత్సవానికి బీసీ విద్యార్థి విభాగం నాయకుడు రాజశేఖర్ గంగాపుత్ర పాల్గొని భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజశేఖర్ గంగపుత్ర మాట్లాడుతూ ప్రజలందరికీ సీతారాముల వారి అనుగ్రహం ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు ఆచార్య ఆత్రేయ, పవన్ కుమార్, సాగర్, మహేష్, సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, శంభుల శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీ, నాయకులు రాంపల్లి ప్రభు లింగం, భగవాన్, సుధాకర్, కోటం అనిల్ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు

విజయ్ పాల్ ఆధ్వర్యంలో..

శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని అఖండ భారత్ సేన అధ్యక్షుడు విజయ్ పాల్ ఆధ్వర్యంలో శ్రీ రామ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాముల వారి కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 250 మంది యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాత్రను ఇసామియ్ బజార్ నుండి ప్రారంభమై చెప్పల్ బజార్, లింగంపల్లిచౌరస్తా, కాచిగుడా చౌరస్తా గుండా ఆర్య సమాజం సుల్తాన్ బజార్ చేరుకుంది. కార్యక్రమంలో అధ్యక్షులు ధరంపాల్ సత్య పాల్,విజయ్ పాల్, అశ్విన్ యాదవ్, అజయ్ పాల్, యష్ పాల్, అభినవ్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.

బోనం వీరబాబు ఆధ్వర్యంలో

శ్రీరామనవమి పురస్కరించుకొని బోనం వీరబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పానుకం కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అశోక్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో..

సీతారాముల కళ్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రాముల వారి కల్యాణానికి తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి. ఆంజనేయులు హాజరై స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు దేవాలయలలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణం ఉత్సవంలో పాల్గొన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నగేష్ ముదిరాజ్. భిక్షపతి, ఉదయ, రాజు, పండరి, శ్రీహరి పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు దేవాలయాలలో జరిగిన సీతారాముల కల్యాణంలో రామ్ నగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి, నేత శ్రీనివాస్, రేషన్ మల్లేష్, సిరిగిరి శ్యామ్, రజనీకాంత్, కిరణ్ తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దోమలగూడలో..

ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.దేవనాథం, ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ గొల్లగడ్డ రాజశేఖర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జైసింహా, సాయిక్రిష్ణ, ఆలయ అర్చకులు మహేందర్ పంతులు, కమిటీ సభ్యులు కెఆర్‌కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఆలయ మాజీ చైర్మెన్ గొల్లగడ్డ రాజశేఖర్ గౌడ్ జ్ఞాపికను అందచేసి ఘనంగా సన్మానించారు.

సుల్తాన్‌బజార్‌లో..

సీతారామాలయం కల్యాణ మండపం ట్రస్ట్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ సీతారామాలయంలో బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి సీతారాముల వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామాలయ ట్రస్ట్ ప్రతినిధులు విజయ్ సాయి, సంతోష్, ముత్యాల గోవింద రాజు, రిటైర్డ్ ప్రొఫెసర్ బాగయ్య, పయ్యావుల కిషన్, పయ్యావుల రాజేందర్ సాయి బాబా, ప్రతాప్, ఎం ప్రేమ్ కుమార్, శివకుమార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ధూల్‌పేట్‌లో..

శ్రీ రామ నవమి సందర్భంగా గౌలిపురా ఛాత్రినాకలోని చారిత్రిక శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో శ్రీ సీతారామ కల్యాణం ఆలయ ధర్మకర్తలు కొంపల్లి భరద్వాజ్, కొంపల్లి నవీన్ కుమార్, కొంపల్లి విజయా ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ఎస్.పి క్రాంతి కుమార్‌తో పాటు పెద్ద ఎత్తున భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

















అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



నవతెలంగాణ-మేడ్చల్

ఓ గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు రైల్వే కాలనీలో ఉన్న ఓ వెంచర్‌లో కుళ్ళిన మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు,క్లూస్ టీం బృందం మృతదేహాన్ని పరిశీలించి ఘటనా స్థలంలో ఉన్న ఆధారలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. మహిళ వయసు సుమారు 45 ఏండ్లకు పైబడి ఉంటుందని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ అద్దాని సత్యనారాయణ తెలిపారు.కాగా ఘటనపై కేసు నమోదు చేసుకొని మేడ్చల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నరేంద్రను స్ఫూర్తిగా తీసుకోవాలి

- **సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్**

నవతెలంగాణ-ఓయూ

ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగంలో పీజీ చదువుతున్న పి . నరేంద్ర 2023 సివిల్స్ ఫలితాల లో 545 ర్యాంకు సాధించడం పట్ల ఓయూ సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వ ర్ అభినందనలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 200 కు పైగా విద్యార్థులు సివిల్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించటం హర్షించదగ్గ విషయ మన్నారు. ప్రణాళిక బద్ధమైన ప్రిపరేషన్ కొనసాగిస్తే సివిల్స్‌లో విజయం సాధించటం అంత పెద్ద కష్టం కాదని తెలిపారు. త్వరలోనే సివిల్స్ లో విజయం సాధించిన విద్యార్థులతో స్ఫూర్తి సభను నిర్వహిస్తామన్నారు. ఈ సంవత్సరం చాలా క్రమశిక్షణతో, ప్రణాళిక బద్ధంగా సివిల్స్ క్లాసులు నిర్వహిస్తున్నామని పదిమందికి తగ్గకుండా సివిల్స్‌లో విజయం సాధిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వ విద్య శాఖ అధికారులకు, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ , రిజిస్ట్రార్లకు డాక్టర్ కొండా ధన్యవాదాలు తెలియజేశారు.

నగరంలో 5,41,201 ఓట్లు తొలిగింపు

- **స్థానికంగా లేకపోవడం, మృతి చెందిన వారి ఓట్లతోపాటు దొంగ ఓట్లగా గుర్తింపు**



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ నేతృత్వంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్‌లోని 15 అసెంబ్లీ నియోజక వర్గాల్లో మొత్తం 45,70,138 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 23,30,574 మంది పురుషులు, 22,39,240 మంది మహిళలు, 324 మంది థర్డ్ జండర్ ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 402 మందికాగా, ఎన్నారై ఓటర్లు 846, పిడబ్ల్యుడి ఓటర్లు 22,995, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 36,664 మందికాగా, 18-19 సంవత్సరాల వయస్సు గల ఓటర్లు 65,595 మంది ఉన్నారు. ఇదిలావుండగా నగరంలో దొంగ ఓట్లతోపాటు స్థానికంగా లేనివారి ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లున్నాయంటూ గతంలో ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. తదితర పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు తోపాటు వెరిఫికేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల నిబంధనల మేరకు అన్ని కోణాల్లో పరిశీంచిన జీహెచ్ఎంసీ అధికారులు నగరంలో 5,41,201ను తొలిగించారు. వారిలో 47,141 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించగా, 4,39,801 స్థానికంగా లేకపోవడంతోపాటు మరో చోట నివాసముంటున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా పలు ప్రాంతాలల్లో ఒకే ఇంట్లో పెద్దమొత్తంలో ఓట్లు ఉన్నవిషయాన్ని గుర్తించిన అధికారులు 54,259 దొంగ ఓట్లుగా గుర్తించారు. ఇలా ఓటరు లిస్టు నుంచి మొత్తం 5,41,201 ఓటర్లను తొలిగించారు.

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్





- **పాల్గొన్న హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్లు**

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై అన్ని జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీసీలో హైదరాబాద్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా ఎన్నికల అడిషనల్ అధికారి అలివేలు మంగతాయారు డీఆర్ఓ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణప్రదీప్' నుంచి నలుగురికి యూపీఎస్సీ ర్యాంకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యూపీఎస్సీ పరీక్షల్లో ప్రిలిమ్స్, మెయిన్స్‌తో పాటు, ఇంటర్వ్యూలో కూడా నెగ్గి.. ర్యాంకులు సాధించిన వారిలో నలుగురు కృష్ణప్రదీప్ ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందినవారు ఉన్నారని ఆ సంస్థ చీఫ్ మెంటార్ డాక్టర్ సీహెచ్ భవానీశంకర్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ "షాహి దర్శిని (112), ధీరజ్ రెడ్డి (173), సమీక్ష ఝా (362), నాగ సంతోష్ అనూష (818) తదితరులు మెయిన్స్, ఇంటర్వ్యూలకు పర్సనల్ మెంటార్ షిప్ కూడా తీసుకుని విజయం సాధించారు. కేపీఐఏఎస్‌గా ప్రసిద్ధి చెందిన ఈ అకాడమీ వారి ఢిల్లీ, హైదరాబాద్ బ్రాంచీల్లో కొన్ని వందల మంది విద్యార్థులు దేశవ్యాప్తంగా శిక్షణ పొందారు. అనేక మందిని ఐఏఎస్, ఐపీఎస్, ఇతర సర్వీసులకు పంపడంలో 20 ఏండ్ల ప్రస్థానం గల కృష్ణ ప్రదీప్ కతకత్యులయ్యారు. ఢిల్లీలోని కేపీఐఏఎస్ శిక్షణ కేంద్రంలో దాదాపు 500 మంది వరకు ఇంటర్వ్యూలకు శిక్షణ పొందారు. 275 మార్కులున్న ఈ ఇంటర్వ్యూకు కృష్ణ ప్రదీప్‌తో పాటు చీఫ్ మెంటార్ డాక్టర్ భవానీశంకర్ వ్యక్తిగత పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. తెలుగు సంస్థ అయిన కృష్ణప్రదీప్ ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం గర్వించదగ్గ విషయం. మొదటి ర్యాంకర్ ఆదిత్య శ్రీవాస్తవను కృష్ణ ప్రదీప్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు" అని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు పొందిన వారందరినీ అభినందిస్తున్నట్లు చెప్పారు.

చిత్రకారుడు అంబాజీకి తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం



నవతెలంగాణ-కల్చరల్

ప్రఖ్యాత చిత్రకారులు సివి అంబాజీకి తెలుగు విశ్వ విద్యాలయం విశిష్ట పురస్కారం ప్రకటించింది. తెలుగు విశ్వ విద్యాలయం 38వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు బాచుపల్లి పరిపాలన భవన్ సమావేశ మందిరంలో ఉప కులపతి డాక్టర్ తంగెడ కిషన్ రావు అధ్యక్షత న సివి అంబాజీకి ఈ పురస్కారం అందజేస్తారు ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ భట్టు రమేష్ పాల్గొంటారు. పబ్లిక్ ఆర్ట్స్, మురల్స్, స్కెచ్ వర్క్ పెయింటింగ్స్ లో దక్షిణ భారత దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందిన అంబాజీ ఈ పురస్కారం ప్రకటన పట్ల సంతో షం వ్యక్తం చేశారు. రవీంద్రభారతిలో తాను వేసిన కాళోజీ, దాశరథి చిత్రాలు, అసెంబ్లీలో నిలువెత్తు కొలువుతీరిన పివి.నరసింహారావు, ఆచార్య జయశంకర్ చిత్రాలు తాను రూపొందించినవేనని తెలిపారు. యాదాద్రి దశావతారాలు, లక్ష్మీ నరసింహుని పంచావతారాలు, తిరుపతి వెంగమాంబ అన్నదాన సత్రం, శ్రీశైలం, అహోబిలం, మహానంది, తిరుమల పంచాలయాల్లో తాను రూపొందించిన చిత్రాలు తనకెంతో తృప్తిని కలిగించాయని అంబాజీ వివరించారు.

నగరంలో చిరు జల్లులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో ఎండలు దంచికొడుతున్న సంగతి తెలిసిందే. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే బుధవారం నగరంలో వాతావరణం కాస్త చల్లగా మారింది. బుధవారం సాయంత్రం సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. దాంతో నగరవాసులకు ఉపశమనం కలిగింది. ఉప్పల్, రామంతపూర్, హైటెకొసిటీ, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL.METROPOLITAN MAGISTRATE,HAYATHNAGAR
O.S.NO.566/2022

BETWEEN:
Indian Overseas BANK, Vanasthalipuram Branch

AND

1.M/s Sri Sai Traders, Rep. by its Proprietor Ms.Guni Anjamma D/o Guni Narasaiah, Aged about 31 years, Occ: Business, R/o Plot No.120/121, Bank Colony, Munaganoor Village, Hayathnagar Mandal,Ranga Reddy District - 501 505

2. Ms.Guni Anjamma D/o Guni Narasaiah, Aged about 31 years, Occ: Business, R/o Plot No. 120/121, Bank Colony, Munaganoor Village, Hayathnagar Mandal, Ranga Reddy District - 501 505

Take Notice that the Plaintiff Bank have filed the said suit against you for recovery of Rs. 2,10,016/- with Interest at 8.15% p.a. thereon from 20-06-2022. The suit is posted to 30-04-2024 for your appearance before the Hon'ble court and if you fail to appear in person or through an advocate on 30-04-2024 at 10.30 am before the above court, you will be set ex-parte and the suit will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
Y.M.KANTAIAH
Advocate
H.No.8-1-18/49/2,
Kranthinagar, Karmanghat,
Hyderabad - 500 0079
Cell No:9441697962

IN THE COURT OF HON' BLE CHIEF JUDGE,CITY CIVIL COURT
AT: HYDERABAD
TRANSFER O.P.NO. 28 OF 2024

BETWEEN:
W3 Hospitality Services Pvt Ltd Rep. by its Director K.Nandukumar s/o K.Shankarappa,Aged: 48 yrs, Occ: Business, Director W3 Hospitality Services Private Ltd R/o: C-603, 'C' Block, B.No.8-1-299/A/75,Aditya Hill Top, Road No.82,Shaikpet, Hyderabad.
...Petitioner

A N D

D. Venkatesh & 3 others
.....Respondents

To,
A. Ram Reddy, S/o. Late A. Malla Reddy,Age : 54 yrs, Occ: Business H.No.2-3-35, Pent House,Sri sai Residency, Filmnagar,Phase -II, Jubilee Hills, Hyderabad.
.....Respondent No.4

NOTICE

Please take notice that the Petitioner has filed Transfer Petition against you seeking transfer of OS 283 of 2020 between D. Venkatesh Vs W3 Hospitality Services Pvt Ltd to be tried and disposed along with OS 930 of 2018 on the file of IX Addl. Chief Judge, City Civil Court, Hyderabad. The Hon'ble court was pleased to order for issuance of notice to the Respondent No.4 by way of paper publication and the above case is posted to 24-04-2024 at 10.30 AM for your appearance either in person or through your Counsel failing which the matter will be adjudicated following due process of law.

(By Order of the Court)
Venugopal Julakanti
Advocate
Off: Flat No.203-A, Mayfair Gardens, Apartment, Rd.No.12, Banjara Hills
Hyderabad- 500034
Mobile: 9848933574

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE CU, III MM ,RANGA REDDY DISTRICT
AT: L. B. NAGAR
O.S.No. 519 OF 2020

Between :
Pusthe Ravikanth S/o Late Pusthe Babu Rao Aged about 47 years, Occ; Business R/o 20-1-32, Purana Pool, Hyderabad-500269
...Plaintiff

AND

1)Mrs. Rabia Sultana W/o Mohd. Sadiq Hussian Aged about 58 years,. Occ : Nil R/o. 11-3-668 (B-211) Mallepally, Hyderabad
2) Smt. B.Rajitha W/o B.Davender Reddy Aged about 47 Occ: House wife R/o 8-2-109/5, Pindi Narayan Reddy Colony,Sagar Road, Karmanghat, Hyderabad.
...Defendants

Please take notice that the above Plaintiff has filed the above case on the file THE III ADDL. JUNIOR CIVIL JUDGE CU, III MM , RANGA REDDY DISTRICT AT L. B. NAGAR against the Defendants. The above case is posted for the Appearance of the Defendant No. 1 and 2 on 02-05-2024 at 10:30 AM, for your appearance before the Hon'ble Court in person or through your counsel, failing which the case will be proceed further and it will be decided on merits in your absence.

Sd/-
By the Order of the Court
P.Amarender Reddy,
A.Chakravarthy
(Advocates)
R/o 17-1-388/P/91, Laxmi Nagar Colony,Saidabad,
Hyderabad-500059
Cell : 9246501212

PUBLIC NOTICE

The general public are hereby informed that **Sri Nali Guravaiah S/o N.Guravaiah** has approached M/s Shriram Finance Ltd, Chikadpally Branch Hyderabad for depositing his title deeds under Sale Deed vide Doc. No 2365 of 2021 Dt; 30-01-2021 by way of equitable mortgage in respect of schedule property for securing his future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned to Sri Nali Guravaiah S/o N.Guravaiah and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that part and parcel of Plot No. 14 admeasuring 200 Sq.yds equivale nt to 167.2 Sq.mtrs Situated at Rampally (Village), Kessara (Mandal), M edchal-Malakjgiri District and bounded by :-
North : Plot No-20
South : 25'Wide Road
East Plot No-15
West Plot No-13

For Nomos Vistas, The Lawyers,
Govardhan Venu, Advocate
Shiva Shakti, H.No. 8-2-684/3, Plot no 80 Banjara Green Colony, Ministers Colony, Road No. 12, Banjara Hills, Hyderabad Telangana 500034.
Mob:-9849091266

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR
AT: RED HILLS, HYDERABAD
File No.Dispute/ ARB/ CF.No.HD282/2023

Between: -
M/s.Neeladri Chit Fund Private Limited., #1-2-597/2, Baraf Bagh Colony, Domalguda, Hyd-29.Represented by its Legal Asst Manager .....Disputant

AND

01. Smt.Sai Devi Rani Vemula, W/o Sri.V.Rajendra Kumar aged about 44 yrs, Occ:-House Wife (Rental Income) R/o.#202, Apurupa Apts., Opp:NtureCure Hospital,Ameerpet, Hyderabad -500016. And also R/o. Flat No.506, Jamunathirth Apts., DK Road, Ameerpet, Begumpt. Hyd-16

02. Bharath Kumar Pochannagari, S/o.P.Ramesh, aged about 27 yrs, Occ:-Govt. EMP, O/o.The Commissioner of Police (Hyderabad City Police), Basheerbagh, Hyderabad -500029. Rang:PC(AR), Training Center:10th Batch Beechpally. EMP:4502898, Desg:Police Constables/Reserve PC.R/o.H.No.1-38-1854/1, Block No.6, GF.No.259, Rasool Krishna Nagar, Secunderabad-03.

03.MVV.Sathish Gouda, S/o.Marisetty Satyanarayana, aged about 41yrs Occ:Pvt Emp,O/o.Armstrong World Industries(India) Pvt. Ltd., # 138, Brick Kiln Road, TNHB Colony, Purasaiwakkam,Chennai, Tamil Nadu-600012. EMP ID: #732 762, Desg: Area Sales Manager, R/o.H. No.202, Apurupa Apts, Opp:Nature Cure Hospital, Ameerpet, Hyd-600012. And also R/o.5 104/105, 4th Cross Street, Kalai magal Nagar, Ekathuthangal, Guin dy Industrial Estate, Chennai-Tamil nadu-600032. And also R/o.LIG-29 -1, F.No.302, 3rd Floor, Star Rasna Arlad, Uday Nagar, SR Nagar, Hyd-38

04. Smt.Archana Vegi,W/o.V.Subba Rao, aged about 39yrs,Occ:House Wife (Rental Income) R/o.F.No.302 & 301, Sudharma Resi dency, Near Andhra Bank, SR Nagar, Hyd-38.

05.V.Sai Shravan Akash, S/o. V.Rajendra Kumar, aged about 27 yrs, Occ: PVT Emp.Emp Code: 1987, Grade: 5, Desg:Software Engineer, Division: Mail Marketing.O/o. Netcore Cloud Pvt Ltd., Queens Plaza, Sardar Patel Road, Begumpet, Hyd-50003. R/o.F. No.506. Jamunatirth Apts.,DK Road, Ameerpet, Begumpet, Hyd-16

06. Rajender Kumar Vemula, S/o. Sri V.Kumara Swamy, aged about 56yrs Occ:Business (Sleeping Partner)R/o.F.No.506, Jamunatirth Apts., DK Road, Ameerpet, Begumpet, Hyd-16 ...Opponents

Please take notice that the above dispute is filed against you for Recovery of **Rs.8,02,484/-** and the same is posted **on 26-04-2024** for your appearance before the office of Deputy Registrar of Chits/ Arbitrator, District Registrar Office, H.No:11-5-338, Near Niloufer Hospital, Red Hills, Hyderabad **at 11.00 A.M.** if you fail to attend the office of Deputy Registrar of Chits/ Arbitrator on that day the matter will be heard and decided ex-parte.

(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR)
B. JANAKIRAMULU @ JK
Advocate
Counsel for Disputant

శోభాయాత్రలో పాల్గొనడం ఆనందంగా ఉంది

- **ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ చైతన్య ఆనంద మహారాజ్**



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

శ్రీరామనవమి శోభాయాత్ర బుధవారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. శోభాయాత్రకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉత్తర భారతదేశానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ చై తన్య ఆనంద మహారాజ్ పురానాపూల్, బేగంబజార్ ఛత్రీల వద్ద భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.అయోధ్యలో రామాలయాన్ని నిర్మించడం సంతోషదాయకమన్నారు.రామాలయం ప్రారంభించడంతో ప్రజల్లో శ్రీరాముడిపై భక్తి మరింత పెరిగిందన్నారు. భక్తులు చేస్తున్న జై శ్రీరామ్ నినాదాలు వింటుంటే శ్రవణానం దంగా ఉందంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల్లోనే పరమ శివుడు కనిపిస్తాడని, తల్లిదండ్రులను స్వయంగా పూజిస్తే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో శోభాయాత్రలో పాల్గొనడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో.. అక్కడ దేవతలు నడయాడుతారని, ధర్మల రాజ్యం ఏ లుతుందన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయ రెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్, ఆలయాలకు వచ్చి ఆశీర్వాదాలు తీసుకొని అన్నదానాల్లో భాగస్వాములు అయ్యారు. సాయిబాబా జన్మదిన వేడుకలు సైతం పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించి అన్నదానాలు చేశారు. రామనవమి సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆలయాల్లో భక్తులు కిటకిటలాడాయి. అయితే పలు చోట్ల మంచినీటి భోజనాల వ్యవస్థ వద్ద ఇబ్బందుల పాలయ్యారు. సరైన సదుపాయాలు కల్పించడంలో ఆలయ ధర్మకర్తలు నిర్వాహకులు విఫలమయ్యారు. భోజనాల వద్ద భారీ క్యూ లైన్ లో దర్శనాల వద్ద క్యూలైన్లో ఉండడంతో ఎండలోనే భక్తులు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి నెలకొంది.

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రశాంతంగా శ్రీ రాముని శోభాయాత్ర..







PUBLIC NOTICE

The general public are hereby informed that **Sri Panuganti Venkatesh S/o Sri Panuganti Pochaiah** has approached M/s Shriram Finance Ltd, Chikadpally Branch Hyderabad for depositing his title deeds under Sale Deed vide Doc. No 2169 of 2024 Dt; 19-02-2024 by way of equitable mortgage in respect of schedule property for securing his future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned to Sri Panuganti Venkatesh S/o Sri Panuganti Pochaiah and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that part and parcel of House bearing No. 2-93 (Assessment No. 321024400241) admeasuring 106 Sq.yds equivalent to 88.61 Sq.mtrs with plinth area of 300 Sq.ft Situated at Railapur (Village & Mandal), Medchal -Malakjgiri District and bounded by :-
North :House of Jalli Chinna Narsimha :
South: House of Jalli Hari Krishna
East : Road
West :Road

For Nomos Vistas, The Lawyers,
Govardhan Venu, Advocate
Shiva Shakti, H.No. 8-2-684/3, Plot no 80 Banjara Green Colony, Ministers Colony, Road No. 12, Banjara Hills, Hyderabad Telangana 500034.
Mob:-9849091266

PUBLIC NOTICE

The general public are hereby informed that **Sri Nalla Rama Gopal S/o Nalla Mallaiah** has approached M/s Shriram Finance Ltd, Chikadpally Branch Hyderabad for depositing his title deeds under Gift Settlement Deed vide Doc. No 21943 of 2023 Dt; 14-08-2023 by way of equitable mortgage in respect of schedule property for securing his future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned to Smt Nalla Rama gopal S/o Nalla Mallaiah and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that part and parcel of House bearing No. 42-221 (PTIN No. 115180 1627) admeasuring 78 Sq.yds equivalent to 65.21 Sq.mtrs in SY No. 34 7 Situated at Anjaiahnagar, Quthbullapur (Village & Mandal), Medchal-M alakjgiri District and bounded by :-
North : H-No:- 42-221/A
South: H-No:-42-222 :
East: H-No:-42-221/1
West: 15'ft Wide Road

For Nomos Vistas, The Lawyers,
Govardhan Venu, Advocate
Shiva Shakti, H.No. 8-2-684/3, Plot no 80 Banjara Green Colony, Ministers Colony, Road No. 12, Banjara Hills, Hyderabad Telangana 500034.
Mob:-9849091266

ప్రచురణ నిమిత్తము

మహారాజశ్రీ కరీంనగర్ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A.No.152 OF 2024 IN O.S.No.2 OF 2019

Between :
శ్రీ ఆలపాటి కోటేశ్వర రావు
...పిటీషనరు/దావాదారు

Vs.

శ్రీ ఆలపాటి కోటేశ్వర రావు @ శ్రీ ఆలపాటి కోటేశ్వర్ రావు మరియు ఆరుగురు ఇతరులు
...రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To
మొదటి రెస్పాండెంటు
శ్రీ ఆలపాటి కోటేశ్వర రావు @ శ్రీ ఆలపాటి కోటేశ్వర్ రావు S/o. లేటు వెంకట సుబ్బయ్య, హిందూ, సుమారు 55సంవత్సరములు వయస్సు R/o. H.No. 31-3-121, గాంధీ బొమ్మ ఏరియా, ఉప్పల్ మరియు ఉప్పల్ మండలము, మేడ్చల్ జిల్లా, తెలంగాణా.

పై నెంబరు 2 OF 2019 గల దావాను శ్రీయుత కోర్టు వారి రికార్డులలో పునరుద్ధరించమని కోరుతూ పిటీషనరు/దావాదారు I.A.No. 152 OF 2024 ను దాఖలు చేసినారు. సదరు I.A. లో మొదటి రెస్పాండెంటు/మొదటి ప్రతివాది అయిన మీకు సదరు పిటిషనులో నోటీసు నిమిత్తము శ్రీయుత **కోర్టు వారి ఉత్తర్వుల మేరకు** ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ చేయునది యేమనగా సదరు I.A.No. 152 OF 2024 పిటిషను విచారణ నిమిత్తముగా ది.07-06-2024 కు వాయిదా అయియున్నది. కావున మీరు సదరు I.A పిటిషను వాయిదా రోజునకు అనగా **ది.07-06-2024న ఉదయము గం॥10:30ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, మీ తరఫున లాయరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క వాదనకు అనుగుణముగా సమాధానము మరి ఏదేని ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షంలో సదరు పిటిషను I.A.No. 152 OF 2024 తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

వాయిదా తేదీ : 07-06-2024

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఇట్లు
సం/-
అనాసవరపు శశికాంత ఫణి
పిటీషనరు/దావాదారు తరఫున న్యాయవాది
#26-30-7/6, Near Poleramma Temple,
4th Lane, A.T. Agraharam,
GUNTUR-522004, A.P.
Cell : 9493921593

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

హెరిటేజ్ వాక్‌ను విజయవంతం చేయండి

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ హెరిటేజ్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న(నేడు) జరుగు హెరిటేజ్ వాక్‌ను విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒక ప్రకటనలో కోరారు. 18న ఉదయం 7 గంటలకు దారుల్ షిఫా నుంచి వాక్ ప్రారంభమై సాలర్ జంగ్ మ్యూజియం మీదుగా ఉస్మా నియా ఆస్పత్రి వద్ద ముగిస్తుందని తెలిపారు. అక్కడ తాగు నీరు షామియానా అన్ని ఏర్పాట్లు చేయాలని ఖైరతాబాద్, చార్మినార్ జోనల్ కమిషనర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ హెరిటేజ్ వాక్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసక్తి గల వారందరూ పాల్గొని హెరిటేజ్ వాక్‌ను విజయ వంతం చేయాలని కమిషనర్ కోరారు.

యూపీఎస్సీ ఫలితాల్లో ఓయూ విద్యార్థుల హవా..

నవతెలంగాణ-ఓయూ





సివిల్ సర్వీస్ ఫలితాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం సత్తా చాటారు. యూనివర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. దీనితో వారిని పలువురు ప్రొఫెసర్స్ ,ఉద్యోగులు ,విద్యార్థులు అభినందించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల లో పొలిటికల్ సైన్స్ విభాగం లో పీజీ చదువుతున్న నరేంద్ర పడల 545 ర్యాంక్ సాధించారు. ఇక ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీఈ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి మెరుగు కౌశిక్ ఆల్ ఇండియా స్థాయి లో 82వ స్థానం సాధించారు. వీరిని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో.అర్జున్ రావు కుతాడి, విభాగం హెడ్ డా.ఆర్.చంద్రు నాయక్, డైరెక్టర్ డా.చెలమల్ల వెంకటేశ్వర్లు , ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో.పైడిమర్రి. చంద్రశేఖర్ ,సివిల్ ఇంజినీరింగ్ హెడ్ ప్రో. రాజశేఖర్ లు అభినందించారు. వీరికి త్వరలోనే ఇటు కళాశాలల, విభాగాల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కరం చేయనున్నారు.



ధర్మ మార్గంలో ముందుకెళ్దాం

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

శ్రీరాముడి జీవితం నుంచి నేర్చుకోవాల్సిన విలువైన పాఠాలను నేర్చుకుంటూ. సమాజంలో ధర్మ మార్గంలో ముందుకెళ్దామని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, తెలంగాణ కార్మిక విభాగం అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్ రెడ్డి అన్నారు. తార్నాక డివిజన్ లోని హనుమాన్ నగర్, లాలాపేట్, కీంతీ కాలనీ, శ్రీపురి, ఆయా కాలనీల్లో వైభవంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలకు వారు హాజరై అపురూప దృశ్యాలని తిలకించి, ప్రజలంతా పాడిపంటలతో, అష్టఐశ్వర్యాలతో, సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ ప్రత్యేకమైన శ్రీరామనవమి రోజున ఆ శ్రీరాముని అనుగ్రహంతో మీ జీవితంలో కొత్త వెలుగు నిండాలని, అన్నింటి పరంగా వస్తున్న సమస్యలు తొలగిపోవాలని కోరుకున్నట్టు తెలిపారు. పుణ్య దంపతులైన సీతారాముల శుభాశీస్సులతో మనందరి మనసులు ఎప్పుడూ ప్రేమ, కరుణ లతో నిండి, మంచి నడవడికలతో సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ ఆదర్శ ప్రాయంగా నిలవాలన్నారు. ప్రజలందరికి శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.

గురుకుల విద్యార్థి మరణం ప్రభుత్వం చేసిన హత్యే..

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు

నవతెలంగాణ-ఓయూ



భువనగిరి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ జరిగి దళిత విద్యార్థి ప్రశాంత్ మరణించడం నిజంగా యావత్తు తెలంగాణ సిగ్గుపడాల్సిన విషయ మని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక గురు కుల పాఠశాల విద్యార్థులు వారానికి ఒక్కొక్కరుగా మరణిస్తున్నారని తెలిపారు. ఒకవైపు ఆత్మహత్యలు,ఫుడ్ పాయిజనింగ్ ,పాముకాట్లు అంటూ కారణాలు చెబుతున్నా ఇవి ప్రభుత్వ అసమర్థ ,నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. ప్రభు త్వం ఎంతసేపు ఓట్లు,సీట్లు,తిట్లు పొత్తులు, ఎత్తులు, కేసులు, సూటుకేసులు ,పార్టీ ఫిరాయింపుల గురించి ధ్యాస తప్ప విద్యార్థులు గురించి ఆలోచనే లేదని మండిపడ్డారు. ఇంతవరకు తెలంగాణలో విద్యా శాఖ మంత్రిని కానీ సంక్షేమ శాఖ మంత్రిని కూడా నియమించకపోవడం నిజం కాదా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం వెయ్యికి పైగా గురుకులాలు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థులపై కక్ష గట్టినట్లు ప్రవర్తిస్తున్నదన్నారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి,మొరటు రాజకీయాలు పక్కన పెట్టి చనిపోయిన విద్యార్థుల కుటుంబానికి తక్షణమే రూ. 25లక్షలు ఇచ్చి ఆదుకోవాలని, అలాగే ఇటువంటి ఘటనలు ఎక్కడా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు.



మాదిగలకు సీట్లు కేటాయించకపోవడం బాధాకరం

- మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఎంపీ టికెట్ కేటాయించకపోవడం అత్యంత బాధాకరమని.. ఇది తన రాజకీయ జీవితంలో తాను చూసిన విచిత్రమైన సంఘటన అని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతిని ఓయు ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్లో రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ సభాధ్యక్షతన నిర్వహించారు. మాదిగల వాటా కోసం మాట - సామాజిక తెలంగాణ సాధన కోసం అనే అంశం మీద నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ప్రొఫెసర్ కాసిం, రామిల్ల రాధిక, సురేందర్ మాదిగ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ మాదిగలు అత్యంత శక్తివంతంగా ఉన్న రాష్ట్రంలో వారికి ఎంపీ టికెట్ కేటాయించకపోవడంతో రాజకీయ భవిష్యత్తుకు ప్రశ్నార్థకంగా అంతరించిపోయే విధంగా ఉందన్నారు. కనుక మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తాము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాము కానీ మాదిగల నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రజల్లో తిరగలేక పోతున్నామని ఇప్పటికైనా సమయం ఉంది గనుక పార్టీ నాయకత్వం పునరాలోచించి తగిన ప్రాతినిధ్యం కల్పించే విధంగా మాదిగ జనాభాకు అనుగుణంగా సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం దండోరా ఉద్యమంతో మొదలై మాదిగ ఉద్యమం మిగతా అణగారిన వర్గాలకు తోడుగా నిలిచి ప్రస్తుతం తన భవిష్యత్తును ప్రశ్నార్థకంగా చేస్తుందని, పాలకులకు మాదిగ సమాజం అంటే భయం పట్టుకుందన్నారు. మాదిగ రక్తంలోనే ఎదిరించే గుణం పాలకులను ఎదిరిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలిచే గుణం ఉందన్నారు. అట్టి మాదిగలను ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని తద్వారా సామాజిక న్యాయం కొరవడుతుందని పేర్కొన్నారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ తన రాజకీయ జీవితం దండోరా ఉద్యమంతో మొదలై రెండుసార్లు రికార్డు స్థాయిలో ఎంపీగా గెలవడానికి మాదిగ ఓటు బ్యాంకు వరంగల్ కేంద్రంగా అత్యధికంగా ఉండటమే కారణంగా చెప్పారు రమిళ్ళ రాధిక మాట్లాడుతూ. ధన ప్రవాహంతో కూడుకున్న రాజకీయాలకు పెద్దపీట వేస్తూ ఉద్యమకారులకు ప్రజల కోసం గ్రౌండ్ లెవెల్‌లో పనిచేసే తమ లాంటి నాయకులకు ముఖ్యంగా మాదిగ ఆడబిడ్డనైన తనకు అనేక పోరాటాల ద్వారా సమాజం గుర్తించినప్పటికీ ధన ప్రవాహం ముందు తన పోరాటానికి విలువ లేకుండా పోయింది కాబట్టి తగ్గిన ప్రాధాన్యత ఇస్తూ,ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్ మాదిగ, బి నాగేశ్వరరావు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల విద్యార్థి నాయకులు లింగంపల్లి మనోజ్, సోమశేఖర్ మాదిగ , పాల్వాయి నగేష్, కంచర్ల బద్రి, కొమ్ము శేఖర్ చాగంటి రాజేష్ సుమంత్ ఉదయ్, బోనాల నగేష్ ,బొర్రా శాంతి కుమార్ దర్శనం జాన్, అందే కృష్ణ నవీన్ రాజ్, జోగు నరేందర్,అంజి,మంద రాజు మరియు స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నోస్మానియాకు సన్నాహకంగా 3కే రన్





- అబ్బురపరిచిన బైక్ స్టంట్స్
- నృత్యాలతో విద్యార్థుల ఫ్లాష్ మాబ్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ లో గురువారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియ-2024 సందర్భంగా బుధవారం ఓయూ ఎన్‌సిసి గేట్ నుంచి టెక్నాలజీ కాలేజ్ వరకు "ప్రతి నీటి చుక్కను పొదుపు గా వినియోగించుకుందాం" ..అనే నినాదం తో 3కే రన్‌ను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుతులతో పాటు సర్టిఫికేట్లను కళాశాల ప్రిన్సిపాల్ ప్రో. చింత సాయిలు, కన్వీనర్ ప్రో. ఎస్.శ్రీను నాయక్ అందజేశారు.విద్యార్థులు ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎలా ఉందో వివరించారు. నీటిని వధా చేయకుండా అవసరం అయిన మేరకే వినియోగించు కోవాలన్నారు..

అబ్బుర పరిచిన బైక్ స్టంట్స్

టెక్నాలజీ కళాశాల ఆవరణలో ప్రొఫెషనల్ బైక్ స్టంటర్స్‌తో బైక్ స్టంట్స్ నిర్వహించారు. ఈ బైక్ స్టంట్స్ ఆద్యంతం అలరించాయి. విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఓయూ రేణుక ఎల్లమ్మ టెంపుల్ వద్ద "ఫ్లాష్ మాబ్ " నిర్వహించారు. ఫ్లాష్ మాబ్ లో విద్యార్థిని విద్యార్థుల నృత్యాలు ప్రేక్షకులను, బాటసారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక రంగోలి,పెయింటింగ్, మెహందీ పోటీలు నిర్వహించారు. వీటిలో విద్యార్థినిలు పోటా పోటీగా పాల్గొని తమ సజనాత్మక ఆలోచనలు ప్రాణం పోశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ ప్రో. చింత సాయిలు, కన్వీనర్ ప్రో. ఎస్.శ్రీను నాయక్,వైస్ ప్రిన్సిపాల్ ప్రో. వి.రమేష్ కుమార్,ప్రో. వి.వి. బసవరావు,ప్రో. బి. రాజం ,ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్స్ డా. ఎ. పరశురాములు,డా. బి. పరమేశ్వర్లు, డా. సాదం ఐలయ్య డా. వి. భాస్కర్, డా. కె. శ్రీనివా సులు, డా.టి.వెంకటేశ్వర్లు, డా.సునిత పల్లేటి , డా.బి.నారాయణ, డా.ధీరజ్, డా.అర్జున్, డా.టి.అజిత్, డా.అభిలాష్, డా.ఎ.విజయ్ కాంత్, డా.రవీందర్, గోపి,స్టూడెంట్ కో ఆర్డినేటర్ లు శ్యామ్ సుందర్, మాధవి, ఆకాష్, పి.అఖిల, ముకేష్, జె. సాహిత్య,ఎం.సూరి దుర్గ, ఎం. అరవింద్, కళాశాల అధ్యాపకులు ,విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధం

- నేటి నుంచి నామినేషన్ల దాఖలు
- రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఎస్సీ రిజర్వ్‌డ్ ఉప ఎన్నిక నామినేషన్లు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. బుధవారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవాలన్నారు.



బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళ్ రావు నగర్ డివిజన్, జవహర్ నగర్ లో బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్‌కు మద్దతుగా మంగళవారం రాత్రి ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతమంది వ్యతిరేకంగా ప్రచారం చేసి ఓడించాలని ప్రయత్నించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో తనకు అండగా ఉండి అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ఓటర్లకు కతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పార్లమెంటు ఎన్నికల్లో పద్మారావు గౌడ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతీ వీధిలో ఇంటింటికి వెళ్లి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఓటు వేయవలసిందిగా ప్రార్థించారు. కార్పొరేటర్ దేదీప్య రావు, యూసూఫ్ గూడా కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

సన్మాన కార్యక్రమంలో కనపడని నవీన్ యాదవ్

- ఫ్లెక్సీలలో కూడా కనపడని నవీన్ యాదవ్, శ్రీశైలం యాదవ్ ఫోటోలు
- జూబ్లీహిల్స్‌లో మూడు వర్గాలుగా విడిపోయిన కాంగ్రెస్..?



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మంగళవారం రాత్రి యూసఫ్ గూడా చెక్ పోస్ట్ లోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో రాజ్యసభ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన అనిల్ కుమార్ యాదవ్ కు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని అన్ని డివిజన్ల కాంగ్రెస్ నాయకులు కలిసి భారీ గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం పూర్తిగా ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ కూడా హాజరయ్యారు. అలాగే బోరబండ కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, రహమత్ నగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ భవాని శంకర్ పాల్గొన్నారు. ఈ సన్మానం కార్యక్రమం నవీన్ యాదవ్ ఇంటికి అతి సమీపంలో జరిగింది. అయితే సన్మాన కార్యక్రమంలో నవీన్ యాదవ్, ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్, నవీన్ యాదవ్ అనుచరులు ఎవరూ కనబడకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కనీసం ఫ్లెక్సీలలో కూడా నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్ ఫోటోలు వేయకపోవడం గమనార్హం.

2018లో జూబ్లీహిల్స్ ఇండిపెండెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన నవీన్ యాదవ్ 2023 ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల ముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు ఉన్నందున, నాయకులు సొంతగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవీన్ యాదవ్ ఎంతో ఖర్చు పెట్టి కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌ను గెలిపించాలని విశ్వప్రయత్నం చేశాడు. అయినప్పటికీ అజారుద్దీన్ ఓడిపోయాడు. అందుకు ప్రధాన కారణం పార్టీలు మారి కాంగ్రెస్‌లో చేరిన నాయకులను ఓటర్లు వ్యతిరేకించారని పలువురు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల అనంతరం కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. అన్ని డివిజన్లలో 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఒక వర్గంగా, పార్టీలు మారి వచ్చిన వారు మరొక వర్గంగా ఇలా మూడు వర్గాలుగా విడిపోయినట్టు తెలిసింది. మంగళవారం జరిగిన అనిల్ కుమార్ సన్మాన సభ గురించి అనిల్ కుమార్ యాదవ్‌కు ఆయన కుటుంబ సభ్యులకు తెలియపరచలేదని సమాచారం. అనిల్ యాదవ్ ,నవీన్ యాదవ్ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనప్పటికీ ఎందుకు పిలవలేదు అనే ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. నవీన్ యాదవ్ అండదండలు లేకుండా దానం నాగేందర్ ఎలా గెలుస్తాడని, ఎమ్మెల్యే ఎన్నికలప్పుడు జరిగిన నష్టమే పార్లమెంట్ ఎన్నికలలో కూడా జరుగుతుందని, కాంగ్రెస్ నాయకుల విభేదాలు ఇతర పార్టీ నాయకులకు మేలు చేస్తాయని పలువురు కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. అధిష్టానం వెంటనే చర్యలు తీసుకొని నాయకులను అందర్నీ కలుపుకొని పోవాలని, లేకుంటే భారీ నష్టం జరుగుతుందని కాంగ్రెస్ అభిమానులు, నాయకులు కోరుతున్నారు.

కార్మికుడి మృతికి సీఐటీయూ జోన్ కార్యదర్శి నివాళి



- బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఓయూ

లాలపేట్ లోని భవన నిర్మాణ కార్మికుడు, బీసీడబ్ల్యూ(సీఐటీయూ) లాలపేట్ అడ్డా నాయకులు గోపాల్ గుండెపోటు తో మరణించిన విషయం తెలిసిందే. గోపాల్ మృతదేహానికి బుధవారం సీఐటీయూ జ సికింద్రబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్ నేతృత్వంలో యూనియన్ నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులందరి దగ్గర నుంచి దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ. 16500 వసూలు చేసి గోపాల్ భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లడుతూ గోపాల్ మేస్త్రి లాలపేట్ లేబర్ అడ్డమీద కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడన్నారు. పనిచేసుకుంటూ అడ్డమీది కూలీల కోసం యూనియన్‌లో కీలకంగా పనిచేసేవారని అన్నారు. ఏ కార్యక్రమం చేసినా చురుకుగా ఉండేవారని గుర్తు చేశారు. గోపాల్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు చాలిచాలని రోజువారీ కూలితో జీవితం గడుపుతున్నారని,ఏదైనా ఇబ్బంది వస్తే ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందని, దానికోసం లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవాలని అన్నారు. దాని వలన ప్రభుత్వం నుంచి ఆర్థికంగా కుటుంబాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీడబ్ల్యూ(సీఐటీయూ) యూనియన్ నాయకులు నర్సింహ,రహంతుల్లా,భాస్కర్,ఉపేందర్,ఏళ్లగౌడ్,రాజుగౌడ్ ,విజయ్,కాసిం బాలు,మల్లేష్,ప్రసాద్,పార్వతి,వినోద, సుగ్గుణ,విజయ పాల్గొన్నారు.

డివైడర్లకు ట్రాఫిక్ కానిస్టేబుళ్ల మరమ్మతులు



తిరుమలగిరి ఆర్టీవో ఆఫీస్ వద్ద డివైడర్ సరిగ్గా లేకపోవడంతో వాహనాదారులు ఇష్టానుసారంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. దాంతో వీటిని అరికట్టేందుకు తిరుమలగిరి ట్రాఫిక్ కానిస్టేబుళ్లు నడుం బిగించారు. బుధవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధు బాబు ఆధ్వర్యంలో సురేష్ గౌడ్, సూరజ్, మహేష్ కానిస్టేబుల్‌లు డివైడర్లకు మరమ్మతు చేశారు. తాత్కాలికంగా చేసిన సేవలు వల్ల ప్రమాదాలను కొంత వరకు ఆపే అవకాశాలు ఉన్నాయని కానిస్టేబుల్ చెప్పారు

నవతెలంగాణ-కంటోన్మెంట్

కన్నుల పండువగా సీతారాముల కళ్యాణ మహోత్సవాలు



నవతెలంగాణ-బేగంపేట

శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సం బుధవారం పలు ప్రాంతాల్లో అత్యంత ఘనంగా కన్నుల పండువగా జరిగింది. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరైనారు. సనత్ నగర్ లోని హనుమాన్ దేవాలయంలో పట్టువస్త్రాలను ఆయన సమర్పించారు. అదేవిధంగా పీజీ రోడ్డులోని కృష్ణా నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలోనూ ఆయన పాల్గొని మాంగల్య ధారణను తిలకించారు. పలు ప్రాంతాల్లో ఆలయాల నిర్వహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

పద్మారావు నగర్ లోని ముషీరాబాద్ చౌరస్తాలో గల శ్రీ రామాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, శ్రీ పోల్ బాల్ హనుమాన్ దేవాలయాలలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవ పూజలలో తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. కార్పొరేటర్ కుర్మ హేమలత లక్ష్మీపతి, నాయకులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్, వెంకటేషన్ రాజు, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ చైర్మెన్‌లు సంతోష్ ముదిరాజ్, రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్ పేట డివిజన్‌లోని అరుణ్ జ్యోతి కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం, జీవైఆర్ కాంపౌండ్ లోని జై బాజ్ రంగ్ ఆలయాలలో పూజలలో తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఆలయ చైర్మెన్ సుధీర్, కార్పొరేటర్ కుర్మ హేమలత లక్ష్మీపతి, వెంకట్ బాబు, ప్రేమ్ కుమార్, కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

రాంగోపాల్ పేట డివిజన్ లోని జీరాలోని శ్రీ రామ భజన భవన్ లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం, కుర్మ బస్తీ, విశ్వకర్మ సంఘం భవనం లో, పీజీ రోడ్డులోని కష్టా నగర్‌లో, గైదన్ బాగ్ లోని శ్రీ వీరాంజనేయ ఆలయాల్లో వేడుకల్లో తలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు. బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, నిర్వహకులు నాగిళ్ళ శ్రీనివాస్, శివ కుమార్, ప్రవీణ్, నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, ఆకుల హరికష్ణ, కిషోర్ కుమార్, మహేష్ యాదవ్, మహేందర్, సంజయ్ తదితరులు ఉన్నారు.

బేగంపేటలోని కేసరి హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో తలసాని పాల్గొన్నారు. పూజలలో ఆలయ చైర్మెన్ నరేందర్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, పియూష్ గుప్తా, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సనత్ నగర్ లోని సి టైప్ క్వార్టర్స్ లోని పార్క్ లో, రవీందర్ నగర్ కమ్యూనిటీ హాల్ లో, ఉదయ్ నగర్ కమ్యూనిటీ హాల్, సుందర్ నగర్ అసోసియేషన్ లో, జెక్ కాలనీ, రాజ రాజేశ్వరి నగర్ లలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, నాయకులు కొలన్ బాల్ రెడ్డి, సురేష్ గౌడ్, సంజయ్, పి.శేఖర్, సతీష్, కర్ణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, విజయ్ సింగ్ తదితరులు ఉన్నారు.

ఓయూ : బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ బుధవారం వివిధ ప్రాంతాల్లో సీతారామ కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ నవమి శుభాకంక్షలు తెలిపారు. శ్రీ రాముని జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మనుషులు సన్మార్గంలో జీవించాల్సిన తీరుతెన్నులను శ్రీ





రాముడు చాటిచెప్పారని అన్నారు. శ్రీరాముడి ఆశీసులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. అడ్డగుట్ట, ఆజాద్ చంద్ర శేఖర్ నగర్, సితాఫలమండీ తదితర ప్రాంతాల్లో ఆయా నిర్వాహకులు ఏర్పాటు చేసిన సీతా రామ కళ్యాణం ఉత్సవాల్లో పద్మారావు గౌడ్ పాల్గొన్నారు. కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, యువ నేత రామేశ్వర్ గౌడ్, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ వల్లరపు శ్రీనివాస్ ఆయన సతీమణి వల్లరపు పద్మావతితో కలసి మెట్టుగూడ బలాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజలకు శ్రీరాముని ఆశీర్వాదం ఉండాలని రాష్ట్రంలో వర్షాలు సంవృద్ధిగా పడి రైతులు కార్మికులు కర్షకులు చల్లగా ఉండాలని ఆయన ప్రార్థించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



బేగంపేట/కంటోన్మెంట్ : కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మోండా డివిజన్‌లో పలు ఆలయాల్లో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలలో బీజేపీ మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్, బీజేపీ కంటోన్మెంట్ అభ్యర్థి వంశీ తిలక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికా నరేష్ అభ్యర్థులతో ప్రత్యేక పూజలు చేయించి ప్రసాదం అందించారు.

జూబ్లీహిల్స్ :ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీ శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరాములువారి కల్యాణానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ లక్ష్మి, ఎం.ఎస్ రత్నం, జి.నీలిమ, సూర్యకలా, శివ కుమారి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



బేగంపేట :సికింద్రాబాద్ 31 బస్ స్టాప్ సమీపంలో సికింద్రాబాద్ బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కొంతం దీపిక హాజరయ్యారు. బెస్ట్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు ఉత్తమ్ దేవర్సి గడ్డమీది శ్రీశైలం ముదిరాజ్, నవీన్ కుమార్, బట్టు శ్రీనివాస్, కష్ణ ,నరేష్, శ్యామ్, దూలప్ప, పాల్గొన్నారు





టిప్స్

పచ్చిమిర్చిలో కాసింత పసుపు చేర్చి డబ్బాలో కానీ సీసాలో కానీ నిలవ ఉంచితే ఎరుపురంగులోకి మారకుండా ఉంటాయి.

నోరూరించే...

వేసవి వచ్చిందంటే చాలు.. అందరి చూపు మామిడివైపే. మామిడికాయలు తినకుండా వేసవి సీజన్ ముగియదు. పచ్చిమామిడితో చేసే అనేక రకాల వంటకాలు ఆహార ప్రియులను నోరూరిస్తూనే ఉంటాయి. మామిడితో రకరకాల నిల్వ పచ్చళ్లు తయారు చేస్తారు. పచ్చళ్లు, పప్పే కాకుండా మామిడి కాయతో చేసే రకరకాల వంటల పరిచయం మీ కోసం...

పులిహోర

కావలసిన పదార్థాలు: ఒక కప్పు బియ్యం, సగం కప్పు పచ్చి మామిడికాయ తురుము, పావు కప్పు కొబ్బరి తురుము, రుచికి సరిపడా ఉప్పు, సగం స్పూను మిరియాలు, నాలుగు పచ్చి మిర్చి, నాలుగు ఎండు మిర్చి, సగం స్పూను ఆవాలు, ఒక స్పూన్ మినపప్పు, ఒక టేబుల్ స్పూను శనగపప్పు, పావు స్పూను పసుపు, రెండు టేబుల్ స్పూన్ల జీడిపప్పు, పావు కప్పు పల్లీలు, రెండు కరివేపాకు రెబ్బలు, తాలింపుకు సరిపడా నూనె.



తయారీ విధానం: ముందుగా బియ్యాన్ని కడిగి నీళ్ల పోసి స్టవ్ మీద పెట్టి పొడిపొడిగా అన్నం వండి పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కడాయి పెట్టి నూనె వేసి వేడి చేసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు, మిరియాలు, మినపప్పు, జీడిపప్పు, శనగపప్పు, పల్లీలు, ఎండు మిర్చి, పచ్చిమిర్చి వేసి బాగా వేయించుకోవాలి. తర్వాత కరివేపాకు, మామిడి తురుము, కొబ్బరి తురుము, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఇలా చేసుకున్న మిశ్రమాన్ని అన్నం పైన వేసి బాగా కలుపుకోవాలి. అంతే ఎంతో రుచికరమైన మామిడికాయ, కొబ్బరి పులిహోర రెడీ.

చట్నీ:

కావలసిన పదార్థాలు : మామిడికాయ- ఒకటి, మినపప్పు-ఒక చెంచా, శనగలు- ఒక స్పూన్, మెంతులు - పావు చెంచా, ఎండుమిర్చి - నాలుగు, పచ్చిమిర్చి - రెండు, ఆవాలు - ఒక స్పూన్, ఇంగువ కొంచెం, వెల్లుల్లి రెండు, కరివేపాకు కొంచెం, ఉప్పు రుచికి తగ్గట్టుగా, జీలకర్ర కొద్దిగా.

తయారీ విధానం :

స్టౌవ్ వెలిగించుకొని బాండీ పెట్టుకోవాలి. బాండీలో నూనె వేయాలి. తర్వాత శనగలు, మినపప్పు వేసి వేయించాలి. ఇప్పుడు ఎండు మిర్చి వేసి వేయించాలి. కారంగా కావాలంటే నాలుగు పచ్చి మిర్చి కూడా వేసి వేయించుకోవచ్చు. తర్వాత మిక్సీ జార్ తీసుకుని అందులో వేయించిన మసాలాలు, జీలకర్ర, వెల్లుల్లి, మామిడికాయ ముక్కలు, ఉప్పు వేసి బాగా మెత్తగా కాకుండా గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి నూనె వేసి కాగాక ఆవాలు, ఇంగువ, ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. దాని తర్వాత మిక్సీ పట్టుకున్న పదార్థాలు వేయాలి. కాసేపు వేయించాలి. రుచికరమైన మామిడికాయ చట్నీ సిద్ధంగా ఉంది.

మ్యాంగో వడ

కావలసిన పదార్థాలు : పచ్చి మామిడి తురుము - ఒక కప్పు, మినప్పిండి - రెండున్నర కప్పులు, క్యారెట్ తురుము - పావు కప్పు, శెనగపప్పు - రెండు టేబుల్



స్పూన్లు, పెరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి సరిపడ, ఉల్లి ముక్కలు - కొద్దిగా, జీలకర్ర, వాము - కొద్దిగా, ఉప్పు - తగినంత, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ విధానం : ముందుగా ఒక పాత్రలో మినప్పిండి, పచ్చి మామిడి తురుము, క్యారెట్ తురుము, పెరుగు, కారం, గరం మసాలా, చాట్ మసాలా, ఉల్లి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, జీలకర్ర, వాము, నువ్వులు వేసుకోవాలి. తర్వాత తగినంత ఉప్పు కలుపుకుని.. అవసరం అనిపిస్తే కొద్దిగా నీళ్లు పోసుకుంటూ కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని కాగుతున్న నూనెలో వడల్లా వేసుకుని వేయించాలి. వాటిని సాస్‌లో లేదా చట్నీతో తినొచ్చు లేదా పెరుగులో నానబెట్టుకుని ఆవడల్లా తిన్నా బాగుంటాయి.

షరబత్

కావాల్సిన పదార్థాలు: పచ్చి మామిడి కాయ ఒకటి, పుదీనా -టేస్ట్‌కు సరిపడా, చక్కెర - ఒక కప్పు, నల్ల ఉప్పు -ఒక స్పూన్, వేయించిన జీలకర్ర పొడి -ఒక టేబుల్ స్పూన్, మిరియాల పొడి -అర స్పూను, ఉప్పు -రుచికి సరిపడా, ఐస్ స్క్యూబ్స్ - మూడు, నీరు- 2 లీటర్లు

తయారీ విధానం: ముందుగా పచ్చి మామిడికాయలను తీసుకుని శుభ్రం చేసుకోవాలి.. తొక్క తీసి.. చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పుదీనా



ఆకులను శుభ్రం చేసుకొని పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టౌ వెలిగించి.. పాన్ పెట్టి.. మామిడి ముక్కలను వేసుకుని కొంచెం సేపు మరిగించాలి. అనంతరం పంచదార, ఉప్పు, నల్ల ఉప్పు, మిరియాలు, వేయించిన జీలకర్ర పొడి వేసి.. పుదీనా ఆకులూ వేసుకుని చిన్నమంటలో 20 నిమిషాలు మరిగించాలి. తర్వాత స్టౌ మీద నుంచి దించి.. మామిడి మిశ్రమాన్ని చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్ని.. మిక్సీలో వేసి.. గ్రైండ్ చేయాలి. దీన్ని ఫ్రిజ్‌లో పెట్టుకుంటే.. దాదాపు 15 రోజులు నిల్వ ఉంటుంది. తాగే ముందు.. ఒక గ్లాసులో తయారు చేసుకున్న మామిడి సిరప్, ఐస్ క్యూబ్స్, కొన్ని పుదీనా ఆకులు వేసుకుని తగినంత నీరు కలుపుకోవాలి. అంతే పుల్లపుల్లని టేస్టీ టేస్టీ మామిడి షరబత్ రెడీ.. ఇది చల్లగా తాగితే చాలా రుచిగా ఉంటుంది. ఆరోగ్యానికి మంచిది.

మ్యాంగో చికెన్ కర్రీ..!

కావలసిన పదార్థాలు: చికెన్ 500 గ్రాములు, ఉల్లిగడ్డలు - రెండు, మామిడి కాయ - ఒకటి (తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్ రెండు స్పూన్లు, లవంగాలు కొద్దిగా, పచ్చిమిర్చి నాలుగైదు, ఎండు మిర్చి - నాలుగైదు, పసుపు - ఒకస్పూను, కారం - ఒక స్పూను, గరం మసాలా పొడి -రెండు స్పూన్లు, రుచికి సరిపడా ఉప్పు.

తయారీ విధానం : వెల్లుల్లి, అల్లం, పచ్చి



మిరపకాయలు, ఎండు మిరపకాయలు కలిపి పేస్ట్‌ను తయారు చేయండి. మీరు బ్లెండర్‌ని ఉపయోగించవచ్చు లేదా చేతితో రోలులో రుబ్బుకోవచ్చు. తర్వాత చికెన్‌ను ఈ పేస్ట్‌తో మెరినేట్ చేసి రెండు గంటలు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద పాన్ పెట్టి అందులో నూనె వేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను వేసి వేయించాలి. ఇది మంచి వాసన, కొద్దిగా గోధుమ రంగులోకి వచ్చాక అందులో మారినేట్ చేసి పెట్టుకున్న చికెన్ వేసి ఉండికించుకోవాలి. తర్వాత కొద్దిగా నీరు పోసి చికెన్ బాగా ఉడికాక.. తరిగిన మామిడికాయ ముక్కలను వేయాలి. మూతపెట్టి చిన్న మంట మీద 8-10 నిమిషాలు ఉడికించాలి. మామిడికాయ, చికెన్ కర్రీ రడీ. ■

పీరియడ్స్ సమయంలో ఈ ఆహారం తీసుకోండి..



పీరియడ్స్ సమయంలో చాలా మంది నీరసంగా, చికాకుగా కనిపిస్తారు. మరికొంత మందిని అధిక రక్తస్రావం, కడుపు నొప్పి వంటి సమస్యలు బాధిస్తాయి. ఏం తినాలన్నా పెద్దగా ఆసక్తి చూపరు. అయితే పీరియడ్స్ సమయంలో మంచి పోషకాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే వ్యక్తిగతమైన పరిశుభ్రత, జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. కేవలం నెలసరి సమయంలోనే కాకుండా.. కాస్త ముందు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా నెలసరి సమయంలో వచ్చే సమస్యలను సులభంగా అధిగమించవచ్చని పేర్కొన్నారు.

- పీరియడ్స్ సమయంలో వేడి వేడి అల్లం టీ ఒక కప్పు తాగితే.. కండరాల నొప్పిలో ఎంతో ఉపశమనం లభిస్తుంది.
- ఫ్రెష్‌గా ఉండే పండ్ల రసాలు, తక్షణ శక్తిని ఇచ్చే ఆహారపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. పెరుగు, ఒమేగా-3 అధికంగా ఉండే నట్స్, కూరగాయలు, పండ్లు వంటి వాటిని తీసుకోవాలి.
- ఈ సమయంలో అధిక రక్తస్రావం వల్ల శరీరం ఎక్కువ మొత్తంలో రక్తాన్ని కోల్పోతుంది. నీరసం వంటివి లేకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవడం మంచిది.
- అలాగే ఐరన్ అధికంగా లభించే ఆహారాలను తీసుకోవాలి. ఎందుకంటే కోల్పోయిన రక్తాన్ని తిరిగి భర్తీ చేసేందుకు ఈ తరహా ఆహారాలు తోడ్పడతాయి. బచ్చలికూర, అరటి పండు, గుమ్మడికాయ, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. పప్పులు, మిల్క్ షేక్‌లు, పాలు, గుడ్లు, చేపలు, మొలకెత్తిన ధాన్యాలు మొదలైనవి తీసుకోవాలి.
- శరీరంలో కాల్షియం కొరత ఉండకూడదు. లేదంటే కీళ్ల నొప్పుల సమస్యను ఎదుర్కొంటారు. ఇందుకోసం కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవటం మంచిది. ముఖ్యంగా డార్క్ చాక్లెట్ చాలా మేలు చేస్తుంది. డార్క్ చాక్లెట్‌లో ఐరన్, మెగ్నీషియం ఎక్కువగా ఉండడం వల్ల పీరియడ్స్ సమయంలో వచ్చే సమస్యలకు ఉపశమనం కలుగుతుంది.
- అదే క్రమంలో ఎక్కువ మోతాదులో ఉప్పు, పంచదార, కాఫీ, మద్యం, స్పైసీ ఫుడ్స్, రెడ్ మీట్, వంటివాటిని తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ■

ఘనంగా సీతారాముల కల్యాణం

(మొదటిపేజీ తరువాయి)

మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తారు.

ప్రభుత్వం తరఫున సీఎస్ పట్టువస్త్రాల సమర్పణ

లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీతారాములకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, రెవెన్యూ శాఖ పొంగులేటి శ్రీనివాస రెడ్డి దంపతులు, మంత్రి కొండా సురేఖ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దంపతులు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు హాజరయ్యారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సింహ, హైకోర్ట్ జడ్జి భీమపాక నగేష్ కల్యాణంలో పాల్గొన్నారు. రామయ్య కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మిథులా స్టేడియం.. సర్వాంగ సుందరం..

శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా మిథులా స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో మిరమిట్లు గొలుపుతోంది. అలాగే మిథిలా కల్యాణ మండపంలో 24 సెక్టార్లు ఏర్పాటు చేశారు. 31 వేల మందికి పైగా భక్తులు ఈ కల్యాణం వీక్షించారు. 1800 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నారు. శ్రీ రామ పట్టాభిషేకం గురువారం ఉదయం నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్ రాజ్, ఈవో రమాదేవి క్రతువుల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రాములమ్మ ఎక్కడ..!

(మొదటిపేజీ తరువాయి)



తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర బహిరంగసభకు ఆమెను కూడా ఆహ్వానించలేదని తెలిసింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారం మొదలైంది. అందులోనూ ఆమె ఎక్కడా కానరావడం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక్కసారి గాంధీభవన్‌కు వచ్చిన ఆమె ఆ తర్వాత ఇంటికే పరిమితమయ్యారు. ఆ ఎన్నికల సమయంలో కూడా పార్టీ ఆమె సేవలను ఉపయోగించుకోలేదు. అయితే ఆ సమయంలో విజయశాంతి బీఆర్ఎస్‌పై పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నిజానికి అధికార బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం పట్ల విజయశాంతి సంతోషంగా ఉన్నారు.

బీజేపీలో ఇమడలేకనే...

గత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీని వీడిన రాములమ్మ కమలం గూటికి చేరారు.అయితే బీజేపీలో కూడా ఆమెకు సరైన గౌరవం ఇవ్వలేదు. ముఖ్యంగా ఆ పార్టీ నేతల మధ్య అంతర్గత విభేధాలు తారాస్థాయికి చేరాయి. అయినా ఆమె ఎక్కడ వెనుకడుగు వేయకుండా అనేక ప్రజా సమస్యలపై స్పందించారు. కమలం పార్టీలో ఉంటే ఏదో గ్రూపులో చేరిపోవడం తప్ప మరో గత్యంతరం లేదు. దీంతో పార్టీలో ఇమడలేక ఆమె మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. కానీ అక్కడ కూడా ఇమడలేక, బయటకు రాలేక ఇంటికి పరిమితవుతున్నారనే వార్తలొస్తున్నాయి. ఎంతో ఉత్సహంగా పార్టీలో చేర్చుకోవడం, ఆ తర్వాత సముచిత స్థానం కల్పించకపోవడంతో ఆమె తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలిసింది. సీనినటిగా విజయశాంతికి పాపులార్టీ ఉన్నది. రాజకీయ ఫైర్ బ్రాండ్‌గా కూడా ఆమెకు పేరుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ....పార్లమెంటు ఎన్నికల్లో కూడా ఆమె సేవలు ఉపయోగించుకునేలా ప్లాన్ చేయాలని ఆ పార్టీ వర్గాలు అధిష్టానాన్ని కోరుతున్నాయి. కొంత మంది సీనియర్ నేతలు ఆమెతో రాయబారం కూడా నడిపినట్టు సమాచారం. అయినప్పటికీ విజయశాంతి శాంతించలేదని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటే తప్ప ఆమె గాంధీభవన్ గడప తొక్కేలా లేరని పార్టీ వర్గాలు అంటున్నాయి.

పోరాటాల గడ్డపై ఎర్రజెండా ఎగరాలి

(మొదటిపేజీ తరువాయి)

దేశాన్ని నాశనం చేస్తారని అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ముందు ప్రకటించిన మ్యానిఫెస్టోకు, అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న విధానాలకు సంబంధం లేదన్నారు. పదేండ్లలో మోడీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని అధికారంలోకొచ్చాక విస్మరిస్తారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీలో చేరుతారని ప్రకటించడం సరైంది కాదన్నారు. రేవంత్ రెడ్డి బీజేపీలో చేరుతారని ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా ఏమైనా చెప్పారా.. చెబితే ప్రజలకు వివరించాలన్నారు. అర్థంపర్థం లేని విమర్శలు చేసి తమ స్థాయిని దిగజార్చుకుంటున్నారన్నారు.

ఎంతో పోరాట చరిత్ర కలిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అవకాశవాదులను ఓడించి.. ప్రజల గొంతుకగా ఉన్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను పార్లమెంటుకు పంపించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే జహంగీర్ కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళన పోరాటం, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. పేదలకు, రైతులకు, ప్రజలకు ఎర్రజెండా ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆలోచించి ఉద్యమ చరిత్ర కలిగిన కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈనెల 19న జహంగీర్ నామినేషన్ కార్యక్రమం భువనగిరిలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరుకానున్నట్టు తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని కొనసాగించేందుకు పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) అభ్యర్థిని పార్లమెంటుకు పంపిస్తే భువనగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయొద్దన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, నాయకులు బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, సిహెచ్ లూర్దు మారయ్య, ఒంటెపాక కృష్ణ, చెన్నబోయిన నాగమణి, ఏర్పుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

కేసీఆర్.. నీ పార్టీని మూడు నెలల్లో బొంద పెడతాం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరూ బీఆర్ఎస్‌లో ఉండరని అన్నారు. "నువ్వు ఓ పాస్‌పోర్ట్ దొంగవు. నువ్వు సీఎం కాగా లేనిది.. కష్టపడి సీఎం పదవిని అలంకరించిన రేవంత్ రెడ్డికి నీకు పోలికా.. రేవంత్ రెడ్డికి మొఖం చూపించలేక రెండు సార్లు అసెంబ్లీ సమావేశాలైనా నువ్వు రాలేదు. నీ కొడుకు, నీ అల్లుడు తీహార్ జైలుకు వెళ్లడం ఖాయం" అని అన్నారు. కేసీఆర్‌ను చూస్తే జాలేస్తుందన్నారు. తాము తలుచుకుంటే 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడో చేరేవారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా బీఆర్ఎస్‌కు రాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి 13 నుంచి 14 ఎంపీ సీట్లు రావడం ఖాయమని, జూన్ 5 నుంచి ప్రభుత్వ పాలనపై దృష్టి పెడతామని తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిశాక ప్రతి నియోజకవర్గానికీ 3500 ఇండ్లు ఇస్తామన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లైనా కట్టించావా, ఒక్క రేషన్ కార్డు అయినా మంజూరు చేశావా.. అసలు పేదల కోసం ఏం చేశావని కేసీఆర్‌ను ప్రశ్నించారు. విటమిన్ డీ తీసుకొని దొంగ దీక్షలు చేసి చావు నోట్లో తల పెట్టి ఉద్యమం చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అవినీతి చేసిన కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత జైలుకు పోయాక కేసీఆర్ మానసిక స్థితి దెబ్బతిన్నదని, రేవంత్ బీజేపీలోకి పోతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా పసిగట్టుతాం.. మీ కుటుంబానికి సరిపోయే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు చర్లపల్లి జైల్లో కట్టిస్తామని చెప్పారు.

తినటానికి తిండి లేని జగదీశ్ రెడ్డి వేల కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులు రూ.3000 కోట్లతో నడుస్తున్నాయని, ఆగస్టులోపు కాలువలు కూడా తీసి అదనంగా సొరంగాన్ని పూర్తి చేసి నీటి సమస్యకు పరిష్కారం చూపబోతున్నామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్య ఫలాలు అందడం లేదు

- ఉద్యోగ కల్పన లేకపోవడమే దీనికి కారణం
- చిప్ పరిశ్రమకు భారీగా సబ్సిడీలెందుకు?
- ఉద్యోగావకాశాలు ఉన్న రంగాలలో ఉపాధి ఏది?
- అవకాశాల కోసం విదేశాల బాట పడుతున్న యువత : ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



వాషింగ్టన్ : ప్రజాస్వామ్య ఫలాల ప్రయోజనాలను భారత్ అందిపుచ్చుకోలేకపోతోందని రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. మానవ పెట్టుబడిని పెంచాల్సిన అవసరం ఉన్నదని, వారి నైపుణ్యాలను కూడా మెరుగుపరచాలని ఆయన సూచించారు. 'ప్రజాస్వామ్య ఫలాలను పొందే మార్గంలో మనం సగం దూరం ప్రయాణించాం. అయితే ఆ ప్రయోజనాలను అందిపుచ్చుకోలేకపోవ డమే సమస్యగా మారింది' అని చెప్పారు. జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన సదస్సులో రఘురామ్ రాజన్ ప్రసంగించారు.

ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలి

ఈ కారణం చేతనే తాను ఆరు శాతం వృద్ధిని గురించి మాట్లాడానని రఘురామ్ రాజన్ తెలిపారు. ప్రజాస్వామ్య ఫలాలు అందకపోవడానికి యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోవడమే కారణమని ఆయన చెప్పారు. ఉద్యోగాల సంఖ్యను పెంచాలంటే ప్రజల సామర్థ్యాలను మెరుగుపరచాలని, ఉద్యోగాల స్వభావాన్ని మార్చాలని అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ యువతకు అప్రెంటిస్‌షిప్ కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ విలువైనదేనని చెప్పారు. అయితే దీనిని సమర్థవంతంగా అమలు చేయాలంటే చేయాల్సింది ఎంతో ఉందని అన్నారు. మంచి ఉద్యోగాలు చేయడానికి మనకు మరింత మంది విద్యార్థులు అవసరమవుతారని తెలిపారు. ఉద్యోగాల కల్పనపై మరింతగా దృష్టి సారించాలని కోరారు.

ఉద్యోగావకాశాలు ఉన్న రంగాలపై చిన్నచూపు

చిప్ తయారీపై భారత్ పెద్ద ఎత్తున ఖర్చు చేయడాన్ని రఘురామ్ రాజన్ తప్పు పట్టారు. 'ఈ చిప్ ఫ్యాక్టరీలను గురించి ఆలోచించండి. చిప్ తయారీ కోసం అనేక బిలియన్ డాలర్ల సొమ్మును సబ్సిడీగా అందజేస్తున్నారు' అని చెప్పారు. తోలు పరిశ్రమ వంటి ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్న రంగాల పనితీరు సంతృప్తికరంగా లేదని అన్నారు. 'ఆయా రంగాలలో మనం సరిగా పనిచేయడం లేదు. ఉద్యోగాల సమస్య పెరిగితే ఆశ్చర్యపడాల్సిన అవసరమే లేదు. ఉద్యోగ సమస్య అనేది గత పది సంవత్సరాలలో వచ్చింది కాదు. గత కొన్ని దశాబ్దాలుగా అది పెరుగుతూ వస్తోంది. అయితే ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్న రంగాలను మనం నిర్లక్ష్యం చేస్తున్నాము. తప్పు ఎక్కడ జరుగుతోందో తెలుసుకొని దానిని సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది' అని అభిప్రాయపడ్డారు. దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాల స్థాపన కోసం సింగపూర్, సిలికాన్ వ్యాలీ వెళుతున్నారని, ఎందుకంటే అక్కడి మార్కెట్లలో ప్రవేశం వారికి సులభతరంగా ఉంటోందని చెప్పారు.

యంగ్ ఇండియాది కోహ్లీ మనస్తత్వం

'దేశంలోనే ఉండకుండా బయటకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో వారిని అడగాలి. అయితే వారు ప్రపంచాన్నే మార్చేయాలని కోరుకోవడం ఆనందదాయకం. మరిన్ని దేశాలలో విస్తరించాలని వారు భావిస్తున్నారు. ఒక యంగ్ ఇండియా ఉన్నదని నేను అనుకుంటున్నాను. దానిది విరాట్ కోహ్లీ మనస్తత్వం. ప్రపంచంలో రెండో స్థానంలో ఉండడాన్ని వారు ఇష్టపడరు' అని రఘురామ్ రాజన్ అన్నారు.

కమల సంకల్పం.. న్యాయ హస్తం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం అనే నినాదాలతో కాంగ్రెస్ ప్రజల ముందుకు వెళుతోంది. కులగణన చేపడతామని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ఇప్పటి వరకూ ఓట్ల కోసం కుల సమీకరణపై దృష్టి పెట్టలేదు. ఇప్పుడు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోంది. అయితే దేశ రాజకీయాలలో గణనీయమైన ప్రభావం చూపగలిగిన పార్టీలకు కులాల అంశం తొలి ప్రాధాన్యత కాదు.

ఆ నాలుగు వర్గాల పైనే కన్ను

ఇక బీజేపీ ప్రధానంగా నాలుగు వర్గాలపై...గ్రామీణులు, యువత, రైతులు, మహిళలపై దృష్టి సారించింది. మోడీ ప్రభుత్వ విధానాలు కూడా ఈ వర్గాల చుట్టూనే తిరుగుతున్నాయి. గిరిజనుల ఓట్లపై కూడా కమలదళం కన్నేస్తోంది. కులగణనపై బీజేపీ పెదవి విప్పడం లేదు. అయితే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) పది శాతం రిజర్వేషన్ల అమలుకు తీసుకుంటున్న చర్యలను ఓటర్లకు గుర్తు చేయడం మాత్రం మరచిపోవడం లేదు. ఏదేమైనా కులాల వారీగా లెక్కల సేకరణ రాబోయే కాలంలో ఒక రూపుదిద్దుకుంటుందని చెప్పవచ్చు.

అంతా మోడీ మయం

బీజేపీకి కర్త, కర్మ, క్రియ...అంతా ప్రధాని మోడీయే. 'మోడీ కీ గ్యారంటీ' అంటూ ఆయన తన పేరు మీదుగానే హామీలు కురిపిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఓటర్లను చేరుకునేందుకు బీజేపీ అధ్యక్ష తరహా మ్యానిఫెస్టోను రూపొందించిందని అనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం అంశాలను కూడా తన ఘనతలుగా కమలదళం చెప్పుకుంది. ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొస్తామని, పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తామని పునరుద్ఘాటించింది. అయితే 2019 మ్యానిఫెస్టోలో కన్పించిన 'జాతీయ పౌరుల రిజిస్టర్' ఇప్పుడు కనబడడం లేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తన మ్యానిఫెస్టోలో నిప్పులు చెరిగింది. రాజ్యాంగ సంస్థల పవిత్రతను పునరుద్ధరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చింది.

ఆయన అవినీతికి ఛాంపియన్

ఘజియాబాద్ : మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ స్కీమ్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని మోడీని ఆయన అవినీతికి ఛాంపియన్‌గా అభివర్ణించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా కౌషంబీలో ఆయన బుధవారం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి అనుకూలంగా బలమైన గాలులు వీస్తున్నాయని, బీజేపీ 150 సీట్లకే పరిమితం అవుతుందని రాహుల్ చెప్పారు. ఎన్నికల నిధులలో పారదర్శకత కోసమే బాండ్ల పథకాన్ని తీసుకొచ్చామని ప్రధాని చెబుతున్నారని అంటూ.... అలాంటప్పుడు దానిని సుప్రీంకోర్టు ఎందుకు కొట్టివేసిందని రాహుల్ ప్రశ్నించారు. 'ఎన్నికల బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ పథకం. ఆ విషయం మన దేశంలో వ్యాపారులకు బాగా తెలుసు. ప్రధాని ఎంతగా వివరణ ఇస్తున్నప్పటికీ దాని ప్రభావమేమీ ఉండదు. ఎందుకంటే అవినీతికి ప్రధాని ఛాంపియన్ అని విషయం దేశానికంతా తెలుసు' అని అన్నారు. కాలపరిమితితో నిమిత్తం లేకుండా పేదరికాన్ని కాంగ్రెస్ నిర్మూలిస్తుందంటూ తాను చేసిన వ్యాఖ్యలను మోడీ విమర్శించడాన్ని రాహుల్ ప్రస్తావించారు. పేదరికం అనేది ఒక్కసారిగా పోయేది కాదని, అయితే అందుకోసం తాము బలమైన ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో అమేథీ నుండి పోటీ చేయడంపై అడిగిన ప్రశ్నకు రాహుల్ సమాధానమిస్తూ ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. అలాంటి నిర్ణయాలను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ తీసుకుంటుందని అన్నారు. కాగా పశ్చిమ యూపీలోని ఘజియాబాద్ నుండి ఘాజీపూర్ వరకూ రాజకీయ పవనాలలో మార్పు కన్పిస్తోందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఘనంగా వీడ్కోలు పలుకుతామని అఖిలేష్ తెలిపారు. ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా చీలకుండా ప్రయత్నిస్తామని అన్నారు.



ఐపీఎల్ 2024 పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	వి	ఓ	పా
1 రాజస్థాన్	07	06	01	12
2 కోల్‌కత	06	04	02	08
3 చెన్నై	06	04	02	08
4 హైదరాబాద్	06	04	02	08
5 లక్నో	06	03	03	06
6 ఢిల్లీ	07	03	04	06
7 గుజరాత్	07	03	04	06
8 పంజాబ్	06	02	04	04
9 ముంబయి	06	02	04	04
10 బెంగళూర్	07	01	06	02

మ్యా : మ్యాచులు, వి : విజయాలు, ఓ : ఓటములు, పా : పాయింట్లు

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X ముంబయి
వేదిక : ముల్లాన్‌పూర్, రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

ఐపీఎల్ టికెట్లకు ఆస్తులు అమ్ముకోవాల్సిందే!

జెంటిల్‌మెన్ గేమ్ క్రికెట్‌ను ఫక్తు కార్పోరేట్ క్రీడగా మార్చింది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). క్రికెట్ కార్పోరేటీకరణతో బీసీసీఐ ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డుగా ఎదిగింది. కానీ ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల ధరలు ప్రాంచైజీల కాసుల కక్కుర్తితో ఆకాశాన్ని తాకుతున్నాయి. ఐపీఎల్ టికెట్ల ధరలు, అమ్మకం అంశం ప్రాంచైజీలకు అప్పగించటంతో.. అభిమాన క్రికెటర్ల ఆట చూసేందుకు అభిమానులు ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది.

- ప్రాంచైజీల ఇష్టారాజ్యంగా టికెట్ ధరలు
- బెంగళూర్‌లో గరిష్ట టికెట్ ధర రూ.52,938
- హైదరాబాద్‌లో కార్పొరేట్ టికెట్ ధర రూ.30,000



నవతెలంగాణ-హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌ను స్టేడియంలో చూసేందుకు టికెట్ ధర ఎంత వరకు ఉంటుందని అనుకుంటారు? మహా అయితే.. రూ. ఐదు వేలు. స్టేడియంలో ఏదో ఒక గ్యాలరీలో కూర్చుని చూసేందుకు కనీసం రూ.500 ఉంటే సరిపోతుందని అందరూ అనుకుంటారు. ఐపీఎల్ రాకతో ఆ రోజులు పోయాయి. ఇప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు ఆస్తులు అమ్ముకోవాల్సిందే. నిజమే.. ఐపీఎల్ ప్రాంచైజీలు టికెట్ల ధరలను చివరకు ఆ స్థాయికి తీసుకెళ్లాయి. ఐపీఎల్ నిబంధనల్లో భాగంగా టికెట్ల ధరల నిర్ధారణ, అమ్మకం పూర్తిగా ప్రాంచైజీల అంశం. ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్ టికెట్లను మాత్రమే బీసీసీఐ స్వయంగా పర్యవేక్షిస్తుంది. లీగ్ దశ మ్యాచుల టికెట్ల ధరలను ఆతిథ్య ప్రాంచైజీ నిర్ణయిస్తుంది. టికెట్ల అమ్మకంతో భారీగా ఆదాయం ఆర్జించాలనే లక్ష్యం పెట్టుకున్న ప్రాంచైజీలు ధరలను అమాంతం పెంచేస్తున్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌ను చిన్నస్వామి స్టేడియంలో చూడాలని అనుకుంటే గరిష్టంగా రూ.52,938 వెచ్చించాల్సిందే. ఐపీఎల్ 17వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ చెత్త ప్రదర్శన చేస్తున్నా.. విపరీత అభిమాన గణం అండతో స్టేడియం నిండిపోతుంది. మైదానంలో జట్టు చెత్త ప్రదర్శన చేసినా.. అభిమాన సంద్రంతో ఆర్సీబీ యాజమాన్యం ఖజానా నింపుకునే పనిలో నిమగ్నమైంది.

డైనమిక్ ధరలు : సాధారణంగా క్రికెట్ మ్యాచులకు టికెట్ల ధరలను ముందుగానే నిర్ణయిస్తారు. ఏ విభాగంలో టికెట్‌కు ఎంత ధర అనేది వెల్లడిస్తారు. కానీ ఐపీఎల్ ప్రాంచైజీలు విమానయాన సంస్థల బాటలో నడుస్తున్నాయి. విమానం టికెట్ ధరలు డిమాండ్‌ను బట్టి మారుతుంటాయి. అధిక డిమాండ్ ఉంటే ధరలు అంతే అధికంగా ఉంటాయి. డిమాండ్ తగ్గిపోతే.. టికెట్ ధరలు సైతం నేలకు దిగుతాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ప్రాంచైజీ సహా మరికొన్ని డైనమిక్ ధరలను అనుసరిస్తున్నాయి. ఆర్సీబీ యాజమాన్యం గరిష్ట టికెట్ ధర రూ.42,350గా నిర్ణయించింది. కానీ మ్యాచ్‌కు ముందు రోజు వరకు డిమాండ్ పెరగటంతో టికెట్ ధరలు సైతం అమాంతం పెరుగుతుంది. ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియంలో గరిష్ట టికెట్ ధర రూ.53 వేల వరకు చేరుకుంది.

కాసుల కక్కుర్తి : ఐపీఎల్ ప్రాంచైజీలకు టికెట్ల అమ్మకం నుంచి వచ్చే ఆదాయం ప్రధాన ఆదాయ వనరు ఏమాత్రం కాదు. ప్రసారదారు, సెంట్రల్ పూల్ (బీసీసీఐ) నుంచి ప్రాంచైజీలు ప్రధానంగా ఆదాయం ఆర్జిస్తాయి. అంతర్గత ఆదాయ మార్గాలను సైతం ప్రాంచైజీలు బలోపేతం



చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే కిట్ స్పాన్సర్, టికెట్ అమ్మకాలపై దృష్టి సారించాయి. మొహాలి, చండీగడ్ వంటి నగరాల్లో టికెట్ ధరలు సాధారణంగా ఉండగా.. మెట్రోపాలిటన్ నగరాల్లో టికెట్ ధరలు అధికంగా ఉన్నాయి. టికెట్‌కు ఎంత ధరైనా వెచ్చిస్తారనే నమ్మకంతోనే ప్రాంచైజీలు అధిక ధరలకు టికెట్లను విక్రయిస్తున్నాయి. ఇక నగరాలతో సంబంధం లేకుండా ఎం.ఎస్ ధోని, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి దిగ్గజ క్రికెటర్లు ఆడుతున్న మ్యాచ్‌కు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో సహజంగానే ఆ మ్యాచులకు టికెట్ల ధరలను సైతం పెంచుతున్నారు. ఈవెనింగ్ గేమ్‌తో పోల్చితే నైట్ గేమ్‌కు టికెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి.

అయినా.. సౌకర్యాలేవీ : రూ. వేలు వెచ్చించి ఐపీఎల్ టికెట్ కొనుగోలు చేసిన అభిమానులకు మైదానంలో నిరాశే ఎదురవుతుంది. ప్రాంచైజీలు, రాష్ట్ర క్రికెట్ సంఘాలు అభిమానులకు సరైన సౌకర్యాలు అందించటం లేదు. కొన్ని స్టేడియాల్లో సరైన 'వ్యూ పాయింట్స్' లేవు. అభిమానులకు అడ్డుగా తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలు సహా ప్రసారదారు కెమెరాలు అడ్డుగా వస్తున్నాయి. స్టేడియంలో తాగునీరు, ఆహార పదార్థాల ధరలు సైతం అధికంగా ఉంటున్నాయి. మరుగుదోడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు కొన్ని సార్లు నీటి సదుపాయం ఉండటం లేదు. కార్పోరేట్ టికెట్లు కొనుగోలు చేసిన వారికి సైతం చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. రూమ్‌లో ఏసీ పని చేయకపోవటం, హాస్పిటాలిటీ అధ్వానంగా ఉండటంతో సోషల్ మీడియా వేదికగా అభిమానులు ఫిర్యాదు చేస్తున్నారు. అయినా, అభిమానులకు కనీస సౌకర్యాలు కల్పించటంపై ప్రాంచైజీలు అశ్రద్ధ చేస్తున్నాయి.

అభిమానుల ఆగ్రహం : ఐపీఎల్ టికెట్ ధరలను అమాంతం పెంచటంపై సగటు క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ధరల అంశంలో బీసీసీఐ జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ప్రాంచైజీలకు ఇష్టం వచ్చిన ధరలకు టికెట్ల అమ్మకుండా.. బీసీసీఐ స్వయంగా టికెట్ ధరలను నిర్ణయించాలని అడుగుతున్నారు. టికెట్ల అమ్మకం అంశంలోనూ ప్రాంచైజీలు పూర్తి పారదర్శకత వహించేలా బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మన దగ్గరా ఇదే దుస్థితి



సన్‌రైజర్స్ హైదరాబాద్ సైతం టికెట్లను భారీ ధరలకు అమ్ముతుంది. ఉప్పల్ స్టేడియంలో కనీస టికెట్ ధర రూ.750 కాగా... గరిష్ట టికెట్ ధర రూ.30 వేలు. నార్త్, సౌత్ పెవిలియన్ టెర్రస్ టికెట్లను తక్కువ ధరలకు విక్రయిస్తారు. కానీ ఆన్‌లైన్‌లో ఈ టికెట్లను అందుబాటులో ఉంచటం లేదు. కాంప్లిమెంటరీ పాసుల రూపంలో ప్రభుత్వ విభాగాలు, అధికారులు, హెచ్‌సీఏకు పంచేందుకు ప్రాంచైజీ ఈ టికెట్లను నామమాత్రంగా అందుబాటులో ఉంచుతుంది. దీంతో సగటు క్రికెట్ అభిమాని టికెట్ కొనే పరిస్థితి ఉండటం లేదు. వెస్ట్, ఈస్ట్ స్టాండ్స్ టికెట్లను సైతం ప్రాంచైజీ ఆన్‌లైన్‌లో తక్కువ మొత్తంలోనే ఉంచుతుందనే ఆరోపణలు ఉన్నాయి. అభిమానులకు సకల సౌకర్యాలు కల్పించే చెన్నై చెపాక్ స్టేడియంలో కనీస టికెట్ ధర రూ.1700, గరిష్ట టికెట్ ధర రూ.6 వేలు. మరి అభిమానులకు కనీస సౌకర్యాలు కల్పించని ఉప్పల్ స్టేడియంలో ఎందుకు టికెట్‌కు రూ.30 వేలు వెచ్చించాలని అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

శ్రీజ, మనిక ఔట్

ఐటీటీఎఫ్ వరల్డ్‌కప్ 2024



మకావు : టేబుల్ టెన్నిస్ ప్రపంచకప్‌లో భారత ప్యాడ్లర్లు శ్రీజ ఆకుల, మనిక బత్ర గ్రూప్ దశ నుంచి నిష్క్రమించారు. వరల్డ్ నం.39 ఆకుల శ్రీజ 1-3తో రెండో మ్యాచ్‌లో ఓడింది. 4-11, 4-11, 15-13, 2-11తో వరల్డ్ నం.4 చెన్ మెంగ్ చేతిలో పోరాడి ఓడింది. తొలి మ్యాచ్‌లో 4-0తో నెగ్గిన శ్రీజ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. వరల్డ్ నం.37 మనిక బత్ర 0-4తో నిరాశపరిచింది. 6-11, 4-11, 9-11, 4-11తో వరల్డ్ నం.2 వాంగ్‌కు తలొంచింది. మనిక సైతం గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో 16 గ్రూపులు ఉండగా.. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిస్తేనే నాకౌట్ దశకు చేరుకుంటారు.

షూటింగ్ ప్రాబబుల్స్ ఎంపిక

ఒలింపిక్ సెలక్షన్ ట్రయల్స్ షురూ



న్యూఢిల్లీ : పారిస్ ఒలింపిక్స్‌లో భారత తరఫున గురి ఎక్కుపెట్టేదెవరో తేల్చేందుకు భారత రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) సిద్ధమైంది. 2024 ఒలింపిక్స్‌కు భారత్ 16 స్థానాలు కైవసం చేసుకుంది. ఈ స్థానాల్లో ఎవరు పోటీపడేది జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌తో సెలక్షన్ కమిటీ తేల్చనుంది. 16 స్థానాల కోసం 37 మంది షూటర్లు పోటీపడతారని ఎన్ఆర్ఏఐ బుధవారం ప్రాబబుల్స్‌ను ప్రకటించింది. శుక్రవారం నుంచి న్యూఢిల్లీలో ట్రయల్స్ షురూ కానుండగా.. ఈషా సింగ్, మను భాకర్, రిథమ్ సంగ్వాన్ వంటి స్టార్ షూటర్లు బరిలో ఉండనున్నారు. ఓవరాల్‌గా నాలుగు ట్రయల్స్ అనంతరం ఉత్తమ షూటర్లను ఒలింపిక్స్‌కు పంపించనున్నారు.



టైటాన్స్ ధమాల్

89 పరుగులకే గుజరాత్ ఆలౌట్
6 వికెట్ల తేడాతో ఢిల్లీ ఘన విజయం

నవతెలంగాణ-అహ్మదాబాద్

ఢిల్లీ క్యాపిటల్స్ అదరహో. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసిన పంత్‌సేన కీలక సమయంలో భారీ విజయం సాధించింది. తొలుత ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ల దెబ్బకు గుజరాత్ టైటాన్స్ ధమాల్ అయ్యింది. సొంతమైదానంలో ఆ జట్టు 89 పరుగులకే కుప్పకూలింది. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఇదే అత్యల్ప స్కోరు. పేసర్లు ముకేశ్ కుమార్ (3/14), ఇషాంత్ శర్మ (2/8), స్పిన్నర్ ట్రిస్టన్ స్టబ్స్ (2/11) విజృంభించటంతో అహ్మదాబాద్‌లోని మొతెరా స్టేడియంలో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 17.3 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌటైంది. టెయిలెండర్ రషీద్ ఖాన్ (31, 24 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) గుజరాత్ టైటాన్స్‌కు ఆ మాత్రం స్కోరు అందించాడు. 90 పరుగుల ఛేదనలో కెప్టెన్ రిషబ్ పంత్ (16 నాటౌట్, 11 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), జేక్ ఫ్రేసర్ (20, 10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ పోరెల్ (15, 7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), షాయ్ హోప్ (19, 10 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. 8.5 ఓవర్లలోనే (మరో 67 బంతులు ఉండగానే) 92 పరుగులు బాదిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది ఏడు మ్యాచుల్లో మూడో విజయం కాగా.. గుజరాత్ టైటాన్స్‌కు ఏడు మ్యాచుల్లో ఇది నాల్గో పరాజయం.

పేసర్ల ప్రతాపం : తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్‌కు ఢిల్లీ పేసర్లు చుక్కలు చూపించారు. ఇషాంత్ శర్మ, ముకేశ్ కుమార్‌లు నిప్పులు చెరిగే బంతులు సంధించారు. వృద్దిమాన్ సాహా (2), శుభ్‌మన్ గిల్ (8), సాయి సుదర్శన్ (12), డెవిడ్ మిల్లర్ (2), అభినవ్ మనోహర్ (8), రాహుల్ తెవాటియ (10), షారుక్ ఖాన్ (0) పది ఓవర్లలోపే డగౌట్‌కు చేరుకున్నారు. 48/6తో గుజరాత్ టైటాన్స్ మరింత స్వల్ప స్కోరుకు పరిమితం అయ్యేలా కనిపించింది. రషీద్ ఖాన్ (31) ఎదురుదాడి ఇన్నింగ్స్‌తో టైటాన్స్ ఆ మాత్రం స్కోరు అందించాడు. మోహిత్ శర్మ (2), నూర్ అహ్మద్ (1) సైతం నిరాశపరిచారు. 17.3 ఓవర్లలోనే గుజరాత్ టైటాన్స్ పది వికెట్లు కోల్పోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఇషాంత్ శర్మ, ముకేశ్ కుమార్ సహా స్పిన్నర్ ట్రిస్టన్ స్టబ్స్ వికెట్ల వేటలో మెరిశారు. ఖలీల్ అహ్మద్, అక్షర్ పటేల్ చెరో వికెట్ పడగొట్టారు.

నవచిత్రం



నితిన్

రాబిన్‌హుడ్

క్రిస్మస్ కానుకగా రిలీజ్

వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాబిన్ హుడ్' సినిమాలో హీరో నితిన్ మునుపెన్నడూ లేని తరహా పాత్రలో అద్భుతంగా కనిపించబోతున్నారు. ఆయన గెటప్ నుండి క్యారెక్టరైజేషన్ వరకు నితిన్‌ని పూర్తిగా డిఫరెంట్ క్యారెక్టర్‌లో దర్శకుడు ప్రెజెంట్ చేస్తున్నారు. అతన్ని దొంగగా పరిచయం చేసిన టీజర్ హాస్యభరితంగా ఉండగా, బర్త్ డే గ్లింప్స్ పూర్తి యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో అత్యున్నత స్థాయి నిర్మాణ, సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

ఇదిలా ఉంటే, ఈ సినిమాని డిసెంబర్ 20న విడుదల చేయాలని మేకర్స్ డిసైడ్ అయ్యారు. క్రిస్మస్ సెలవులు, ఆ తర్వాత న్యూ ఇయర్ సెలవులు ఈ సినిమాకి కలిసి రానున్నాయి. కమర్షియల్ అంశాలే కాకుండా తగినంత వినోదాన్ని కలిగి ఉండే సినిమాకి ఇది సరైన విడుదలని భావిస్తున్నారు.

మేడమ్ సార్.. మేడమ్ అంతే



రమ్య పసుపులేటి

రావు రమేష్ హీరోగా నటించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జంటగా, హర్షవర్ధన్ కీలక పాత్రలో నటించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై సినిమా రూపొందుతోంది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు.

సినిమాలో రెండో పాట 'మేడమ్ సార్ మేడమ్ అంతే'ను మేకర్స్ బుధవారం విడుదల చేశారు. ఈ సినిమాలో రావు రమేష్ కుమారుడిగా అంకిత్ కొయ్య నటించారు. ఆయన ప్రేమించే అమ్మాయిగా రమ్య పసుపులేటి కనిపించనున్నారు. వాళ్లిద్దరి మీద 'మేడమ్ సార్ మేడమ్ అంతే' పాటను తెరకెక్కించారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ అభిమానిగా అంకిత్ కొయ్య కనిపించనున్నారు. అందుకని, ఆయన అల్లు అర్జున్ సినిమాల్లో హీరోయిన్ ఇంట్రడక్షన్ సన్నివేశాలను ఊహించుకుంటూ తన ప్రేమ పాటను పాడుకున్నారు. 'తొలి తొలి సారి తొలిసారి గుండె గంతులేస్తున్నదే!... మేడమ్ సారు మేడమ్ అంతే' అంటూ సాగే ఈ పాటను గాయకుడు సిద్ శ్రీరామ్ పాడారు. కళ్యాణ్ నాయక్ అందించిన అద్భుతమైన బాణీని తన గాత్రంతో ఆయన మరో స్థాయికి తీసుకువెళ్లారు. భాస్కరభట్ల పాటను రాశారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'తాజాగా సన్నాఫ్ సుబ్రమణ్యంగా నటించిన అంకిత్ కొయ్య సాంగ్ విడుదల చేశాం. ఆయన పోషించిన పాత్రకు, అల్లు అర్జున్‌కి సినిమాలో చిన్న కనెక్షన్ ఉంటుంది. అది ఏమిటనేది ప్రస్తుతానికి సస్పెన్స్. లిధా మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్ ద్వారా మా సినిమాలో పాటల్ని విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సినిమా విడుదల తేదీ వెల్లడిస్తాం' అని చెప్పారు.

విక్రమ్ నట విశ్వరూపం




విక్రమ్

విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. దర్శకుడు పా రంజిత్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ బ్యానర్స్ పై ప్రొడ్యూసర్ కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. బుధవారం విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ చెబుతూ ఈ సినిమా నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు పా. రంజిత్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను చరిత్రలో జరిగిన కొన్ని యదార్థ ఘటనల నేపథ్యంతో తెరకెక్కిస్తున్నాం. ఆ అడ్వెంచర్ స్టోరీని రూపొందించడంలో హీరో విక్రమ్‌తో పాటు మూవీ టీమ్ నాకు ఎంతో సపోర్ట్ చేసింది. ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీ జియో స్టూడియోస్ ఈ సినిమా కోసం స్టూడియో గ్రీన్‌తో చేతులు కలపడం సంతోషంగా ఉంది. జియో స్టూడియోస్ రాకతో మా సినిమా గ్లోబల్ ఆడియెన్స్‌కు మరింతగా రీచ్ అవుతుందని ఆశిస్తున్నాం. హీరో విక్రమ్ ఈ సినిమా కోసం ఎంతగా కష్టపడ్డారో ఈ గ్లింప్స్ మీకు చూపిస్తుంది' అని అన్నారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాని త్వరలోనే అన్ని భారతీయ భాషల్లో వరల్డ్ వైడ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

వీర ధీర శూరన్



విక్రమ్

హీరో విక్రమ్ పుట్టిన రోజు బుధవారం. ఈ సందర్భంగా మేకర్స్ ఆయన కథానాయకుడిగా నటిస్తోన్న 62వ చిత్రానికి సంబంధించి టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'వీర ధీర శూరన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. త్వరలోనే తెలుగు టైటిల్‌ను ప్రకటించనున్నారు. ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హెచ్.ఆర్.పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో పక్కా మాస్ అవతార్‌లో విక్రమ్ అభిమానులను మెప్పించటం ఖాయంగా కనిపిస్తుంది.

జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. త్వరలోనే మరిన్ని వివరాలను తెలియజేస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి నిర్మాత: రియా శిబు, రచన-దర్శకత్వం: ఎస్.యు. అరుణ్‌కుమార్, అసోసియేట్ ప్రొడ్యూసర్: రోని జకారియా.

అందరూ కనెక్ట్ అవుతారు



సత్యం రాజేష్

'పొలిమేర-2'తో ఊహించని సక్సెస్ అందుకున్న సత్యం రాజేష్ హీరోగా నటించిన చిత్రం 'టెనెంట్'. వై.యుగంధర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మేఘా చౌదరి, చందన పయ్యావుల, ఎస్తర్ నోరోన్హా, భరత్ కాంత్ కీలక పాత్రలు పోషించారు. మహాతేజ క్రియేషన్స్ బ్యానర్‌పై మోగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ఈ నేపథ్యంలో హీరో సత్యం రాజేష్ మీడియాతో ముచ్చటించారు.

'ఇది ఎదురింట్లో లేదా పక్కింట్లో జరిగే కథ. భార్యాభర్తల మధ్య వచ్చే ప్రాబ్లమ్స్ గురించి చూపించే కథ. ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగే స్టోరీ. అన్నీ రియల్ లైఫ్ ఇన్సిడెంట్స్‌లాగే ఉంటాయి. డైరెక్టర్ ఏం చెప్పారో అది పర్‌ఫెక్ట్‌గా తీశారు. ప్రతి సీన్ చాలా బాగుంటుంది. సినిమా థియేటర్‌లో చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెప్పేలా ఉంటుంది. ఆడియన్స్‌కు ఈ సినిమా బ్యూటిఫుల్ ఫీల్ ఇస్తుంది. ఇలాంటి ఆఫ్ బీట్ సినిమాలకు రైటింగ్ చాలా ముఖ్యం. ఈ సినిమా కథను వర్మ శ్రీనివాస్ రాశారు. ఆయన రైటింగ్ చాలా నేచురల్‌గా ఉంది. అలాగే థ్రిల్లర్ సినిమాలకు మ్యూజిక్ కూడా చాలా ఇంపార్టెంట్. ఈ సినిమాకు సాహిత్య సాగర్ సంగీతం అందించారు. ఈ సినిమాకు మ్యూజిక్కే ప్రాణం. క్లైమాక్స్‌లో డబ్బింగ్ చెప్తున్నప్పుడు నేనే అలా అలా పాజ్ అయ్యా. ఒక ఆడియన్‌లాగా నాకే కన్నీళ్లు వచ్చాయి. సినిమాలో మ్యూజిక్ ఫీల్ అంతగా ఉంటుంది.

ప్రస్తుతం స్ట్రీట్ ఫైట్, రవితేజ 'మిస్టర్ బచ్చన్' సినిమాలో నటిస్తున్నాను'.

పాన్ ఇండియా స్థాయిలో

జర్నీ టు అయోధ్య



వేణు దోనేపూడి

జగదభిరాముడు, సకల గుణధాముడు.. ధర్మ రక్షకుడు, ఏకపత్నీవ్రతుడైన అయోధ్య రామయ్యను స్మరిస్తూ అనంత కోటి భక్తజనం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగ శ్రీరామనవమి. ఈ పర్వదినాన ప్రొడ్యూసర్ వేణు దోనేపూడి తన చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2ను అనౌన్స్ చేశారు. 'జర్నీ టు అయోధ్య' అనేది వర్కింగ్ టైటిల్. దర్శకుడు వి.ఎస్.ఆదిత్య కథను అందిస్తున్నారు.

రామాయణంపై, రామాయణంను ఆధారంగా చేసుకుని ఇప్పటి వరకు చాలా సినిమాలు వచ్చాయి. ఎందరో గొప్ప గొప్ప నటీ నటులు సీతా రాములుగా, రావణ, లక్ష్మణ, ఆంజనేయులుగా నటించి ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు అదే బాటలో రామాయణంను తెరకెక్కించటానికి నిర్మాత వేణు దోనేపూడి సిద్ధమయ్యారు. వి.ఎస్.ఆదిత్య నేతృత్వంలో ఒక టీమ్ ఈ చిత్రానికి సంబంధించి అయోధ్య సహా పలు చోట్ల లోకేషన్స్ రెక్కీ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఒక యంగ్ డైరెక్టర్ దర్శకత్వంలో తెరకెక్కించబోతున్న ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు మేకర్స్. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, భారీగా నిర్మించబోతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి నిర్మాణ సారధ్యం తమ్మారెడ్డి భరద్వాజ వహిస్తున్నారు.

ప్రస్తుతం చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ పీపుల్ మీడియా బ్యానర్‌తో కలిసి గోపీచంద్, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో 'విశ్వం' సినిమాను రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే.

ఆద్యంతం నవ్వించే టీచర్



నిఖిల్ దేవాదుల, నవీన్ మేడారం, నిత్యశ్రీ

ఆసాంతం కడుపుబ్బ నవ్వించే నవ్వుల జల్లుతో తెరకెక్కుతోంది 'టీచర్'. తెలంగాణలోని అంకాపూర్ అనే గ్రామంలో ఉన్న ముగ్గురు డల్ స్టూడెంట్స్‌కి సంబంధించిన కథతో తెరకెక్కుతోందీ చిత్రం.

ఈ చిత్రంలో టీచర్‌గా కలర్స్ స్వాతి నటిస్తున్నారు. అడ్డూఅదుపూ లేకుండా అల్లరి చేసే ముగ్గురు విద్యార్థులు టీచర్‌ని కలిసిన తర్వాత ఏం జరిగింది? వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అనేది హృద్యంగా ఉంటుంది. సరదా సన్నివేశాలు, సంభాషణలు, అందమైన, అమాయకమైన ప్రేమ, భావోద్వేగాలతో కూడిన ప్రయాణం... ప్రేక్షకుల మనసులను టచ్ చేస్తుందనడంలో అసలు సందేహం లేదు. ఇటీవల 90స్- ఎ మిడిల్ క్లాస్ బయోపిక్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్న టీమ్ నుంచి వస్తోందీ చిత్రం.

ఆదిత్య హసన్ ఈ సినిమాను డైరెక్ట్ చేశారు. నవీన్ మేడారం నిర్మించారు. ఎంఎన్‌ఓపీ (మేడారం నవీన్ అఫిషియల్ ప్రొడక్షన్స్) సంస్థ నిర్మిస్తోన్న రెండో సినిమా ఇది.

స్వాతి రెడ్డి (కలర్స్ స్వాతి), నిఖిల్ దేవాదుల (బాహుబలి ఫేమ్), నిత్యశ్రీ (కేరాఫ్ కంచరపాలెం ఫేమ్), రాజేంద్ర గౌడ్, సిద్దార్థ్ (90స్ ఫేమ్), హర్ష, పవన్ రమేష్, నరేందర్ నాగులూరి, సురేష్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం: సిద్ధార్థ్ సదాశివుని, ఎడిటర్: అరుణ్ తాచోత్, ఆర్ట్ డైరెక్టర్: తిపోజి దివ్య.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.

బీహార్ అభ్యర్థుల్లో 12 మందిపై క్రిమినల్ కేసులు..

పూర్నియా అభ్యర్థిపై 41 కేసులు



పాట్నా : బీహార్‌లోని ఐదు లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తున్న మొత్తం 50 మంది అభ్యర్థుల్లో 24 శాతం (12) మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 18 శాతం (9) మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక తెలిపింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) బుధవారం ఈ నివేదికను విడుదల చేసింది.

పూర్నియా నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజేష్ రంజన్ అలియాస్ పప్పుయాదవ్‌పై అత్యధికంగా 41 కేసులు ఉన్నట్టు సర్వే తెలిపింది. పూర్నియా నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీపీఐ(ఎం) నేత అజిత్ సర్కార్ హత్య కేసులో పప్పుయాదవ్ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలిపింది. 1998 జూన్‌లో పట్టపగలు అజిత్‌సర్కార్‌ను పప్పుయాదవ్ గ్యాంగ్ హత్య చేసింది.

మొత్తం ఐదు స్థానాల్లో పోటీ చేస్తున్న అధికారిక కూటమి పార్టీ జేడీ(యూ) అభ్యర్థుల్లో 40 శాతం మంది క్రిమినల్ కేసులు, 20 శాతం మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. ప్రతిపక్ష కూటమి మహాఘట్బంధన్‌లోని ఆర్‌జెడి రెండు స్థానాల్లో పోటీ చేస్తోంది. అభ్యర్థుల్లో 50 శాతం మంది క్రిమినల్ కేసులు, తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ఎఐఎంఐఎం కిషన్ గంజ్ స్థానంలో పోటీ చేస్తుండగా, వందశాతం మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు, తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు తేలింది.

అభ్యర్థులంతా సంపన్నులే..

అభ్యర్థుల్లో 28 శాతం (14) మంది కోటి కన్నా ఎక్కువ ఆస్తులను కలిగి ఉన్నట్లు ప్రకటించారు. భగల్పూర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి అజిత్ శర్మ అత్యంత సంపన్న వ్యక్తిగా నిలిచారు. ఆయన ఆస్తుల విలువ రూ.54 కోట్లుగా ప్రకటించారు. కిషన్‌గంజ్, కతిహార్ స్థానాలకు ప్రకటించిన కాంగ్రెస్ అభ్యర్థులు మొహమ్మద్ జావేద్, తారిక్ అన్వర్‌ల ఆస్తుల విలువ వరుసగా రూ. 18 కోట్లు, రూ.15 కోట్లుగా ప్రకటించారు. పప్పుయాదవ్ ఆస్తుల విలువ సుమారు రూ.10 కోట్లుగా ఉంది. అభ్యర్థుల్లో ఒకరు మాత్రమే డిప్లొమా హోల్డర్‌గా ప్రకటించారు. 7గురు అభ్యర్థులు కేవలం 'అక్షరాస్యులు'గా తెలిపారు. 36 శాతం (16) మంది అభ్యర్థులు 12వ తరగతి వరకు చదువుకున్నారు. 26 శాతం (52) మంది గ్రాడ్యుయేట్లు లేదా అంతకంటే ఎక్కువగా ప్రకటించారు. 50 మంది అభ్యర్థుల్లో కేవలం (6శాతం) ముగ్గురు మహిళా అభ్యర్థులు ఉండగా, 14 శాతం (7) మంది అభ్యర్థుల వయస్సు 61 పైన ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక తెలిపింది.

బీజేపీ అభ్యర్థుల మార్పు?

- పెద్దపల్లి బరిలో వెంకటేశ్‌ను దింపే యత్నం
- నల్లగొండ అభ్యర్థి సైదిరెడ్డి అభ్యర్థిత్వంపైనా గుర్రు
- మార్చాల్సిందేనంటూ పట్టుబడుతున్న జిల్లా నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ఎంపీ అభ్యర్థుల మార్పు అంశం మరోమారు చర్చనీయాంశమవుతున్నది. పెద్దపల్లిలో గోమాస శ్రీనివాస్ స్థానంలో సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్‌ను బరిలోకి దింపాలని యత్నిస్తోంది. ఆ దిశగా ఢిల్లీ నాయకత్వం వడివడిగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థుల ప్రచారంపై నిఘా పెట్టిన నాయకత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అభ్యర్థులు నియోజకవర్గాలు దాటకుండా ప్రతిరోజూ ప్రచారపర్వంలో దూకుడు పెంచాలని ఇప్పటికే ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా తన నియోజకవర్గాన్ని, హైదరాబాద్‌ను విడిచి ఎక్కడకు వెళ్లడం లేదు. ఆయన ప్రచార పర్వంలో మునిగిపోయిన సంగతి తెలిసిందే. పెద్దపల్లి నుంచి ఆ పార్టీ తరఫున బరిలో దిగిన శ్రీనివాస్ బలమైన అభ్యర్థి కాదనీ, ప్రచారంలోనూ వెనుకబడుతున్నాడని అమిత్‌షా టీమ్ గుర్తించింది. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు పూనుకున్నది. ఆ నియోజకవర్గంలో సొంత పార్టీ నుంచి వివేక్ పోయిన తర్వాత బీజేపీకి పెద్దపల్లిపై పెద్దగా పట్టు లేకుండా పోయింది. వివేక్ కాంగ్రెస్‌కుపోయి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆయన కొడుకు గడ్డం వంశీ పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మారాడు. గులాబీ పార్టీలో సీటు దక్కదనే నిర్ధారణకు వచ్చిన సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్ కాంగ్రెస్‌లో చేరాడు. నేతకాని వెంకటేశ్‌కు కాంగ్రెస్‌లోనూ నిరాశే ఎదురైంది. చర్చోపచర్చల తర్వాత వంశీ అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ ఖరారు చేసింది. దీంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న నేతకాని వెంకటేశ్‌ను బీజేపీ దగ్గరకు తీసుకుంటున్నది. ఆ నియోజకవర్గం నుంచి ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించే అవకాశముందనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తున్నది. దీనికి ససేమిరా అంటున్న గోమాస శ్రీనివాస్‌ను బుజ్జగించేందుకు యత్నిస్తోంది. సీటు కన్ఫామ్ చేస్తేనే పార్టీలోకి వస్తానని వెంకటేశ్ మెలిక పెట్టినట్టు తెలిసింది. పెద్దపల్లి అభ్యర్థి మార్పుపై రెండు, మూడు రోజుల్లో మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది. నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచిన సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆ జిల్లా యంత్రాంగం అంగీకరించే పరిస్థితిలో లేదు. రాష్ట్ర నాయకత్వంలోని కొందరు కీలక నేతలు కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని నేటికీ బలంగా వ్యతిరేకిస్తున్నారనే ప్రచారముంది. ఆర్థిక అంగుఅర్భాటాలున్న తేరా చిన్నపరెడ్డినిగానీ, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బలమైన ఓటుబ్యాంకు ఉన్న బీసీ సామాజిక తరగతికి చెందిన రామరాజు యాదవ్‌ను గానీ బరిలో దింపాలనే ఒత్తిడి రాష్ట్ర నాయకత్వంపై ఉంది. సామాజికంగా ఓకేగానీ, ఆర్థికంగా మిగతా ఇద్దరితో రామరాజు సరితూగడనే చర్చనడుస్తున్నది. మొత్తంగా ఈ రెండు నియోజకవర్గాల అభ్యర్థులను మారుస్తారా? అట్లాగే కొనసాగిస్తారా? అలాగైతే సీటుపై ఆశపెట్టుకుని పార్టీలో చేరిన నేతలకు ఏవిధంగా సర్దిచెప్తారు? తదితర అంశాలపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

బెంగాల్ గవర్నర్ కూచ్‌బెహార్ పర్యటన కోడ్ ఉల్లంఘనే : ఈసీ

న్యూఢిల్లీ : కూచ్‌బెహార్ పర్యటనపై పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి. ఆనంద్‌బోస్‌ని ఎలక్షన్ కమిషన్ (ఈసీ) బుధవారం హెచ్చరించింది. నార్త్‌బెంగాల్‌లోని కూచ్ బెహార్‌లో ఏప్రిల్ 18, 19 తేదీలలో పర్యటించాలని గవర్నర్ నిర్ణయించారు. అయితే ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్ జరగనున్నందున నేటి సాయంత్రం నుండి సైలెన్స్ అవర్ ప్రారంభమవుతుందని ఇసి పేర్కొంది. దీంతో ఈ సమయంలో గవర్నర్ పర్యటన ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని ఉల్లంఘించినట్లేనని హెచ్చరించింది. సైలెన్స్ అవర్ ప్రారంభమైన తరుణంలో సంబంధిత నియోజకవర్గంలోని ఓటర్లు కాని విఐపిలు, రాజకీయ నేతలు ఆ ప్రాంతాన్ని వీడాల్సి వుందని ఇసి ప్రామాణికంగా ఆదేశించింది. ఇది నియోజకవర్గంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడానికి అత్యసరమని ఇసి పేర్కొంది. విఐపిలు ఆ ప్రాంతాన్ని సందర్శిస్తే వారికి రక్షణ కల్పించాల్సిన అదనపు బాధ్యత భద్రతా దళాలపై పడుతుందని హెచ్చరించింది.

ట్యాప్ చేస్తున్న దర్యాప్తు సంస్థలు..డీఎంకే

చెన్నై : కేంద్ర దర్యాప్తు సంస్థలు తమ మొబైల్ ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నాయంటూ తమిళనాడు అధికార పార్టీ డిఎంకె మంగళవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కి ఫిర్యాదు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు లోక్‌సభ అభ్యర్థులు సహా తమ పార్టీ నేతలు, వారి స్నేహితులు, సమీప బంధువుల ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నారని డీఎంకే నేత ఆర్.ఎస్. భారతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల్లో నిర్దిష్ట సమూహానికి ప్రయోజనం కల్పించేందుకు దర్యాప్తు సంస్థలు అక్రమ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి తమ ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నాయని వెల్లడించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, ఐటీ లతో పాటు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఇతర దర్యాప్తు సంస్థలు తమ అభ్యర్థులు, ఫ్రంట్ లైన్ నేతలు, వారి స్నేహితులు, సమీప బంధువుల ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నారని గుర్తించామని ఆర్.ఎస్. భారతి ఈసీఐకి లేఖ రాశారు. పెగాసెస్ వంటి సాఫ్ట్‌వేర్‌ను రాజకీయ ప్రత్యర్థుల ఫోన్‌లలో చొప్పించిన వాస్తవాన్ని విస్మరించలేమని అన్నారు.

మత రాజకీయాలు చెల్లవ్

- కులం, మతం పేరుతో వచ్చే వారిని జనం నమ్మరు
- సంజయ్ కనీసం గుడి, బడి కూడా తేలేదు
- పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా..
- కరీంనగర్‌కు ఎంపీగా స్మార్ట్‌సిటీని సాధించా
- రైల్వేలైన్లు, జాతీయ రహదారులు తీసుకొచ్చా..
- అభివృద్ధి కాంక్ష, తెలంగాణ బాగోగుల గురించే పరితపించేవాన్ని
- ఏ కేసులూ ప్రభావితం చేయబోవు
- కరీంనగర్ ట్రైయాంగిల్ పోటీలో విజయం పక్కా నాదే.. : 'నవతెలంగాణతో' బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



దేశంలో నెల వ్యవధిలో పార్లమెంట్ ఎన్నికల పోరు జరగనుంది. ప్రస్తుతం ఆ ఎన్నికల సమర సన్నాహాల్లో మునిగిన రాజకీయ పార్టీలన్నీ గెలుపోటములపై సర్వేలు చేసుకుంటూ క్యాడర్‌తో సమావేశాలు.. జనంలో ప్రచారానికి దిగాయి. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణకు కీలక స్థానంగా ఉన్న కరీంనగర్‌పైనే అందరి దృష్టి ఉందనడంలో అతిశయోక్తి లేదు. అలాంటి స్థానం నుంచి బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచీ కేసీఆర్ వెన్నంటి ఉంటూ వస్తున్న బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ మరోమారు రంగంలోకి దిగారు. తెలంగాణ సాధన మొదలు.. రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించడమేగాకుండా గతంలో ఎంపీగా కరీంనగర్‌కు తెచ్చిన ప్రాజెక్టులు, భవిష్యత్‌లో చేయబోయే పనులూ వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో మత రాజకీయాలు చెల్లవన్నారు. కులం, మతం పేరుతో వచ్చే వారిని జనం నమ్మే పరిస్థితి లేదని చెబుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన దశలో పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తామా? అన్న అనుమానాల నుంచి ఖచ్చితంగా గెలుస్తామనే ధైర్యం వచ్చిందంటూ చెబుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌తో 'నవతెలంగాణ' ముఖాముఖి.

నవతెలంగాణ : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ప్రస్తుతం ఈడీ కేసులు, ఫోన్‌ట్యాపింగ్ వంటి ప్రతికూల అంశాలు మీ గెలుపును ప్రభావితం చేసే అవకాశం ఉందా?

వినోద్‌కుమార్ : రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయిన వారం, పది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తామా? అంటూ పార్టీ క్యాడర్ నుంచే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలో గెలుపోటములు, సమయానుకూలంగా మారే రాజకీయ పరిస్థితులను క్యాడర్‌కు వివరించాను. సరిగ్గా మూన్నెళ్ల తరువాత ఆ క్యాడరే ఇప్పుడు మనం గెలుస్తున్నాం అన్నా! అంటూ ధీమా వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ హామీలకు మోసపోయామనే భావన ప్రజల్లో పెరిగింది. ప్రధానంగా రైతాంగమంతా రాష్ట్ర ప్రభుత్వంపై భగ్గుమంటోంది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఉద్దెర గ్యారంటీలనేది తేలిపోయింది. అదే పార్లమెంట్ ఎన్నికల్లో ఖచ్చితంగా ప్రజలు ఆశీర్వదిస్తారనడానికి తార్కాణంగా చెప్పొచ్చు. ఇక ప్రస్తుతం కవితపై కేసులు, అరెస్టులు, ఫోన్‌ట్యాపింగ్ వంటి రాజకీయ క్రీడను సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారు. మా నాయకత్వంపై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని త్వరలోనే తేలుతుంది.



మీరు నాన్‌లోకల్ అనే అంశంపై మీ ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ప్రచారానికి ఎలా స్పందిస్తారు?

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు ఎక్కడి నుంచి అయినా పోటీ చేయొచ్చు. నేను నాన్‌లోకల్ అని ఆరోపిస్తున్న వారికి ఒకటే సమాధానం. నేను పుట్టింది కరీంనగర్‌లోనే. నా తల్లిగారి ఊరూ ఇక్కడే. 2004లో హన్మకొండ ఎంపీగా నేను పని చేసిన సమయంలో.. అప్పుడు వరంగల్ నుంచి కరీంనగర్ సిటీని ఆనుకుని ఉన్న మానకొండూర్ వరకూ తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఉండేవి. నాన్‌లోకల్ అంటూ మాట్లాడుతున్న రెండు జాతీయపార్టీల అధినేతలు రాహుల్‌గాంధీ, మోడీ తమ రాష్ట్రాలను వదిలి వేరే రాష్ట్రాల్లో పోటీ చేసిన విషయం ప్రజలకు తెలియంది కాదు. నన్ను రాజకీయంగా, ప్రజల్లో తనపై ఉన్న ఆదరణను ఎదుర్కోలేకనే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నారు.

గతంలో ఎంపీగా మీరు చేసిన అభివృద్ధి పనులు ఏంటి..?

స్మార్ట్‌సిటీ హోదాకు 10లక్షల జనాభా ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ.. కేవలం 3లక్షల జనాభానే ఉన్న కరీంనగర్‌కు అప్పటి సీఎం కేసీఆర్ సహకారంతో తీసుకొచ్చిన. సుమారు రూ.వెయ్యికోట్ల స్మార్ట్‌సిటీ ప్రాజెక్టును సాధిస్తే.. ఇప్పుడు ఆ ఫలాలు ప్రజలు అందుకుంటున్నదీ తెలిసిందే. కొత్తపల్లి - మనోహరాబాద్ ప్రాజెక్టును రైల్వేశాఖ పక్కన పెడితే రాష్ట్ర సర్కారుతో కావాల్సిన భూమి సేకరించి, వ్యయంలో సగం భరించేలా ఒప్పించాను. ఆ కృషే రైల్వే లైను పట్టాలెక్కేలా చేసింది. 2014 కంటే ముందు కరీంనగర్‌లో ఒక్క జాతీయ రహదారి లేదు. విషయం పార్లమెంట్‌లో లేవనెత్తడమేగాకుండా సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖతో కొట్లాడి ఎల్కతుర్తి, హుస్నాబాద్ టూ సిద్దిపేట, మెదక్ వరకు 133కిలో మీటర్ల ఎన్‌హెచ్765డీజీ, జగిత్యాల-కరీంనగర్-వరంగల్ వరకు 216కిలోమీటర్ల ఎన్‌హెచ్-563 జాతీయ రహదారులు తీసుకొచ్చాను. కేంద్రం నుంచి రూ.3400కోట్లు మంజూరు చేయించాను. రామగుండం వయా కరీంనగర్ టూ హైదరాబాద్‌గా ఉన్న రాష్ట్ర రహదారిని సైతం ఎక్స్‌ప్రెస్ హైవేగా మార్చాలని లోక్‌సభలో గళమెత్తాను. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంపీగా, తరువాత ఐదేండ్లు రాష్ట్ర ప్లానింగ్‌బోర్డ్ వైస్‌చైర్మెన్‌గా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో విద్య, వైద్యం, క్రీడలు, ఇరిగేషన్ వంటి రంగాల్లో అనేక అభివృద్ధి పనులు చేయించాను.



మీ ప్రచార అస్త్రాలు ఏమిటి?

కాంగ్రెస్ పార్టీ ఇంకా తమ అభ్యర్థిని ప్రకటించలేదు. పైగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఉచిత పథకాలన్నీ ఉద్దెర పథకాలని తేలిపోయింది. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ప్రస్తుత ఎంపీ బండి సంజయ్.. కనీసం గుడి, బడి కూడా తేలేని అసమర్థ ఎంపీగా మిగిలిపోయారు. ఇప్పుడు కులం, మతం పేరుతో మళ్లీ రాజకీయం చేస్తామంటే ప్రజలు ఛీత్కరిస్తారు. 2019 ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఓట్లు, అప్పుడు ఎమ్మెల్యేగా ఓడిపోయాడనే సానుభూతే సంజయ్ గెలుపునకు కారణమయ్యాయి. అభివృద్ధి ఎజెండా, ప్రజల ఆకాంక్షలేంటనే సోయి కూడా లేని సంజయ్ ఐదేండ్ల తన పదవీకాలంలో చేసిందేమీ లేక, లోకల్, నాన్‌లోకల్ అనే అంశాన్ని ఎత్తుకున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. మన ప్రాంతానికి ఎవరు అభివృద్ధి చేశారు? ఎవరు పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నిలుస్తారనే స్పష్టత ప్రజల్లో ఉంది. ఈ ఎన్నికల్లో ప్రజలు నన్ను ఆశీర్వదిస్తారనే నిజం రాబోయే ఎన్నికల ఫలితాల్లోనే తేలిపోతుంది.

బండోజు శ్రీకాంత్,
కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి, నవతెలంగాణ

నేటి నుంచి బీజేపీ అభ్యర్థుల నామినేషన్లు

- హాజరుకానున్న కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు
- మొదటిరోజే నామినేషన్లు వేయనున్న డీకే అరుణ, ఈటల, రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అభ్యర్థులు నేటి నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు పాల్గొననున్నారు. తొలిరోజు మల్కాజిగిరి స్థానం నుంచి ఈటల రాజేందర్, మెదక్ నుంచి రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ నామినేషన్లు వేయనున్నారు. మహబూబ్ నగర్‌లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, మెదక్‌లో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, మల్కాజిగిరిలో కేంద్ర మంత్రి హరిదీప్‌సింగ్ పూరీ ముఖ్యఅతిథులు పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం సికింద్రాబాద్, సిక్ విలేజ్ లో జువెల్ గార్డెన్లో మాజీ సైనికులతో జరిగే సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ హాజరవుతారని తెలిపారు. 19న సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి, ఖమ్మం నుంచి తాండ్ర వినోద్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నండగా ఆ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా రాజ్‌నాథ్‌సింగ్ హాజరుకానున్నారు. 22న జహీరాబాద్ నుంచి బీబీపాటిల్, చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నల్లగొండ నుంచి సైదిరెడ్డి, మహబూబాబాద్ నుంచి సీతారాంనాయక్ నామినేషన్లు వేయనున్నారు. ఆ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రులు పీయూష్‌గోయల్, కిరణ్ రిజిజు పాల్గొననున్నారు. 23న బూర నర్సయ్య భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నారు. 24న పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్, ఆదిలాబాద్ నుంచి గోడం నగేశ్, హైదరాబాద్ నుంచి మాధవీలత, వరంగల్ నుంచి ఆరూరి రమేశ్ నామినేషన్లు వేస్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, అనురాగ్ ఠాకూర్, ఛత్తీస్‌గఢ్ సీఎం శ్రీవిష్ణు దేవ్‌సాయి పాల్గొంటారు. 25న కరీంనగర్ నుంచి బండి సంజయ్ నామినేషన్ వేయనుండగా ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుజరాత్ సీఎం భూపేంద్ర పాటిల్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరుకానున్నారు. నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్, నాగర్ కర్నూల్ నుంచి పోతుగంటి భరత్ నామినేన్లు దాఖలు చేయనుండగా ఆ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, గుజరాత్ సీఎం భూపేంద్ర పాటిల్, కిషన్‌రెడ్డి పాల్గొంటారు.



బీజేపీ గూండాల ముఠాగా ఈడీ

సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ విమర్శ

అలప్పుజ: బీజేపీ గూండాల ముఠాగా ఈడీ వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ బుధవారం విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విజయన్ కుమార్తె టి వీణా యాజమాన్యంలోని ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన నెలవారీ చెల్లింపులు వివాదంపై ఈడీ దర్యాప్తు గురించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ దర్యాప్తుపై సీపీఐ(ఎం) స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు.

అయితే 2024 ఎన్నికలకు ముందు బీజేపీకి అనుకూలమైన రాజకీయ వాతావరణాన్ని సృష్టించేందుకు ఇడి ప్రయత్నిస్తోందని విమర్శించారు. 'ఈడీ విచారణ చేసి ఎవరినైనా అరెస్టు చేయనివ్వండి. ఈడీ అనేది బీజేపీ, కేంద్ర ప్రభుత్వ గూండాల ముఠా. ఇది ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించడం లేదు. ఏప్రిల్ 26 తరువాత ఈడీ దర్యాప్తు హంగామా ముగుస్తుంది' అని గోవిందన్ అన్నారు. ఈ వివాదంలో ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడాన్ని ఖండించారు.

అలాగే, కరువన్నూరు బ్యాంకు కుంభకోణం విషయంలోనూ ప్రధానమంత్రి మోడీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 'ఈ కుంభకోణం దర్యాప్తులో క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో కనుగొన్న విషయాలకు మించి ఈడీ ఏమీ కనుగొనలేదు.

మెచ్యూర్డ్ డిపాజిట్లలో కేవలం రూ 51 కోట్లు మాత్రమే రావాల్సి ఉంది. ఎక్కువ మంది బ్యాంక్‌లో తమ ఖాతాలను పునరుద్ధరించుకున్నారు. కానీ ప్రధానిమంత్రి మాత్రం ఒక దిగువస్థాయి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా మట్లాడుతున్నారు' అని గోవిందన్ పేర్కొన్నారు.

జీవ నదుల చెంత.. నీటికి చింత

కృష్ణ, బీమా నదుల ప్రవేశం దగ్గరే నీటి కోసం అవస్థలు

- ఎగువ ప్రాంతం పేరుతో పనులు జరగని మిషన్ భగీరథ
- తంగెడు, సుకూర్ లింగంపల్లి గ్రామాల దగ్గర కృష్ణా నీరు జిల్లాలోకి ప్రవేశం
- అయినా తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులే దిక్కు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నదీ సమీప ప్రజలు





చుట్టూ జీవనదులు ప్రవహిస్తున్నా.. గొంతు తడుపుకోవడానికి కూడా అల్లాడాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.. సుదూర ప్రాంతాలలో పట్టణాలకు మిషన్‌భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్న కృష్ణానది.. దాని పక్కనే ఉంటున్న వేలాది మంది ప్రజల గొంతు మాత్రం తడపడం లేదు. కృష్ణానది ఎగువ ప్రాంతం అయిన కర్నాటక, మహారాష్ట్ర ప్రాజెక్టుల్లో సరిపడా నీళ్లు ఉన్నా.. దిగువ ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం కటకట ఆడాల్సిందే. వేల కోట్లు ఖర్చు చేసి తాగునీటి అవసరాలు తీర్చామని గత ప్రభుత్వం ఆర్భాటం చేసినప్పటికీ కూతవేటు దూరంలో ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలకు తాగునీరు అందివ్వలేకపోయిందన్న విమర్శ మూటగట్టుకుంది.

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలో తంగెడు గ్రామం సంగమం దగ్గర కృష్ణానది జిల్లాలో ప్రవేశిస్తుంది. అదే గ్రామంలో సుకూర్, లింగంపల్లి దగ్గర బీమా నది వచ్చి కృష్ణానదిలో చేరుతోంది. రెండు ప్రధాన నదులున్నా.. వేసవి వచ్చిందంటే ఇక్కడ తాగునీటికి ఘోస తప్పడం లేదు. గత పాలకులు మిషన్‌భగీరథ పథకం పేరుతో వేల కోట్లు ఖర్చు చేశారు. ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఎగువ ప్రాంతంలో ఉండటం వల్ల మోటార్లు ఎత్తుకు నీటిని అందివ్వలేవన్న కారణం చూపి మిషన్ భగీరథ పథకం ఇక్కడ అమలు కాలేదు. తాగునీటి సమస్య తీర్చడానికి ఈ ప్రాంతంలో లిఫ్టులు ఏర్పాటు చేశారు. తంగెడి లిఫ్ట, స్వయం భూలక్ష్మి వెంకటేశ్వర లిఫ్ట పేరుతో రెండు లిఫ్టులు, ముడిమాల్ లిఫ్ట, క్షీర లింగేశ్వర లిఫ్టులను ఏర్పాటు చేశారు. ఈ లిఫ్టుల ద్వారా వరదలు వచ్చే సమయంలోనే తాగునీటి సరఫరా చేస్తారు. వేసవిలో వరదలు ఆగి జలాలు వెనక్కి వెళ్లిపోతే.. ఇక్కడ చుక్క నీటి నిల్వ ఉండదు. శుకూర్‌లింగంపల్లి, అయినాపూర్, కూసుమర్తి, తంగెడి, కృష్ణ, ఇందూపూర్, ముడిమాల్, గుడెబల్లూరు గ్రామాల్లో వేసవిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

బోరుబావులు, వ్యవసాయ బోర్లే ఆధారం..

కృష్ణ మండల పరిధిలో 40 వేల జనాభా ఉంటుంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవించే వీరికి సాగునీరు లేదు.. తాగునీటికి సైతం కష్టంగా ఉంటుంది. భూగర్భ జలాలు పడిపోయి బోరు బావులు ఎండిపోతే తాగునీటి సమస్య మరింత తీవ్రంగా మారింది. రిజర్వాయర్లు లేకపోవడంతో సాగు భూములకు నీరు అందడం లేదు. తాగునీటి అవసరాల కోసమైనా రిజర్వాయరు ఏర్పాటు చేస్తే.. వేసవిలో తాగునీటి సమస్య తీరనుంది. కొండల మీద ఉన్న గ్రామాలకు తాగుసాగు నీరు ఇచ్చే టెక్నాలజీ ఉన్న కాలంలోనూ ఈ ప్రాంత ప్రజల సమస్య తీరడం లేదు.

ఎగువ ప్రాజెక్టుల వల్లే నీటి సమస్య

కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణానది ఎగువన చెక్‌డ్యాంలు, బ్రిడ్జీలు కం బ్యారేజీల నిర్మాణం చేశాయి. వేసవి కాలంలో ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకుంటున్నాయి. అందుకే వేసవిలో మనకు నీటి సమస్య ఏర్పడుతోంది. మనకు కూడా నీటి సమస్య రాకుండా ఉండాలంటే ఇక్కడ రిజర్వాయర్‌లు నిర్మాణం చేసుకోవాలి. వరదలు వచ్చినప్పుడు నిల్వ చేసుకుంటే నీటి సమస్య తీరుతుంది. ఆ దిశగా ప్రభుత్వం పనిచేయాల్సి ఉంది.

తాగునీటి కోసం తండ్లాడుతున్నాం.

కున్ని వెంకటేష్, తంగెడి గ్రామం నారాయణపేట జిల్లా

మా భూములు వరదలు వస్తే మునుగుతాయి. కానీ ఎండాకాలం వస్తే తాగునీరు కూడా దొరకదు. కృష్ణా, బీమా నదులు రెండు కిలోమీటర్ల దూరాన ఉన్నా.. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో బోరుబావులు, ట్యాంకర్ల నీటినే వాడాల్సి వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

మిషన్ భగీరథ నీటిని ఎందుకు సరఫరా చేయడం లేదు

వెంకట్‌రాంరెడ్డి గవినోళ్ల, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

నదికి రెండు వందల కిలోమీటర్ల దూరాన ఉన్న నగరాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరాన ఉన్న కృష్ణ మండలంలో తాగునీటి సమస్య తీర్చడం లేదు. గత పాలకులు మిషన్‌భగీరథ పేరుతో హడావుడి చేసి అధికారంలోకి వచ్చారు. చిత్తశుద్ధి ఉంటే తాగునీటి సమస్య పరిష్కారం కష్టమేమీకాదు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం తాగునీటిపై చర్యలు తీసుకోవాలి.

నీటి కొరత ఉంది.. సమస్య రాకుండా చూస్తున్నాం

ఎంపీడీఓ జానయ్య

కృష్ణ మండలంలో తాగునీటి ఎద్దడి ఉన్న మాట వాస్తవమే. ఈ ప్రాంతం ఎత్తున ఉండటంతో ఇక్కడికి మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదు. అయినా బోరు బావులు, వ్యవసాయ పంపు సెట్ల ద్వారా నీటిని అందజేస్తున్నాం. ఇక్కడ ఒక రిజర్వాయరు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ప్రజలకు నీటి కొరత రాకుండా ప్రయత్నం చేస్తున్నాం.

బిజినెస్

నాలుగేళ్లలో టెక్ పరిశ్రమలో 35% మంది మహిళ ఉద్యోగులు

- టీమ్‌లీజ్ డిజిటల్ అంచనా

న్యూఢిల్లీ : టెక్నాలజీ పరిశ్రమలో 2027 నాటికి మహిళా ఉద్యోగుల సంఖ్య 35 శాతానికి చేరొచ్చని టీమ్‌లీజ్ డిజిటల్ అంచనా వేసింది. ప్రస్తుతం 25 శాతం మంది మహిళా ఉద్యోగులున్నారని పేర్కొంది.. 'ఉమెన్ ఎట్ ది హార్ట్ ఆఫ్ ఇండియాస్ డిజిటల్ ఎవల్యూషన్' అనే శీర్షికతో ఆ సంస్థ ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. ఈ నివేదిక భారతదేశంలోని మహిళా టెక్ వర్క్‌ఫోర్స్‌లోని వివిధ అంశాలను పరిశీలించింది. రాబోయే రోజుల్లో క్వాంటం కంప్యూటింగ్ సైంటిస్ట్, బ్లాక్‌చెయిన్ డెవలపర్, ఎఐ ఎథిక్స్ ఆఫీసర్, ఎఐ పరిశోధకుడు, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, 5జి టెక్నాలజీ స్పెషలిస్ట్, ఎడ్జ్ కంప్యూటింగ్ స్పెషలిస్ట్ వంటి సాంకేతిక విభాగాల్లో అధిక డిమాండ్ ఉంటుందని పేర్కొంది

భారీ విస్తరణపై ఎంజి మోటార్ దృష్టి

న్యూఢిల్లీ : తృతీయ, నాలుగో శ్రేణీ నగరాలపై కీలక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు ఎంజి మోటార్ ఇండియా తెలిపింది. 2025 మార్చి నాటికి 270 నగరాల్లో 520 టచ్‌పాయింట్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ముగింపు నాటికి కొత్తగా 100 టచ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నామని ఎంజి మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతిందర్ సింగ్ బజ్వా తెలిపారు. ప్రతీ డీలర్‌షిప్‌లోనూ తమ అన్ని కొత్త మోడళ్లు ఉండేలా చూస్తామన్నారు. తమ తదుపరి జర్నీ ఎంజి 2.0 పట్ల చాలా ఆసక్తిగా ఉన్నామన్నారు. ప్రస్తుతం ఏడాదికి లక్ష యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నామని.. దీన్ని 3 లక్షలకు చేర్చాలని నిర్దేశించుకున్నామన్నారు. ఎంజి మోటార్ ఇటీవలే జెఎస్‌డబ్ల్యును సంయుక్త భాగస్వామిగా ఎంచుకుంది.

మూడేళ్లలో రూ.1000 కోట్ల టర్నోవర్ లక్ష్యం

- ది స్లీప్ కో-ఫౌండర్ ప్రియాంక సలోట్ వెల్లడి



హైదరాబాద్ : పరుపుల స్టార్టప్ కంపెనీ, కంఫర్ట్ టెక్ బ్రాండ్ ది స్లీప్ 2025 మార్చి ముగింపు నాటికి తెలుగు రాష్ట్రాల్లో రెట్టింపు స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ సంస్థ 75వ నూతన అవుట్‌లెట్‌ను హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ది స్లీప్ కో-ఫౌండర్ ప్రియాంక సలోట్ మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తమకు ప్రస్తుతం 12 స్టోర్లు ఉన్నాయన్నారు. ఏడాదిలో రెట్టింపు చేయాలని నిర్దేశించుకున్నామన్నారు. గతేడాది రూ.350 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో రూ.1,000 కోట్ల రెవెన్యూ అంచనా వేస్తున్నామన్నారు. భారత్‌లో పరుపుల వ్యాపార మార్కెట్ రూ.16వేల కోట్లుగా ఉందని.. ఇందులో 6-7వేల కోట్లు సంఘటిత మార్కెట్ కలిగి ఉందన్నారు. కేవలం రెండు సంవత్సరాలలో ఆరు రెట్ల వృద్ధిని సాధించామన్నారు. 2024 చివరి నాటికి దేశవ్యాప్తంగా 150 పైగా స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు మూడు దఫాల్లో రూ.374 కోట్ల నిధులు సమీకరించామన్నారు.

ఇన్విగా హెల్త్‌కేర్ ఈక్విటీ ఫండ్ ఏర్పాటు


హైదరాబాద్ : ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులో తేవడమే లక్ష్యంగా ఇన్విగా హెల్త్ కేర్ ప్రయివేటు కొత్తగా ఈక్విటీ ఫండ్‌ను ప్రారంభించినట్లు హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌సిజి) వ్యవస్థాపకుడు డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. వ్యవస్థాపకులకు మద్దతును అందించడానికి దాదాపుగా రూ.167 కోట్లు (20 మిలియన్ డాలర్లు) ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానవ శ్వాసకోశ వైరల్ వ్యాధుల కోసం వినూత్నరీకాంబినెంట్ వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిన బయోటెక్ స్టార్టప్ మైన్‌వాక్స్‌లో తొలి పెట్టుబడి పెట్టినట్లు ప్రకటించారు.

మహీంద్రా నుంచి కొత్త బొలెరో నియో ప్లస్



న్యూఢిల్లీ : మహీంద్రా అండ్ మహీంద్రా భారత మార్కెట్లోకి కొత్త బొలెరో నియో ప్లస్ మోడల్‌ను విడుదల చేసింది. ఈ సీటర్ వాహన ధరల శ్రేణీని రూ.11.39 లక్షలుగా- రూ.12.49 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ కొత్త వేరియంట్ ధర రూ.1.50 లక్షలు అధికంగా ఉంది.

ఇవి రంగంలోకి డైమ్లర్ ఇండియా



న్యూఢిల్లీ : ప్రముఖ వాణిజ్య వాహనాల కంపెనీ డైమ్లర్ ఇండియా విద్యుత్ రంగ వాహనాల విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. రవాణా పరిష్కారాలను డీకార్బనైజ్ చేయడానికి దీర్ఘకాలిక సంసిద్ధత కోసం వ్యూహాలను సిద్ధం చేశామని తెలిపింది. ఆల్-ఎలక్ట్రిక్, నెక్స్ట్-జనరేషన్ 'ఇ-క్యాంటర్' తో బ్యాటరీ ఎలక్ట్రిక్ మార్కెట్‌లోకి ప్రవేస్తున్నట్లు వెల్లడించింది. రాబోయే 6 నుండి 12 నెలల్లో భారతదేశ మార్కెట్ లోకి 'ఇ-క్యాంటర్'ను విడుదల చేయనున్నట్లు డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ సత్యకాం ఆర్య తెలిపారు.

అనన్యరెడ్డికి కేటీఆర్ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌లో సత్తా చాటిన తెలంగాణ బిడ్డలకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ సాధించి రాష్ట్ర ఖ్యాతిని చాటి చెప్పిన పాలమూరు బిడ్డ అనన్య రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెలంగాణకు వరుసగా రెండోసారి జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్ రావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వందలోపు నాలుగు ర్యాంకులు సాధించిన దోనూరు అనన్య రెడ్డి, నందాల సాయికిరణ్, కేఎన్ చందన జాహ్నవి, మెరుగు కౌశిక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. సివిల్స్ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 60 మంది ఎంపిక కావటమనేది ఎంతో ఆనందాన్నిచ్చిందని కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

విద్యార్థి ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యే

- డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థి ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యేనని బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి సిహెచ్. ప్రశాంత్ ఫుడ్ పాయిజన్‌కు గురై చికిత్స పొందుతూ మరణించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. సరైన సమయంలో వైద్య సహాయం అందకపోవడంతో ప్రశాంత్ చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే భువనగిరి సాంఘిక సంక్షేమ హాస్టల్లో గతంలో విద్యార్థులు చనిపోతే హాస్టల్ కి సంబంధించిన అధికారులకు,పోలీసు శాఖకు తెలంగాణ ఎస్సీ కమిషన్ నోటీసులు పంపించిందని గుర్తుచేశారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రశాంత్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

బతికేదెట్లా..

- ప్రభుత్వంపై ప్రజల అవిశ్వాసం..జీవనోపాధిపై ఆందోళన
- 72 శాతం మంది ఆదాయాల్లో పతనం
- ధరలు పెరిగాయని 90 శాతం మంది వెల్లడి
- సీఎస్‌డీఎస్-లోక్‌నీతి ప్రీపోల్ సర్వే

పేదలు ఆదాయాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పెద్దల సంపద పడగలెత్తుతోంది. మోడీ సర్కార్ మాత్రం పేదలు దారిద్ర్యరేఖకు ఎగువకు చేరుకుంటున్నారంటూ..గోడీ మీడియా, సర్కారు గణాంకాలు చూపుతూ ఓటు రాజకీయం చేస్తున్నాయి. వాస్తవానికి బడుగుల బతుకుల్లో ఆదాయాలు దిగజారాయి. దీనికి తోడు నిత్యావసరాల ధరలకు తోడు ఇతర ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ఈ విషయాలు సీఎస్‌డీఎస్-లోక్‌నీతి ప్రీపోల్ సర్వేలో వెల్లడయ్యాయి.

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా మెజారిటీ ప్రజలు తమ జీవనోపాధిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడింట ఒక వంతు మంది నిరాశాలో ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది మార్చిలో వెల్లడించిన వినియోగదారుల విశ్వాస సర్వేపై సీఎస్‌డీఎస్-లోక్‌నీతి ప్రీపోల్ సర్వే విశ్లేషణ నిర్వహించింది. ప్రస్తుతం హెచ్చు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆదాయాలు పడిపోవడం ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. ఇవి సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏకు ఎదురుగాలిగా నిలువనున్నాయి. ఈ ప్రీపోల్ సర్వేలో 32 శాతం మంది పెరుగుతున్న నిరుద్యోగంపై ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం కారణంగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి మూడింట ఒక్క వంతు మంది ఆసక్తి చూపడం లేదు.

ఆర్‌బీఐ ఇటీవల (మార్చి 2 నుంచి 8వ తేదీల మధ్య)19 నగరాల్లో నిర్వహించిన సర్వేలో 6,083 మంది అభిప్రాయాలను సేకరించింది. ఈ సర్వేలోనూ నిరుద్యోగం, ధరలు, ఆదాయాల తగ్గుదలపై ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఆర్‌బీఐ సర్వే ప్రకారం.. ఏడాది క్రితంతో పోల్చితే ఉపాధి అవకాశాలు పెరిగాయని.. అయినప్పటికీ 38 శాతం మంది నిరుద్యోగం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా ముందు నాటి స్థాయికి అవకాశాలు చేరుతున్నాయని పేర్కొన్నారు.

ఏడాది క్రితంతో పోల్చితే ఆదాయాలు చాలా తక్కువగా ఉన్నాయని 22 శాతం మంది



పేర్కొన్నారు. ఇంతక్రితం 2014-15 నాటి సర్వేతో పోల్చితే 10 శాతం అదనం ప్రతికూలత పెరిగింది. 27 శాతం మంది ఆదాయాలు పెరగ్గా.. 50 శాతం మంది ఆదాయాలు అలాగే ఉన్నాయి. ప్రతీ ఏడాది పెరుగుతున్న వస్తు ధరలు భారం అవుతున్నాయి.

ఆర్‌బీఐ సర్వే ప్రకారం.. ఏడాది క్రితంతో పోల్చితే ధరలు పెరిగాయని 90 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు అలాగే ఉన్నాయని 9 శాతం మంది, తగ్గాయని ఒక్క శాతం మంది ఆర్‌బీఐ సర్వేలో పేర్కొన్నారు. ఏడాది క్రితం ఆర్థిక వ్యవస్థ పేలవంగా ఉండగా.. ఇటీవల కొంత మెరుగు పడిందని తెలిపింది. ఆర్థిక వ్యవస్థ పట్ల ప్రజల్లో ఇప్పటికీ 2015-16 నాటి స్థాయికి విశ్వాసం చేరలేదు. ఏడాది క్రితంతో పోల్చితే ఆర్థిక వ్యవస్థ బాగోలేదని 36 శాతం మంది పేర్కొన్నారు.

మావోయిస్టులను వదలం

- రక్షణ ప్రాంతాలు లేకుండా చేస్తాం
- భారీ ఎన్‌కౌంటర్‌కు కొద్దిరోజుల ముందు ఇంటర్వ్యూలో బస్తర్ ఐజి

దండకారణ్యంలో 29 మంది మావోయిస్టులను బలిగొన్న కాంకర్ ఘటన కలకలం రేపింది. భద్రతా దళాల కాల్పుల్లో ఇంతపెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటనకు కొద్దిరోజుల ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మావోయిస్టులను వదలేది లేదని, దండకారణ్యంలో వారికున్న కొద్దిపాటి రక్షణ ప్రాంతాలను (సేఫ్ పాకెట్స్)ను లేకుండా చేస్తామని బస్తర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పి.సుందర్‌రాజ్ చెప్పారు. పదకొండేళ్ల పాటు మావోయిస్టు ప్రభావ ప్రాంతాల్లోనే వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన చెప్పిన విషయాలు క్లుప్తంగా:



ప్ర: ఎన్నికల ముందు ఎటువంటి భద్రతా చర్యలు తీసుకుంటున్నారు?

జ: బస్తర్‌లో 60 వేల మంది భద్రతా సిబ్బంది ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. వీరిలో మా ప్రత్యేక బృందాలతో పాటు, ఎన్నికల కమిషన్ పంపిన అదనపు బలగాల సిబ్బంది కూడా ఉన్నారు.

ప్ర: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐఇడి పేలుళ్లలో ఇద్దరు భద్రతా సిబ్బంది మరణించారు. ఈ సారి అటువంటి సంఘటనలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఐఇడిలు పెద్ద ముప్పుగా మారాయి. నిజానికి అవి మాకు సవాల్ విసురుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మందుపాతరలను నిర్వీర్యం చేసే చర్యలను పెద్దఎత్తున చేపట్టాం. వీటిని కొనసాగిస్తాం. ఇప్పటివరకు 55 మందుపాతరలు దొరికాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది చనిపోయింది నిజం. కానీ, గతంతో పోలిస్తే ఇటువంటి సంఘటనల్లో ప్రాణనష్టం కనిష్టస్థాయికి చేరింది.

ప్ర: మావోయిస్టులను అదుపు చేయడానికి ఎటువంటి వ్యూహాలను అమలు చేస్తున్నారు?

జ: మేం బహుముఖ విధానాలతో పనిచేస్తున్నాం. ప్రధానంగా మావోయిస్టుల కార్యక్రమాలను అదుపుచేయడంపై దృష్టి పెడుతున్నాం. అంతర్‌రాష్ట్ర కార్యకలాపాలపై నియంత్రణ సాధిస్తున్నాం. అదే సమయంలో మారుమూల ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాం. రోడ్లు, వంతెనలు, మొబైల్ నెట్ వర్క్‌తో ఈ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తున్నాం. దీనివల్ల ఇక్కడి ప్రజల మనస్సుల్లోంచి తాము ఒంటరి వాళ్లమన్న భావనను తుడిచివేస్తున్నాం.

ప్ర: గత ఏడాది (24) కాల్చివేయబడ్డ మావోయిస్టుల కంటే ఈ ఏడాది ఇప్పటికే (50) ఎక్కువమంది మావోయిస్టులు మరణించారు. (కాంకర్ ఘటన జరగలేదు) దీని ప్రభావం ఎన్నికల వేళ ఉండదా?

జ: మావోయిస్టు క్యాడర్ అంతరించి పోతున్నప్పటికీ, మాకు నష్టం కలిగించే వారి శక్తి, సామర్థ్యాలను తక్కువగా అంచనా వేయడం లేదు. మందుపాతరల రూపంలో ముప్పు పొంచే ఉంది, అవసరమైన చర్యలు తీసుకుంటూనే ఉన్నాం.

ప్ర: ఇటీవల జరిగిన సంఘటనలను బూటకపు ఎన్‌కౌంటర్లని కుటుంబ సభ్యులు ఆరోపించారు...?

జ: స్థానిక ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, భద్రతా బలగాలు తప్పు చేశాయన్న భావనను సృష్టించడానికి మావోయిస్టులు ఈ తరహా ప్రచారం చేస్తారు.

ప్ర: బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం ఎలా ఉంది?

జ: బీజాపూర్, సుక్మా,కంకేర్‌లో వారికి కొన్ని స్థావరాలు ఉన్నాయి. అక్కడ మేం కూడా స్థిరంగా ఉన్నాం. అబుజ్‌మడ్ వంటి కొన్ని ప్రాంతాల్లో సమస్య ఉంది. బీజాపూర్‌లోని నేషనల్ పార్కు సురక్షిత రవాణా మార్గంగా ఉంది. బీజాపూర్, సుక్మా వద్ద సరిహద్దుల్లోనూ ఈ తరహా ప్రాంతం ఉంది. ఇవి సీనియర్ మావోయిస్టులకు రక్షణ ప్రాంతాలుగా మారాయి. వీటిని వారు సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు. అక్కడ నుండి రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా రక్షణ పొందుతున్న మావోయిస్టులను ఎవరినీ వదలం. రక్షణ ప్రాంతాలు (సేఫ్ ప్యాకెట్లు)ను పూర్తిగా నిర్మూలిస్తాం.

ప్ర: 11 సంవత్సరాలు మీరు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోనే పనిచేశారు. మీ పరిశీలన ఏమిటి?

జ: నేను 2005-2006లో అవిభక్త బస్తర్‌లో ఎఎస్‌పిగా మొదట విధుల్లో చేరాను. 2004 నుండి 2014 వరకు మావోయిస్టుల కార్యక్రమాలు ఉధృతంగా సాగాయి. భద్రతా సిబ్బందితోపాటు, సామాన్య ప్రజలు కూడా ఈ కాలంలో పెద్ద ఎత్తున మరణించారు. అప్పుడు మా బలం కేవలం 25వేల మంది మాత్రమే. ఇప్పుడు దాదాపుగా లక్షమందిమి ఉన్నాము. సాంకేతిక అంశాల్లో స్పష్టమైన పైచేయి సాధించాం. జవాన్లకు జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ ఇచ్చాం. మొదట్లో కొంత సైద్ధాంతిక భావజాలంతో పనిచేసిన మావోయిస్టులు ఆ తరువాత ఎటువంటి భావజాలం లేకుండా పోయారు.

పదేండ్లలో నోటి ఆరోగ్యానికి కేటాయించిన నిధులెన్ని?

- వివరాలు లేవంటూ చేతెలెత్తేసిన కేంద్ర ఆరోగ్యశాఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సర్కారు గత పదేండ్లుగా ఆరోగ్య రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందనే విమర్శలను ఎదుర్కొంటున్నది. ప్రజారోగ్య రంగానికి నిధుల కేటాయింపులు తగ్గిస్తుండటంతో అనివార్యంగా ప్రజలు ప్రయివేటు వైద్యం వైపు నెట్టబడుతున్నారు. దీనికి తోడు గత పదేండ్లలో అమలు చేసిన కార్యక్రమాలు, తీసుకున్న చర్యల గురించి అడిగితే చెప్పలేని పరిస్థితిలో కేంద్రంలోని ఆరోగ్యశాఖ ఉంది. ఆల్ ఇండియా డెంటల్ స్టూడెట్స్ అండ్ డెంటల్ సర్జన్స్ అసోసియేషన్ నోటి ఆరోగ్యానికి సంబంధించి జాతీయ స్థాయిలో 2014 నుంచి 2024 వరకు పదేండ్ల పాటు కేటాయించిన నిధులెన్ని? అంటూ సమాచార హక్కు చట్టం కింద వివరాలను కోరింది. నోటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు, నోటికి సంబంధించిన రోగాల నివారణకు చేపట్టిన కార్యక్రమాలను తెలపాలని ఈ ఏడాది మార్చి 5న ఆ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మంజూర్ కోరారు. దంత ఆరోగ్యంలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, శిక్షణ, పరిశోధన, ప్రభుత్వ ఉద్యోగాల కల్పనతో పాటు అసోసియేషన్ అడిగిన వివరాలేవి అందుబాటులో లేవంటూ ఆరోగ్యశాఖ చేతులెత్తేసింది.

పారదర్శకత, జవాబుదారీతనమేది?
డాక్టర్ మహ్మద్ మంజూర్

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వివరాల్లేవంటూ ఇచ్చిన సమాధానం పట్ల ఆల్ ఇండియా డెంటల్ సర్జన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ మంజూర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డేటా లేదని చెప్పడం పేద ప్రజల నోటి ఆరోగ్యం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని తెలిపారు. ప్రభుత్వ సంస్థలు పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించకపోవడం ఆమోదనీయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖమ్మం బీఆర్ఎస్ సమన్వయకర్తలు వీరే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఖమ్మం పార్లమెంటుకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఒక ప్రకటన చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు (పాలేరు), డీసీసీబీ మాజీ చైర్మెన్ కురాకుల నాగభూషణం, సీనియర్ నాయకులు తాళ్ళూరి జీవన్ (వైరా) , మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు (మధిర), సీనియర్ నాయకులు ఉప్పలపాటి వెంకట రమణ (కొత్తగూడెం), సీనియర్ నాయకులు బీరెడ్డి నాగచంద్ర రెడ్డి (సత్తుపల్లి), సీనియర్ నాయకులు కోనేరు చిన్ని (అశ్వరావుపేట) సమన్వయకర్తలుగా నియమితులయ్యారు.

రైతుల కీలక సమస్యలను ప్రస్తావించడంలో బీజేపీ మ్యానిఫెస్టో విఫలం

- ఎఐకెఎస్ విమర్శ

న్యూఢిల్లీ : దేశ రైతాంగం ఎదుర్కొంటున్న కీలక సమస్యలను ప్రస్తావించడంలో బీజేపీ 2024 ఎన్నికల మ్యానిఫెస్టో విఫలమైందని ఎఐకెఎస్ విమర్శించింది. దేశంలోని యావత్తు రైతులు, వ్యవసాయ కార్మికులను బిజెపి మేనిఫెస్టో ప్రత్యక్షంగా అవమానించిందని ఎఐకెఎస్ పేర్కొంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అమలు, పంట సేకరణ, రైతు ఆత్మహత్యలు, రుణమాఫీ వంటి కీలకమైన అంశాలను మేనిఫెస్టో 2024లో ప్రస్తావించలేదని పేర్కొంది. నిజానికి 2014, 2019 మేనిఫెస్టోల్లో చేసిన పాత వాగ్దానాలనే తాజా మేనిఫెస్టోలో బిజెపి చేసిందని, అంటే పాత హామీలను అమలు చేయలేదని బీజేపీ స్పష్టంగా అంగీకరించినట్లయిందని ఎఐకెఎస్ తెలిపింది. దేశంలో తీవ్రంగా ఉన్న వ్యవసాయ సంక్షోభం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి బీజేపీ శాయశక్తులా కృషి చేసిందని ఎఐకెఎస్ ఎద్దేవా చేసింది.

ఎప్పటికప్పుడు ఎంఎస్‌పిని పెంచుతామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చినా.. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వ్యవసాయ వ్యయాలను బిజెపి పరిగణనలోకి తీసుకోలేదని ఎఐకెఎస్ ఆరోపించింది. 2014 నుంచి 2022 వరకూ 1,00,474 మంది అన్నదాతలు, 3,12,214 మంది రోజువారీ వేతన కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, అయినా వీరి కుటుంబాలకు 2014 మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఎలాంటి రుణ మాఫీ కానీ, ఆర్థిక సాయం కానీ చేయలేదని ఎఐకెఎస్ విమర్శించింది. అయితే 2014-15 నుంచి 2022-23 వరకూ కార్పొరేట్ సంస్థలకు రూ. 14.55 లక్షల కోట్లను మోడీ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని ఎఐకెఎస్ గుర్తు చేసింది. 2024 బిజెపి మేనిఫెస్టోను దేశంలోని రైతులు, వ్యవసాయ కార్మికులకు బహిరంగ సవాలుగా ఎఐకెఎస్ అభివర్ణించింది. వ్యవసాయ సమస్యల నుంచి తప్పించుకున్న బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఓటర్లకు ఎఐకెఎస్ విజ్ఞప్తి చేసింది.

సోషలిజమే మన ఊపిరి !

హవానా : 'మనలో చివరి ఊపిరి వున్నంతవరకూ మన జాతీయ పతాకాన్ని కాపాడుకుందాం' పార్టీ కార్యకర్తగా మన మాతృభూమికి, విప్లవానికి అంకితమవుతూ, ప్రజల పట్ల నిబద్ధతతో వుందాం. నిజమైన క్యూబన్ విప్లవ వీరుల మనో నిశ్చయమిదేనని అంతర్జాతీయ యోధుడు, రిజర్వ్ కెప్టెన్ పాస్టర్ కాంటెరో ఎచజబల్ వ్యాఖ్యానించారు. క్యూబా విప్లవ సోషలిస్టు స్వభావ ప్రకటన 63వ వార్షికోత్సవం సందర్భంగా నాటి పోరాట యోధులను స్మరించుకుంటూ మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

1961 ఏప్రిల్ 15న క్యూబా వైమానిక బలగాలపై అమెరికా జరిపిన దాడుల్లో మరణించిన వారి అంత్యక్రియల సందర్భంగా 16వ తేదీన హవానాలోని వదాడో జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కమాండర్ ఇన్ చీఫ్ ఫైడెల్ కాస్ట్రో రజ్ మాట్లాడిన మాటలు ఈనాటికీ ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. 'ఇలాంటి వీరులున్నందువల్లే లాటిన్ అమెరికా ప్రజలు స్వేచ్ఛగా వున్నారు, క్యూబా ప్రయాణంలో ఇదొక అత్యున్నతమైన రోజని' ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల కోసం ప్రజలు చేపట్టిన సామ్యవాద, ప్రజాస్వామ్య విప్లవమిదని వ్యాఖ్యానించారు.

దేశ అధ్యక్షుడు, క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ఫస్ట్ కార్యదర్శి మిగ్యెల్ డియాజ్ కానెల్, హవానా ప్రావిన్షియల్ కమిటీ ఫస్ట్ కార్యదర్శి లివాన్ ఇజెక్విర్డో అలోన్సోలు అధ్యక్షత వహించిన ఈ సంస్మరణ కార్యక్రమంలో పాస్టర్ కాంటెరో మాట్లాడుతూ, దాడులు జరుగుతున్న ఆనాటి రోజుల్లో కష్టాలు, ఇబ్బందుల మధ్యనే ప్రజలు అత్యున్నత నైతిక విలువలతో ఎదిగారని కొనియాడారు. హవానా పిసిసి ఫస్ట్ సెక్రటరీ అలోన్సో మాట్లాడుతూ, సామాజిక, ఆర్థికాంశాలకు సంబంధించి విప్లవం క్లిష్టమైన సమయాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో మనం ఈనాడు ఈ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అత్యంత పవిత్రమైన మన ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి క్రూరంగా, సాంప్రదాయేతర పద్ధతుల్లో యుద్ధం జరుగుతోందన్నారు. చివరగా లాంగ్ లివ్ ఫ్రీ క్యూబా అంటూ క్యూబా అధ్యక్షుని నినాదాలతో సభ ముగిసింది.

హామీలు నెరవేర్చడంలో మోడీ విఫలం: జి.రామకృష్ణన్

చెన్నై : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విఫలమయ్యారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో చెన్నై సెంట్రల్ స్థానం నుంచి పోటీ చేస్తున్న డిఎంకె అభ్యర్థి దయానిధి మారన్‌కు మద్దతుగా బుధవారం ధర్మపురం కాలనీలో ఇంటింటి ప్రచారంలో రామకృష్ణన్ పాల్గొన్నారు. గత ఎన్నికల్లో మోడీ ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, ధరల తగ్గింపు వంటి అనేక హామీలు ఇచ్చారని రామకృష్ణన్ గుర్తు చేశారు. మోడీ హామీ ప్రకారం గత ఐదేళ్లల్లో 20 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఆరు కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని విమర్శించారు. అలాగే ఎన్నికల బాండ్ల గురించి మాట్లాడుతూ నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి వాటిని వినియోగించుకున్నారని విమర్శించారు. ఈ ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి మారన్, సిపిఎం, కాంగ్రెస్, విసెకె కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో 12 వీధుల్లోని సుమారు 1,500 కంటే ఎక్కువ ఇళ్లల్లో ప్రచారం నిర్వహించారు.

దేశాన్ని నిర్బంధ శిబిరంగా మార్చిన బీజేపీ : మమత

సిల్చార్, (అస్సాం) : బీజేపీ యావత్ దేశాన్ని నిర్బంధ శిబిరంగా మార్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం విమర్శించారు. ఇలాంటి ప్రమాదకరమైన ఎన్నికలను తన జీవితంలో ఎన్నడూ చూడలేదని వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ), జాతీయ పౌరుల పట్టిక (ఎన్ఆర్‌సి), ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)లను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. వివక్షాపూరిత చట్టాలన్నింటినీ రద్దు చేస్తామన్నారు. అస్సాంలో పోటీ చేస్తున్న నలుగురు తృణమూల్ అభ్యర్థులకు మద్దతుగా ఇక్కడ ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. మూడోసారి కూడా ప్రధాని మోడీ అధికారంలోకి వస్తే ఇక ప్రజాస్వామ్యం, ఎన్నికలు వుండవని అన్నారు. అన్ని మతాలను తృణమూల్ ప్రేమిస్తుందని, మతం ప్రాతిపదికన ప్రజలను విభజించాలని కోరుకోదని చెప్పారు. అస్సాంలో తృణమూల్ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2026లో అస్సాంలో 126 సీట్లకు తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు.

ఎక్స్‌ను వారంలో పునరుద్ధరించండి

- పాక్ ప్రభుత్వానికి సింధ్ హైకోర్టు ఆదేశాలు

కరాచీ : సోషల్ మీడియా ఫ్లాట్‌ఫాం ఎక్స్ (గతంలో ట్విటర్)పై సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని, వారంలోగా పునరుద్ధరించాలని పాకిస్థాన్ హోం మంత్రిత్వ శాఖను సింధ్ హైకోర్టు బుధవారం ఆదేశించింది. ఎక్స్‌పై నిషేధానికి వ్యతిరేకంగా దాఖలైన అనేక పిటీషన్లను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అఖీల్ అహ్మద్ అబ్బాసీ 'ఎక్స్‌ను మూసివేయడం ద్వారా మీరు (హోం శాఖ) ఏం సాధించారు. ప్రపంచం మనల్ని చూసి నవ్వుతోంది' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు పంపిన పంపిన నివేదికలపై చర్యలు తీసుకునే అధికారాన్ని చట్టం హోం శాఖకు ఇవ్వలేదని ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పష్టం చేశారు. జాతీయ భద్రతా బెదిరింపులను సాకుగా చూపుతూ పాకిస్థాన్‌లో ఎక్స్‌పై ఫిబ్రవరిలో నిషేధం విధించారు. హోం శాఖ, ఇంటెలిజెన్స్ ఏజెన్సీల నుంచి మార్గదర్శకాల మేరకు ఎక్స్‌పై నిషేధం విధించినట్లు గత నెలలో కోర్టుకు పాకిస్థాన్ టెలికమ్యూనికేషన్స్ అథారిటీ (పిటిఎ) వెల్లడించింది.

రేవంత్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్‌ది దూప్‌ఫైట్

- సర్వేలన్నీ మాకే అనుకూలం : డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్‌ల మధ్య దూప్‌ఫైట్ నడుస్తున్నదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఆ పార్టీల తీరును గమనిస్తున్నారనీ, తెలంగాణలో సైలెంట్ ఓటింగ్‌తో బీజేపీకి అధిక ఎంపీ స్థానాలు రాబోతున్నాయని చెప్పారు. తెలంగాణలో బీజేపీని ఓడగొట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, కమ్యూనిస్టులు ఏకం అయ్యారన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ సాకుతో శ్రీరామనవమిని కాంగ్రెస్ పార్టీ రాజకీయ కోణంలో చూసిందని విమర్శించారు. సర్వేలన్నీ తమ పార్టీ వైపే ఉన్నాయనీ, కాంగ్రెస్ ముక్త్ భారత్ సాధ్యం కాబోతున్నదని చెప్పారు.

12 రాష్ట్రాల్లో కాంగ్రెస్ కు ఒక్క సీటు కూడా గెలవలేని పరిస్థితి ఉందన్నారు. కూటమిలో పార్టీలు కూడా కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదనీ, పంజాబ్, కేరళ, వెస్ట్ బెంగాల్, తమిళనాడులో ఇండియా కూటమిలోని పార్టీలు కాంగ్రెస్‌ను పట్టించుకోవడం లేదని చెప్పారు. దేశం మొత్తం మీద కూడా కాంగ్రెస్‌కు 40 సీట్లు రావని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల మధ్య ఆధిపత్యపోరుతో సీఎం రేవంత్‌రెడ్డి అభద్రతాభావంలోకి కూరుకుపోయారన్నారు. బీఆర్ఎస్-బీజేపీ ఒప్పందం వల్లనే కవితను అరెస్టు చేయడం లేదని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశారనీ, ఇప్పుడేమో ఆమె బెయిల్ కోసం బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కిషన్‌రెడ్డి ఈనెల 19న నామినేషన్ దాఖలు చేస్తారనీ, ఆ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

నవమి సందర్భంగా ప్రత్యేక పూజ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీతారామ కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ సీ.పీ.రాధాకష్ణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశం, రాష్ట్రం ప్రగతిని సాధించాలనీ, ప్రతి ఒక్కరికీ శుభం కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సతీమణి శ్రీమతి సుమతి రాధాకృష్ణన్, గవర్నర్ ముఖ్య కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.